




www.andhrajyothy.com

విజయవాడ సిటీ

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 308








శనివారం | 22-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి రా. 7.03 తదుపరి అమావాస్య; నక్షత్రం: శ్రవణం ఉ. 11.20 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: మ. 3.43-5.29; దుర్ముహూర్తం: ఉ. 6.42-8.15; అమృతఘడియలు: రా. 2.17-4.02; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 6.16

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


# బాబు సర్కార్‌పై సిట్





## ఇంటెలిజెన్స్ డీఐజీ నేతృత్వం

- సభ్యులంతా పోలీసు అధికారులే
- ఐదేళ్లపాలనపై 'టోకు'న దర్యాప్తు
- అన్ని కీలక నిర్ణయాలపై విచారణ
- ఎవరినైనా పిలిచి విచారించవచ్చు
- ఏ ఫైలునైనా తెప్పించుకోవచ్చు
- సిట్‌నే పోలీసు స్టేషన్‌గా పరిగణన
- సీఆర్పీసీ కింద విచారణ, కేసుల నమోదు
- మంత్రివర్గ ఉపసంఘ నివేదికే ప్రాతిపదిక
- స్పీకర్ కూడా ఆదేశించారని ప్రస్తావన



జీవో 344

ఒక్కటని కాదు! అదీ ఇదీ అనేమీ లేదు! 'హోల్‌సేల్'గా... సిట్! రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో తీసుకున్న, అమలు చేసిన అన్ని ప్రధాన నిర్ణయాలు, అప్పగించిన కాంట్రాక్టులు, ఏర్పాటు చేసిన సంస్థలన్నింటిపైనా దర్యాప్తు జరిపించాలని జగన్ సర్కారు తీర్మానించింది. దీనిపై ఇంటెలిజెన్స్ డీఐజీ కొల్లి రఘురామ్ రెడ్డి నేతృత్వంలో... మొత్తం 10 మంది పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. దీనిపై సాధారణ పరిపాలన విభాగం (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం రాత్రి జీవో నెంబరు 344 జారీ చేశారు.

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు ఐదేళ్ల సర్కారుపై జగన్ ప్రభుత్వం 'సిట్' వేసింది. అప్పట్లో అవకతవకలు జరిగాయంటూ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఇచ్చిందని... ఆ సంగతి తేల్చేందుకు ప్రత్యేక సంస్థ అవసరమని నిర్ణయించి... సిట్ ఏర్పాటు చేస్తున్నామంటూ జీవో విడుదల చేసింది. "రాష్ట్ర విభజన తర్వాత... నవ్యాంధ్ర అభివృద్ధిపై ప్రభావం చూపించేలా తీసుకున్న ప్రధాన విధానాలు, ప్రాజెక్టులు, పథకాలు, ఏర్పాటు చేసిన సంస్థలు (కార్పొరేషన్లు, సొసైటీలు, కంపెనీలు మొదలైనవి), ఇతర కీలకమైన పరిపాలనా నిర్ణయాలపై 2019 జూన్ 26వ తేదీన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. ఈ కమిటీ తన తొలి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. సీఆర్డీయే పరిధిలో భూముల కేటాయింపుతో సహా పలు ప్రాజెక్టుల్లో విధాన, న్యాయ, ఆర్థిక పరమైన అవకతవకలను, మోసపూరిత లావాదేవీలను గుర్తించింది. దీనిపై నిశితంగా చర్చించిన తర్వాత... ఈ మొత్తం వ్యవహారంపై ఒక ప్రత్యేక ఏజెన్సీతో దర్యాప్తు చేయాలని నిర్ణయించడమైనది" అని జీవోలో పేర్కొన్నారు. పైగా... గత

మిగతా 10వ పేజీలో...

### 'సిట్'లో వీరే..



కొల్లి రఘురామ్ రెడ్డి

- **కొల్లి రఘురామ్ రెడ్డి,** ఇంటెలిజెన్స్ డీఐజీ. (సిట్ అధిపతి)
- **బాబూజీ అట్టాడ,** విశాఖ ఎస్పీ
- **సీహెచ్ వెంకట అప్పలనాయుడు,** ఇంటెలిజెన్స్ ఎస్పీ-2
- **శ్రీనివాస రెడ్డి,** కడప అదనపు ఎస్పీ
- **జయరామరాజు,** ఇంటెలిజెన్స్ డీఎస్పీ
- **విజయ భాస్కర్-** విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ
- **ఎం. గిరిధర్,** ఇంటెలిజెన్స్ డీఎస్పీ
- **కెన్నడీ,** ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్
- **ఐ. శ్రీనివాసన్,** ఇన్‌స్పెక్టర్ (నెల్లూరు జిల్లా)
- **వి. రాజశేఖరరెడ్డి,** ఇన్‌స్పెక్టర్ (గుంటూరు జిల్లా)

## 'టార్గెట్' కోసమేనా..

**చంద్రబాబు** ఐదేళ్ల పాలనపై ఉన్నతస్థాయిలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఇదివరకే నియమించారు. కేబినెట్‌లో నంబర్ 2లాంటి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పార్టీలో నంబర్ 2గా భావించే విజయసాయి రెడ్డి, అధికారుల స్థాయిలో ద్వితీయస్థానంలోని అప్పటి ప్రత్యేక సీఎస్ (రెవెన్యూ) మన్మోహన్ సింగ్ ఇందులో సభ్యులు. వీరు గుర్తించిన అవకతవకలపై ఇంకా లోతుగా దర్యాప్తు చేయాలంటే... మరింత ఉన్నత స్థాయి కమిటీతో దర్యాప్తు చేయించాలి. అలా కాకుండా... డీఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ వేశారు. అందులోనూ... 'సిట్ ఏ వ్యక్తినైనా/అధికారినైనా పిలిపించవచ్చు' అని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో కొన్నాళ్లు సీఎస్‌గా పనిచేసిన, ఇప్పుడు కేబినెట్ ర్యాంకులో

మిగతా 10వ పేజీలో...



## శివోహం..

శుక్రవారం రాత్రి శ్రీశైలంలో శివ దర్శనం కోసం పోటెత్తిన అశేష భక్తజనం. (ఇన్‌సెట్) అర్ధరాత్రి కన్నులపండువగా పాగాలంకరణ దృశ్యం

2

## ఆ కిక్కే వేరు!



### పొరుగు రాష్ట్రాలకు మందుబాబుల క్యూ

- నచ్చిన బ్రాండ్ కోసం సరిహద్దులు దాటుతూ...
- తెలంగాణ, తమిళనాడుల్లోని దుకాణాలు కళకళ
- రోజుకు రూ.10 లక్షల వరకూ మద్యం విక్రయాలు
- నాలుగు నెలల్లోనే వ్యాపారం నాలుగింతలు
- సరిహద్దు పొడవునా వెలుస్తున్న బెల్టుషాపులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

'ఆ గట్టునుంటావా.. ఈ గట్టుకొస్తావా... అక్కడేమో సర్కారుకు నచ్చిన బ్రాండ్ ఉంది.. ఎక్కువ రేటుతో ఇష్టం లేని మందు ఉంది... ఇక్కడేమో కోరుకున్న బ్రాండ్ ఉంది. ఇష్టమైన మద్యం తక్కువ రేటుకే ఉంది' అంటూ మద్యంప్రియులు జల్సా చేస్తున్నారు. రాష్ట్రంలోని మద్యాన్ని కాదని పొరుగు రాష్ట్రాల్లో దొరికే మందు కోసం తహతహలాడుతున్నారు. నచ్చిన బ్రాండ్, కోరుకున్న మద్యం తక్కువ ధరకే

మిగతా 3వ పేజీలో...

### 'బెల్టు'ల్లోనే బ్రాండ్లు!

- ఏది కావాలన్నా లభ్యం
- షాపుల నుంచి తరలింపు
- దుకాణాల్లో అనామక బ్రాండ్లే
- క్వార్టర్ సీసాపై 50 అదనం
- స్థానిక అండతో అమ్మకాలు
- నిస్సహాయంగా ఎక్సైజ్

3

### గుంపుగా నగ్నంగా నిలబెట్టి..

గుజరాత్‌లో యువతులకు ఫిట్‌నెస్ పరీక్ష

సూరత్ కార్పొరేషన్ ట్రైనీ ఉద్యోగినుల పట్ల దారుణం

11









## రాత్రికి రాత్రే దున్నేశారు

- పగలు కన్నేసి చీకట్లో దున్నేసి..
- 'అసైన్డు' అంటే ఎగబడటమే
- పంట చేలో ఉండగానే దాష్టీకం
- అడగకుండానే నోటీసు,కొలతలు
- చూస్తుండగానే భూమి చదును
- రాష్ట్రమంతటా సేక'రణా'లే

సమాచారం ఇవ్వరు.. ఇష్టాయిష్టాలను కనుక్కోరు..సంప్రదింపులు జరపరు..గ్రామసభల మాట అసలే తలవరు..పగలు కన్నేసిన పొలాలను రాత్రి దున్నేయడమే! పేదలకు స్థలాలు పంచాలంటే కొని ఇవ్వాలి. బడ్జెట్ కేటాయించి..ముందుకొచ్చిన వారి నుంచి సేకరించాలి. 'అంత బడ్జెట్' లేదని..పేదలు, దళితుల వినియోగంలోని అసైన్డు, డీ పట్టా స్థలాలను అధికారులు లాగేసుకొంటున్నారు. పంట పొలంలో ఉండగానే, బలవంతంగా సేకరిస్తున్న తీరు రాష్ట్రమంతటా మంట పెడుతోంది.




ఇది ఐదు ఎకరాల అరటి పంట. 8మంది బీసీ పేదలు సాగు చేసుకొంటున్నారు. విజయనగరం జిల్లా రాకోడుగెడ్డలోని ఈ భూములను వీరికి 1986లో అప్పటి ప్రభుత్వం పండించుకోడానికి ఇచ్చింది. స్థలాల వేటలో ఉన్న రెవెన్యూ అధికారుల కన్ను ఈ పొలాలపై పడింది. గురువారం రాత్రి యంత్రాలతో వచ్చారు. పది రోజుల్లో కాపుకొచ్చే పంటను ధ్వంసం చేయడానికి తెగబడ్డారు. రైతులు గట్టిగా అడ్డుకున్నారు. అప్పటికి వెళ్లిన అధికారులు.. శుక్రవారం పోలీసులతో సహా వచ్చారు. రైతులు కాళ్లావేళ్లా పడుతున్నా వినకుండా పంటనంతా ధ్వంసం చేశారు. ప్లాట్లుగా చేయడానికి చదును చేయడం మొదలుపెట్టారు.

### ఇల్లెంత దూరం!

'పట్టా'లు తప్పే పేదల బతుకులు

- ఉంటున్న చోటికి దూరంగా స్థలాలు
- పది నుంచి 20 కిలోమీటర్లలో ఎంపిక
- అక్కడ ఇల్లు కట్టుకుంటామంటేనే స్థలం
- లేదంటే ఇవ్వబోమని నిక్కచ్చి షరతు

10






పరంజ్యోతి



# స్మరణాత్ అరుణాచలే..

*దర్శనాత్ ప్రసీదసీ జననాత్ కమలాలయే*
*కాశ్యాంతు మరణాన్ముక్తిః స్మరణాత్ అరుణాచలే*

'స్వామీ ఇన్ని జన్మలెత్తలేకపోతున్నాం. అందునా వచ్చేది కలి యుగం. చాలా తేలికగా అజ్ఞానానికి వశులమైపోతాం. మాయకు లోబడిపోతాం. తప్పు పనులు చేస్తాం. మళ్లీ పునర్జన్మలొస్తాయి. మరి అలా రాకుండా ఉండాలంటే మాకొక తేలిక మార్గం ఏదైనా ఉపదేశం చెయ్యి' అంటూ ఒకానొకప్పుడు మానవులు వేడుకోగా.. సాక్షాత్తూ పరమేశ్వరుడు చేసిన ఉపదేశం ఇది. దీని ప్రకారం.. చిదంబరంలో ఆకాశలింగాన్ని దర్శనం చేసుకుంటే ఇక పుట్టవలసిన అవసరం లేదు. చిదంబరంలో దర్శనమంటే.. అక్కడ మారేడు దళాల దండలుంటాయంతే. ఆకాశమంటే అంతటా నిండిపోయి ఉంటుంది. అంతటా నిండిన ఆకాశంలో అన్నీ ఉంటాయి. అటువంటి ఆకాశాన్ని, అనంతంగా నిండిపోయిన ఆకాశ స్వరూపాన్ని ఒక గోడగా చూపించి దానికే మారేడు దళాలు వేస్తారు. అంతటా నిండినిబిడీకృతమైపోయి ఉన్నది పరమేశ్వర స్వరూపమని అర్థం చేసుకోగలిగేవాడికి చిదంబర దర్శన రహస్యం తెలుస్తుంది. లేనివాడికి చిదంబర దర్శనం అర్థం కాదు. అందుకే భక్తులు.. 'మహాప్రభో మాకది ఎలా నిలబడుతుంది? అంత తేలికా? సాధ్యం కాదు. ఇంకొంచెం తేలిక మార్గం చెప్పండి' అన్నారు. అప్పుడు.. 'కమలాలయంలో పుట్టండి మీకు మోక్షమిస్తాన'న్నాడు పరమశివుడు. కమలాలయమంటే తిరువారూర్. అక్కడ పుడితే చాలు మోక్షం. కానీ పుట్టడం మన చేతిలో ఉందా? అదే మాట అడిగితే శివుడు మరొక మాట చెప్పాడు. 'కాశ్యాంతు మరణాన్ముక్తిః'.. 'పోనీ.. పుట్టడం నీ చేతిలో లేదు. నీ కర్తవ్యాలన్నీ అయిపోయాయనుకున్నప్పుడు కాశీకి వెళ్లిపోయి, కాశీ పట్టణంలో ఉండిపోయి అక్కడ శరీరం విడిచిపెట్టేస్తావా? మోక్షమిచ్చేస్తాను.' అన్నాడు. 'అయ్యా కాశీకి పోవాలంటే అంత తేలికా, పిల్లల్ని మనవల్ని వదిలేసి? పైగా నేను వెళదామనుకునేలోపల శరీరం వదిలిపెడితే ఎలా సాధ్యమవుతుంది? ఇంకొక మాట ఏమైనా చెప్పండి' అంటే.. 'స్మరణాత్ అరుణాచలే' అన్నాడు. 'ప్రతి రోజూ ఒక్కసారి అరుణాచల శివ, అరుణాచల శివ అని మనసులో అరుణాచల క్షేత్రాన్ని నువ్వు స్మరణ చేయగలవా? ఒక్కసారి గుర్తుతెచ్చుకోగలవా?' అన్నాడు. అరుణాచల క్షేత్రాన్ని స్మరిస్తే చాలు మోక్షమిచ్చేస్తానన్నాడు. స్కాందపురాణంలో ఒక విషయాన్ని చెబుతారు. ఒక జీవుడు ఆజన్మపరంపరల్లో ఎప్పుడైనా అరుణాచల క్షేత్ర ప్రవేశం చేస్తే.. ఆ జీవుని యాత్రలో 'వీడు అరుణాచల ప్రవేశం చేశాడు' అని ఒక ఎర్ర గీత పెడతారు. అరుణాచల ప్రవేశం చేసిన జీవుని యాత్ర ఒక విశేషమైన మలుపు తిరిగిందని గుర్తు. కానీ.. అరుణాచలానికి వెళ్లడం, అరుణాచలేశ్వరుడి దర్శనం అంత తేలికైన విషయాలు కావు. ఒక్క కారణం చేత మాత్రమే ఆ క్షేత్రంలోకి ప్రవేశించగలరని పెద్దలు చెబుతారు. ఏమిటా కారణమంటే.. 'నాకేమీ తెలియదు, నాకేమీ చేతకాదు' అన్న భావనతో, వినయంతో వెళ్లేవారికే అరుణాచల ప్రవేశం సాధ్యం. 'పరమేశ్వరా నాకేమీ తెలియదు. నాకున్నవన్నీ పాపాలే. నిన్ను నమ్ముకుని వస్తున్నాను. నువ్వే నన్ను అరుణాచల ప్రవేశం చేయించు' అని అడిగినవాడికి ఆ క్షేత్రంలోకి ప్రవేశం లభిస్తుంది. జ్ఞానసంబంధ నాయనార్ అంతటి మహానుభావుడే అంత తేలిగ్గా ఆ క్షేత్రంలోకి వెళ్లలేకపోయాడు. దొంగలు ఉన్నవన్నీ ఎత్తుకుపోతే అప్పుడాయన బాధపడి, ఈశ్వరుడిని కీర్తించి పరమ నిరాడంబరంగా వినయంతో వెళ్తే అరుణాచల పట్టణంలోకి ప్రవేశించగలిగాడు.

**- చాగంటి కోటేశ్వరరావు శర్మ**



నందివాహనంపై శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారల ఊరేగింపు

# శివోహం



గుంటూరు జిల్లా కోటప్పకొండలో.. శుక్రవారం రాత్రి విద్యుద్దీప వెలుగుజిలుగుల్లో భక్తజన సందోహం



శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మల్లన్న ప్రభోత్సవంలో అశేష జనవాహిని

- ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ
- లక్షలాది భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- శ్రీశైలంలో కన్నుల పండువగా ఆదిదంపతుల కల్యాణం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భక్తిభావం వెల్లివిరిసింది. శివనామస్మరణ మర్మోగింది. శివాలయాన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు గురువారం రాత్రి నుంచే భక్తులు పోటెత్తారు. కర్నూలు జిల్లా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది తరలివచ్చారు. వేకువజాము 2గంటల నుంచే దర్శనానికి అనుమతించారు. ఉత్సవాల్లో ప్రత్యేకమైన పాగాలంకరణ కోసం రాత్రి 10 గంటలు కాగానే విద్యుద్దీపాలు నిలిపివేశారు. ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు దిగంబరంగా మారి గర్భాలయం పైకి చేరుకున్నారు. స్వామివారి శిఖరం (గోపురం)తో 14నందులను కలుపుతూ ఆయన పాగాచుట్టారు. అర్ధరాత్రి 12గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం నిర్వహించారు. మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు, పేర్నినాని, అవంతి శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. శనివారం రథోత్సవం నిర్వహిస్తారు.

## శ్రీకాళహస్తికి పోటెత్తిన భక్తులు

శ్రీకాళహస్తి భక్తకోటితో కిక్కిరిసింది. స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుడు నిత్యాభిషేకమూర్తిగా కొలువై వేకువజాము నుంచే దర్శనమిచ్చారు. ఉదయం గంగా సమేత శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్రవిమానంపై, జ్ఞానప్రసూనాంబ చప్పరంపై మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి స్వామివారు నందివాహనం, జ్ఞానప్రసూనాంబ సింహవాహనంపై విహరించారు. సినీనటులు మోహన్‌బాబు, నితిన్ స్వామిని దర్శించుకున్నారు.

## కోటప్పకొండలో ప్రభల కాంతులు

గుంటూరు జిల్లా కోటప్పకొండలో లక్షలాదిగా భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలు జరిగాయి. ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. తిరునాళ్లలో 14 భారీ విద్యుత్ ప్రభలు కొలువుతీరాయి. ఉపసభాపతి కోన రఘుపతి, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్వామిని దర్శించుకున్నారు.


కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
TET-I+SGT
బ్యాచ్ ప్రారంభం : 05-03-2020
లేడీస్-పామర్రు ◆ జెంట్స్-అవనిగడ్డ
98852 72474, 79014 43057


## స్తంభించిన ట్రాఫిక్.. భక్తుల ఇక్కట్లు

కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లే మార్గాల్లో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచే ట్రాఫిక్ స్తంభించి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటంలో విఫలమయ్యారని భక్తులు విమర్శలు చేశారు.

## సాగరతీరంలో మహా కుంభాభిషేకం

విశాఖ ఆర్కేబీచ్‌లో రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం జరిగింది. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి హాజరై పూజాదికాలు నిర్వహించారు. సినీనటులు శారద, మురళీమోహన్, కవిత, మీనా పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరుడ్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.మందసకు సమీపంలోని మహేంద్రగిరి పంచపాండవుల ఆలయాలు(పంచాక్షరి)జనసంద్రమయ్యాయి.

## గోదారి తీరం.. భక్తజన సంద్రం

రాజమహేంద్రవరం గోదావరితీరంలో సుమారు లక్ష మంది కిపైగా భక్తులు స్నానాలు చేసి, కోటిలింగేశ్వరస్వామిని, ఉమా మార్కండేశ్వర స్వామి, విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సామర్లకోట కుమారరామం, ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పిఠాపురం పాదగయలో సుమారు 4లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో పిఠాపురంలో 900 పెన్నులు, 600 పెన్సిళ్లు వినియోగించి ఏర్పాటు చేసిన పెన్నుల శివ లింగం ఆకట్టుకుంది.

## దుర్గమ్మకు మంగళగిరి పట్టువస్త్రాలు

మహాశివరాత్రిని పురస్కరించుకుని బెజవాడ దుర్గమ్మకు శ్రీశివభక్త మార్కండేయ వంశీకులు మంగళగిరి చేనేత వస్త్రాలు బహూకరించారు. దామర్ల వెంకటనరసింహం, గంజి చిరంజీవి, చిల్లపల్లి మోహనరావు పట్టువస్త్రాలు, గాజులు, పసుపు, కుంకుమ, విభూది, ఫలపుష్పాలను 14వెదురు పళ్లెల్లో కూర్చి, వాటికి పూజలు నిర్వహించి, ఈవోకు అందజేశారు.

## యాత్రికులపైకి దూసుకెళ్లిన లారీ.. ఇద్దరి మృతి

16వ నంబరు హైవేపై యడ్లపాడు మండల పరిధిలో కోటప్పకొండ తిరునాళ్లకు వెళుతున్న యాత్రికుల ఎడ్ల బండ్ల పైకి లారీ దూసుకెళ్లడంతో ఇద్దరు మృతిచెందారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు వాసులు గురువారం రాత్రిప్రభను కట్టుకుని కోటప్పకొండకు వెళుతుండగా.. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న పార్శిల్ లారీ ఎడ్లబండ్లపైకి దూసుకెళ్లింది. నిమ్మగడ్డ కోటేశ్వరరావు(65) అక్కడికక్కడే చనిపోగా, ముగ్గురు తీవ్రంగా, నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన కొండూరి వీరయ్య(62)ను గుంటూరు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.





తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు, విజయవాడ కృష్ణా నదికి తరలివచ్చిన భక్తులు

# లోకం తీరు



ర్యాలీకి వెళ్లేటప్పుడు ఈ డ్రస్ వేసుకుంటే బాగుంటుంది సార్.. ట్రంప్‌కన్నా ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్

## శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 7గంటలు పడుతోంది. ఆదివారం ఆర్జితసేవలకు సంబంధించి విజయా బ్యాంకులో శనివారం లక్కీడిప్‌లో జారీచేసే టిక్కెట్లు సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80 అందుబాటులో ఉన్నాయి.



## రోడ్డుపై కూర్చొని అభిప్రాయాన్ని రుద్దడం ఉగ్రవాదమే

కొంత మంది రోడ్డుపై కూర్చొని తమ అభిప్రాయాన్ని ఇతరులూ ఆమోదించాలని ఒత్తిడి చేయడమూ ఉగ్రవాదమే. హింసాకాండకు పాల్పడితేనే ఉగ్రవాదం కాదు. సాధారణ ప్రజల జీవితాన్ని ఇబ్బందులకు గురి చేయడమూ ఓ విధమైన ఉగ్రవాదమే. ప్రజాస్వామ్యంలో అసమ్మతి తెలిపే హక్కు అందరికీ ఉంది. అయితే, ఇతరులకు ఇబ్బంది కలిగించనంత వరకే ఆ హక్కు.

**- ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేరళ గవర్నర్**



## 'విశ్వసనీయత సంక్షోభం'లో దేశ రాజకీయాలు

దేశ రాజకీయాలు 'విశ్వసనీయత సంక్షోభం'లో కొట్టుమిట్టాడుతున్నాయి. రాజకీయ నాయకుల మాటలు, చేతల్లో పొంతన లేకపోవడమే ఇందుకు కారణం. రాజకీయం అంటే సమాజాన్ని ధర్మ మార్గంపై నడిపించడమే. కానీ ప్రస్తుత రాజకీయాల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. దీన్ని సవాల్‌గా తీసుకొని ప్రస్తుత రాజకీయ సంక్షోభానికి ముగింపు పలకాలి.

**- రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి**



## నేలలోని కాలుష్య కారకాలను ఏరిపారేసే బ్యాక్టీరియా

న్యూయార్క్, ఫిబ్రవరి 21 : నేల కాలుష్యానికి చెక్ పెట్టే సరికొత్త బ్యాక్టీరియాను అమెరికాలోని కార్నెల్ వర్సిటీ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దానికి 'మ్యాడ్‌సెనియానా' అని పేరుపెట్టారు. బొగ్గు, గ్యాస్, చమురు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలుష్యకాసారాలుగా మారిన నేలల్లోకి పాలీ క్లినిక్ అరోమాటిక్ హైడ్రోకార్బన్(పీఏహెచ్) రసాయనాలు ఇంకుతుంటాయి. వాటి ప్రభావంతో పరిసర ప్రాంత ప్రజలకు కేన్సర్ వంటి జబ్బులు వచ్చే అవకాశాలూ ఉంటాయి. అలాంటి ప్రమాదకర పీఏహెచ్‌లను నిర్వీర్యం చేసి, వాటి స్థానంలో నేలలోకి పోషకాలను భర్తీ చేయడం మ్యాడ్‌సెనియానా ప్రత్యేకత. ఈ బ్యాక్టీరియా కాలుష్యభరిత నేలల్లో పెరిగే చెట్లు, మొక్కల నుంచి కార్బన్‌ను పీల్చుకొని.. దానికి బదులుగా వాటికి నైట్రోజన్, ఫాస్పరస్ వంటి పోషకాలను అందిస్తుందని తాజా అధ్యయనంలో గుర్తించారు.



## చుట్టూ ఉండే కొవ్వుతో ధమనులకు ఎంతో మేలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 21 : ధమనులు ఆరోగ్యంగా ఉండడానికి వాటి చుట్టూ ఉండే కొవ్వు కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధకులు తెలిపారు. ఎలుకల్లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం తెలిసిందని అమెరికాలోని మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు పేర్కొన్నారు. కండరాల ఒత్తిడి నుంచి బయటపడేందుకు ధమనుల చుట్టూ ఉండే పెరివాస్క్యులర్ అడిపోస్ టిష్యూ (పీవ్యాట్) అనే కొవ్వు పదార్థం వాటికి సహాయం చేస్తుందని చెప్పారు. ధమనులు వ్యాకోచించినపుడు వాటిపై పడే ఒత్తిడిని పీవ్యాట్ తగ్గించిందని వెల్లడించారు. మరింత ద్రవాన్ని నిల్వచేసుకోవడానికి మూత్రాశయం (బ్లాడర్) ఏవిధంగా అయితే వ్యాకోచిస్తుందో ఇది కూడా అదేవిధమైన ప్రక్రియ అని వివరించారు.


# APPOINTMENTS

**RISE** Krishna Sai Prakasam Group of Institutions
Krishna Sai Gandhi Group of Institutions
(Approved by AICTE and affiliated to JNTUK, Kakinada)
NH-16, Vallur-523272, Ongole, Prakasam Dt., AP
Ph. 7093383855, email : risekrishnasaihr@gmail.com
www.risekrishnasaiprakasam.edu.in, www.risegroup.edu.in

**FACULTY RECRUITMENT**

| Department | Faculty Position |
| --- | --- |
| Civil, Mechanical, EEE, ECE, CSE, Maths, Physics, Chemistry, English, Librarian, Physical Director MBA, MCA | Professor<br>Associate Professor<br>Assistant Professor |

★ Qualification, experience and pay scales are as per AICTE norms
★ Application proforma can be downloaded from the college websites www.risekrishnasaiprakasam.edu.in, www.risegroup.edu.in
★ The filled application along with proof of educational qualifications have to be sent in a closed envelope superscribed with ***"for the faculty position in RISE Krishna Sai Group of Institutions: Ongole"*** to the Principal, and another copy to be sent to the **Registrar, JNTUK, Kakinada-523003. (A.P).** Also email soft copy to **risekrishnasaihr@gmail.com**
★ Last date for submission of application along with enclosures is 28-02-2020.

Date : 22/02/2020 Sd/- **Principal**


# ఇంటర్ పరీక్షల్లో సంస్కరణలు!

- చీఫ్‌తో సహా అంతా బయటి వాళ్లే

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి 4నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పబ్లిక్(థియరీ) పరీక్షల నిర్వహణలో భారీ సంస్కరణలు అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం పరీక్షల జరుగుతున్న తీరుపై పెద్దఎత్తున ఫిర్యాదులు నేపథ్యంలో ఇంటర్ బోర్డు సమూల మార్పులకు శ్రీకారం చుడుతోంది. విద్యార్థులను జంబ్లింగ్ చేస్తున్నప్పటికీ పరీక్షల నిర్వహణ లోపభూయిష్టంగా తయారైందన్న అభిప్రాయాలపై పరిశీలన చేసిన తర్వాత ఇకపై పూర్తి స్థాయిలో జంబ్లింగ్ అమలు చేయాలని నిర్ణయించింది. చీఫ్ సూపరింటెండెంట్‌లతో సహా అంతా బయటి వాళ్లతోనే పరీక్షలను నిర్వహించాలని సంకల్పించింది. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో), ఇన్విజిలేటర్లందరినీ జంబ్లింగ్ చేస్తారన్న మాట. అంటే ఏ పరీక్షా కేంద్రంలో అయినా.. సొంత కాలేజీ విద్యార్థులు గానీ, లెక్చరర్లు గానీ ప్రభుత్వ కాలేజీల/ప్రైవేట్ కాలేజీల ప్రిన్సిపాళ్లు గానీ ఉండటానికి వీల్లేదు. తాజాగా పూర్తయిన ప్రాక్టికల్ పరీక్షల్లోనూ కొత్త విధానాన్ని అమలు చేశారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల్లోకి అటెండర్, వాటర్ బాయ్ తదితర సహాయ సిబ్బంది ఎవరినీ అనుమతించేది లేదని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలన్నింటిలో.. అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుండడం విశేషం. ఇక, విద్యార్థులు పొందిన మార్కులను పాఠ్యాంశాల వారీగాను, ఓవరాల్‌గానూ మార్కుల మెమోలలో ఇవ్వాలని ఇంటర్‌బోర్డు నిర్ణయం తీసుకుంది. సబ్జెక్టుల వారీగా గ్రేడులను మాత్రం ఇవ్వరు. అయితే మార్కులతో పాటు ఓవరాల్ గ్రేడింగ్ ఇవ్వడమా లేక పాత పద్ధతి మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ.. ఇలా క్లాస్‌లు ఇవ్వడమా అనే విషయమై ఈ నెల 26న విద్యాశాఖ మంత్రి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ లో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇంటర్ పబ్లిక్ (థియరీ)పరీక్షలు మార్చి 4నుంచి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10,64,442 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రిజిస్టర్ అయ్యారు. ఇది గత ఏడాది కంటే 46,842 మంది అధికం. ఈ సారి 5,46,162 మంది ఫస్టియర్, 5,18,280 మంది సెకండియర్ విద్యార్థులున్నారు.

# అమ్మఒడి డబ్బు.. అప్పునకు జమ

- బ్యాంకు అధికారుల నిర్వాకం.. తల్లిదండ్రుల్లేని విద్యార్థినికి అందని ఆసరా



డోన్, ఫిబ్రవరి 21: అమ్మఒడి కింద తల్లులకిచ్చే డబ్బును బ్యాంకులు తమ అప్పుల కింద జమ కట్టుకోకుండా చేస్తామని సీఎం జగన్ పదేపదే చెప్పారు. కానీ కొన్నిచోట్ల తద్విరుద్ధంగా జరుగుతోంది. ఆర్థికమంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కర్నూలు జిల్లా డోన్‌లో ఓ విద్యార్థిని జేజమ్మ ఖాతాలో వేసి న సొమ్మును ఆ బ్యాంకు అధికారులు తమ రుణం కింద జమ వేసుకున్నారు. డోన్‌లోని ఇందిరానగర్‌లో చిన్నపెంకుటింట్లో నాగలక్ష్మి నివాసం ఉంటున్నారు. ఆమె కొడుకు మల్లేష్, కోడలు రామాంజనమ్మకు రామేశ్వరి అనే కుమార్తె ఉంది. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో రామేశ్వరి.. నాయనమ్మ వద్ద ఉంటూ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. అమ్మఒడి కోసం నాయనమ్మ బ్యాంకు ఖాతా ఇచ్చింది. పట్టణంలోని ఎస్‌బీఐ శాఖలో ఆమెఖాతాలో అమ్మఒడి సొమ్ము రూ.15 వేలు జమయింది. అయితే నాగలక్ష్మికి బ్యాంకులో ముద్ర రుణం ఉందంటూ అధికారులు దాన్ని అప్పు కింద జమ వేసుకున్నారు. బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా కనికరం చూపడం లేదు.

ఆంధ్రజ్యోతి
శనివారం 22 ఫిబ్రవరి 2020
4 | తమసోమా జ్యోతిర్గమయ

# శాంతి సాధ్యమేనా?

హింసకు దూరంగా ఈ వారం గడిచాక, ఈనెల 29న తాలిబాన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకోబోతున్నట్టు అమెరికా ప్రకటించింది. అమెరికా సేనల ఉపసంహరణకు ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందనీ, దాడులకు తావులేని ఈ వారం పూర్తయిన తరువాత ఈ ఒప్పందం కుదురుతుందని అమెరికా విదేశాంగమంత్రి ఓ ప్రకటనలో అన్నారు. శుక్రవారం అర్థరాత్రి నుంచీ ఈ కౌంట్‌డౌన్ ఆరంభమవుతుంది. ఈ కాలంలో అన్ని పక్షాలకూ ఆత్మరక్షణ అధికారం ఉంటుందనీ, ఇదేమీ కాల్పుల విరమణ ఒప్పందం కాదని కొందరు అంటున్నారు. ఒప్పందం కుదిరిన తరువాత పరిస్థితులు బాగుంటే ఈ నియమం మరింతకాలం కొనసాగవచ్చని తాలిబాన్ అంటే, ఏమాత్రం కవ్వించినా ఊరుకోబోయేది లేదని ప్రభుత్వ అధికార ప్రతినిధి హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతానికి కాస్తంత గందరోళంగా కనిపిస్తున్నా, ఈ ఒప్పందం కాల్పుల విరమణకూ, అఫ్ఘాన్–తాలిబాన్ చర్చలకూ, అంతిమంగా శాంతిస్థాపనకు దోహదం చేస్తుందని అమెరికా వాదన. మరి, పరిస్థితులు భిన్నంగా ఉంటే ఒప్పందం నిలిచిపోతుందా? అన్న ప్రశ్నకు ప్రస్తుతానికి జవాబు దొరకదు. అఫ్ఘానిస్థాన్‌నుంచి ఎప్పుడు పోదామా అని అమెరికా ఎంతోకాలంగా చూస్తోంది. ఖతార్ రాజధాని దోహాలో 9 విడతల చర్చల అనంతరం ఓ సూత్రప్రాయ అంగీకారం కుదిరినట్టు గత ఏడాది ఆగస్టులో అమెరికా తరఫు అధికారి ప్రకటించారు కూడా. కానీ, ట్రంప్ చివరినిముషంలో మనసు మార్చుకోవడం ఒప్పందం ఆగింది. క్యాంప్‌డేవిడ్‌లో తాలిబాన్ నాయకులకూ, ట్రంప్‌కు మధ్య రహస్య సమావేశం జరగబోతున్న తరుణంలో చర్చలకు ట్రంప్ స్వస్తి చెప్పేశారు. తాలిబాన్ ఆత్మాహుతి దాడిలో పదిమంది అఫ్ఘాన్లతోపాటు ఒక అమెరికన్ సైనికుడు మరణించినందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు. నిజానికి చర్చలు జరుగుతున్న ఈ కాలంలో తాలిబాన్ హింస బాగా పెరిగింది. కానీ, సెప్టెంబరు 11దారుణ ఘటనకు 18 ఏళ్ళు పూర్తయిన సందర్భాన్ని ముందు పెట్టుకొని తాలిబాన్‌తో ఇలా రహస్య భేటీ జరిపితే పరువుపోతుందని ట్రంప్ భయపడినందున ఈ దాడిని ముసుగుగా వాడుకున్నారు. చర్చల్లో తాలిబాన్‌దే పైచేయి అయిందనీ, అందుకే ట్రంప్ మాట మార్చేశారని కూడా వార్తలు వచ్చాయి. ఆ సందర్భంగా ట్రంప్ తాలిబాన్‌పై తాను చేస్తున్న యుద్ధం రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా సాగుతుందనీ, తనవద్ద అణ్వాస్త్రాలు కూడా ఉన్నాయనీ బోలెడన్ని ప్రగల్భాలు సైతం పలికారు.

అవసరం ట్రంప్‌ది కనుక చర్చలు తిరిగి ఏదో రూపంలో కొనసాగుతాయని అనుకున్నదే. అమెరికా–తాలిబాన్ రేపు కుదుర్చుకోబోయే ఒప్పందంలో ఏమున్నదో ఎవరికీ తెలియదు. అమెరికాకు హాని తలబెట్టే అల్ కాయిదా, ఇస్లామిక్ స్టేట్ వంటి సంస్థలకు తాలిబాన్ ఆశ్రయాన్నీ, ఆసరానీ అందించకూడదన్న ప్రధాన డిమాండ్ నెరవేరితే అమెరికాకు చాలు. అధ్యక్ష ఎన్నికల్లోగా అఫ్ఘానిస్థాన్‌నుంచి అమెరికన్ సైనికులను తరలించేయాలన్న కోరిక తీరి, ఎన్నికల హామీ నెరివేరితే ట్రంప్‌కు చాలు. తాను కాలు వెనక్కుతీసుకున్న తరువాత అఫ్ఘాన్ ఏమైపోయినా అమెరికాకు అనవసరం. తదుపరిదశలో తాలిబాన్–అఫ్ఘాన్ ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగి శాంతి దక్కుతుందన్న నమ్మకం ఏమాత్రం లేదు. అఫ్ఘానిస్థాన్‌లో సెప్టెంబరు 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అష్రాఫ్ ఘనీ వీసమెత్తు మెజారిటీతో నెగ్గినట్టు ఇటీవలే ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆయన ప్రధాన ప్రత్యర్థి అబ్దుల్లా అబ్దుల్లా ఇందుకు ఆగ్రహించి ప్రత్యామ్నాయ ప్రభుత్వం నడపబోతున్నట్టు ప్రకటించారు. ఐదేళ్ళక్రితం కూడా ఇలాగే జరిగితే అమెరికా వీరిద్దరికీ అధికారాలు పంచి రాజీచేకూర్చింది. కానీ, ఇద్దరూ కాట్లాడుకుంటూనే ఉన్న స్థితిలో తాలిబాన్ మరింత విస్తరించి, నగరాల్లోకీ చొచ్చుకురాగలిగింది. అఫ్ఘాన్ ప్రభుత్వం మరింత బలహీనంగా ఉన్న ప్రస్తుత స్థితిలో అమెరికా నిష్క్రమణ తరువాత తాలిబాన్‌ను నిలువరించడం అసాధ్యం. ఈ పరిణామాలన్నీ భారతదేశానికి మరిన్ని తలనొప్పులు తెచ్చిపెట్టడం ఖాయం. రెండుదశాబ్దాలుగా నెత్తురోడుతున్న అఫ్ఘానిస్థాన్‌లో ఇక ఎవరికంటా కన్నీరు ఒలక్కూడదన్న ఉద్దేశంతో తాము ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నట్టు తాలిబాన్ కీలకనాయకుడు హక్కానీ న్యూయార్క్‌టైమ్స్‌లో బుధవారం ఓ సుదీర్ఘ వ్యాసం రాశారు. ఇస్లామిక్ సంప్రదాయాలకు అనుగుణంగా ఉన్న అన్ని అంతర్జాతీయ నియమాలకు తాము కట్టుబడి ఉంటామని కూడా ఓ మాటన్నారు. అవి ఎంతమేరకు ఆచరణలో కనిపిస్తాయన్నది అటుంచితే, ఎవరి స్వప్రయోజనాలకు అనుగుణంగా వారు ఆడిన ఈ నాటకంలో ఉగ్రవాద నిర్మూలన, అఫ్ఘానిస్థాన్ పునర్నిర్మాణం లక్ష్యాలు మాత్రం వెనక్కుపోయాయి.

# పలనాటి వీరకేసరి కన్నెగంటి

***కన్నెగంటి హనుమంతు/ వెన్నులోని బాకు/***
***కత్తి కట్టి కదల మంది/ కడ విజయం వరకు...***

అని ఆరుద్ర రాసిన పాట అందరమూ వింటూనే ఉన్నాం.

బ్రిటిష్ పాలకుల క్రూర నిర్బంధానికి బలైపోయిన వేలాది యోధుల్లో హనుమంతు ఒకరు. గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలోని మించాలపాడు (ప్రస్తుత దుర్గి మండలం) గ్రామ వాసి. అచ్చమ్మ వెంకటప్పయ్య దంపతులకు 1870లో జన్మించిన ఈ వీరుడు యుక్త వయస్సులోనే కాంగ్రెస్ పార్టీ పట్ల, స్వాతంత్ర్య సమరం పట్ల ఆకర్షితుడయ్యాడు.

సారవంతమైన రేగడి భూములున్నా పల్నాడు ప్రాంతం నీటి వసతి లేక వర్షాధారంగానే ఉండేది. వర్షాలు కురవక, కురిసినా సరిపోక ఈ ప్రాంతమంతా నిత్యం కరువు కాటకాలతో కునారిల్లుతుండేది. పాడి ప్రధాన పోషకంగా ఉన్నా పశు గ్రాసానికి తీవ్ర కొరత ఉండేది. పశువుకి రెండు రూపాయలు చెల్లిస్తే తప్ప అడవిలో వాటిని మేపుకునేందుకు ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది అనుమతించే వారు కాదు. దీనినే 'అడవి పుల్లరి' అనే వారు. ఈ అధికారిక వసూళ్లే గాక ఇతర లంచాలు, వేధింపులు కూడా ఉండేవి.



ఈ పరిస్థితికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు అడవి పుల్లరితో సహా ఇతర పన్నులు కట్టటం మానుకున్నారు. 1921లో ఉన్నవ లక్ష్మీనారాయణ నాయకత్వంలో ఒక వాలంటీర్ల దళం అడవి పుల్లరికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేసి అరెస్ట్ అయింది. ఉన్నవను, మూడభూషి నరసింహాచార్యాలను విచారించి ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించి రాయవెల్లూరు జైలుకు పంపారు. దీంతో సుమారు 90– 100 గ్రామాలకు పుల్లరి వ్యతిరేక ఉద్యమం వ్యాపించింది.

**కోలగుట్లకు వస్తున్న కన్నెగంటిని 30 మంది సాయుధ పోలీసులు చుట్టుముట్టారు. నిరాయుధునిగా ఉన్న హనుమంతుపై ఏకపక్షంగా కాల్పులు జరిపారు. 26 తూటాలు దిగి, శరీరమంతా బుల్లెట్ గాయాలైన స్థితిలో ఆ వీరకేసరి మంచినీళ్లు అడిగినా ఇవ్వకుండా పోలీసులు తుపాకీ మడమలతో గొంతుపై నొక్కి తీవ్రంగా హింసించి చంపారు.**

ఈ ఉద్యమానికి కన్నెగంటి హనుమంతు నాయకత్వం వహించారు. హనుమంతు ఉద్యమం సాగిస్తున్న 30– 40 గ్రామాల్లో పాలన పూర్తిగా స్తంభించింది. జనాలను లొంగదీసుకోవడానికి అసంఖ్యాకంగా పోలీసులు దిగారు. వారి బెదిరింపులకు జనం భయపడలేదు. పోలీసులు జంగమహేశ్వరపురం, రామాపురం, జెట్టిపాలెం గ్రామాలపై పెద్ద ఎత్తున దాడులు జరిపారు. అప్పుడు గుంటూరు జిల్లా కలెక్టర్ రూథర్ ఫర్డ్. ఇతనే తరువాత అల్లూరి సీతారామరాజుని కూడా చంపించాడు. హనుమంతుకు ధనాశ చూపి ఉద్యమం విరమింప చేయడానికి కోలగుట్ల కరణం సదా శివయ్య ద్వారా విఫల యత్నం చేశారు. హనుమంతుతో చర్చించాలని డిప్యూటీ కలెక్టర్ కబురు చేశారు. ఆయన కోసం మించాలపాడు నుంచి పక్కనే ఉన్న 'కోలగుట్ల'కు వస్తున్నామని కబురు చేశారు. ఈలోగా కోలగుట్లకు తూర్పు విభాగంలో నీళ్ల కోసం వచ్చిన పశువుల మందను ముటుకూరు 'బందెల దొడ్డి'కి తీసుకెళుతున్న మిలిటరీ దళాన్ని హనుమంతు అల్లుడు పసుపులేటి చిన్నయ్య అడ్డుకొని పశువుల్ని వదలమని కోరాడు. ఆయన్ను పోలీసులు హింసించడంతో ప్రజలు పోలీసులపై తిరగబడ్డారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో హనుమంతు పాలేరు శేషయ్య అక్కడికక్కడే చనిపోయాడు. మరో 28 మంది గాయపడ్డారు.

ఆ రోజు మహాశివరాత్రి. 1922 ఫిబ్రవరి 22వ తేదీ. జనమంతా పండుగ సంబరాల్లో మునిగి ఉన్నారు.

కోలగుట్లకు వస్తున్న కన్నెగంటిని 30 మంది సాయుధ పోలీసులు చుట్టుముట్టారు. గ్రామం తూర్పు వైపు జరిగిన హింసాత్మక ఘటన తెలిస్తే హనుమంతు మనల్ని చంపుతాడని పోలీసులను భయపెట్టిన కరణం సదా శివయ్య నిరాయుధునిగా ఉన్న హనుమంతుపై ఏకపక్షంగా కాల్పులు జరిగేటట్టు చేశాడు. తుపాకీ కాల్పుల్లో 26 తూటాలు తగిలి శరీరమంతా బుల్లెట్ గాయాలైన స్థితిలో ఆ వీర కిషోరం మంచినీళ్లు అడిగినా ఇవ్వకుండా పోలీసులు తుపాకీ మడమలతో గొంతుపై నొక్కి తీవ్రంగా హింసించి చంపారు. హనుమంతు మరణంతో ఉద్యమాన్ని నడిపించే నాయకుడు లేకుండా పోవడంతో ప్రజలు కకావికలయ్యారు. ఈ పరిస్థితుల్లో ఉద్యమంలో పాల్గొన్న రైతులకు జరిమానాలు విధించి కొందరికి ఆరు నెలలు కారాగార శిక్ష కూడా విధించారు. పలు రకాలుగా వారిని ఇబ్బందులకు గురి చేశారు. అంతటి వీరుడి సమాధిని ఆనాడు సాదా సీదాగా నిర్మించారు. ఈ మధ్య కాలంలో దాన్ని పునర్నిర్మించుకొని ఆ వీరుని పట్ల పల్నాడు ప్రజలు తమ గౌరవాభిమానాలు ప్రకటించుకున్నారు. అలాగే గుంటూరు నగరంలో కూడా ఈయన కాంస్య విగ్రహాన్ని అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి ఆవిష్కరించారు.

**– చెరుకూరి సత్యనారాయణ**

*(హనుమంతు ప్రాణత్యాగానికి నేటికి 98 సంవత్సరాలు)*

**వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా**
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు 70, జూబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

# ఇదా జాతిహితం?




■ పి. చిదంబరం



'పళని' పలుకు

జాతి శ్రేయస్సుకు దోహదం చేసేదేమిటి? దేశ పాలకులు చేస్తున్నదేమిటి? ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 16న వారణాసిలో మాట్లాడుతూ ఇలా ఉద్ఘాటించారు: 'జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు రాజ్యాంగ అధికరణం 370 ని రద్దుచేశాము; పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చాము. దేశ సమైక్యత, సమగ్రతలను పటిష్ఠం చేసేందుకు ఈ నిర్ణయాలు అనివార్యమైనవి. అంతర్జాతీయంగా పలు ఒత్తిళ్లు వస్తున్నా ఈ నిర్ణయాలపై పునరాలోచన ప్రసక్తే లేదు. వాటికి మేము కట్టుబడి వున్నాం. ఎప్పటికీ వాటికి మేము నిబద్ధులమయ్యే వుంటాము'.

శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసే మాటలు సుమా! 'జాతీయ ప్రయోజనాలు' అనే ఆకర్షణీయ మాటలు సప్రమాణత(కరెక్ట్‌నెస్)ను సూచించవు; అంతిమత్వం లేదా నిశ్చయత్వం(ఫైనాలిటీ)ని సంకేతించే మాటలవి. జాతి ప్రయోజనాలను సంరక్షించేందుకే ఆ నిర్ణయాలు తీసుకున్నామని ప్రధాన మంత్రి ప్రకటించారు. కనుక, 370 అధికరణం రద్దు, పౌరసత్వ సవరణ చట్టంపై విమర్శలు నిలిచిపోవాలని, ఆ అంశాలపై చర్చలను ముగించాలని ప్రధాన మంత్రి ఆశిస్తున్నారు మరి.

భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో వున్న గత ఆరు సంవత్సరాలలో చోటు చేసుకున్న పరిణామాలన్నిటిపైన నా దృష్టిని సారించాను. మోదీ సర్కార్ చేపట్టిన, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవి తప్పనిసరి అని ప్రభుత్వం తరచు చెబుతున్న చర్యలను లెక్కించడానికి ప్రయత్నించాను. సదరు చర్యల జాబితా సుదీర్ఘమైనది. వివాదాస్పదమైనది కూడా అని నేను చెప్పక తప్పదు. నేను సంగ్రహించగలిగిన సదరు చర్యలను వరుసగా ప్రస్తావిస్తాను.

తొలుత ప్రస్తావనార్హమైనవేమిటో నేను చెప్పనవసరం లేదు. అవి: డీమానిటైజేషన్ (నోట్ల రద్దు), జీఎస్టీ నిర్ణయాన్ని జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్నామని మోదీ ప్రభుత్వం ఇప్పటికీ నిస్సంకోచంగా పదే పదే చెబుతున్నది. ఆ నిర్ణయం ఒక మహా తప్పిదమని విమర్శకులు అంటున్నారు. వినాశనకర పర్యవసానాలను వారు ఎత్తి చూపుతున్నారు. నోట్ల రద్దు నిర్ణయంతో ఆర్థికవ్యవస్థ నుంచి నగదు పీల్చివేయబడినది. నగదు ఆధారితమైన వ్యవసాయం, భవన నిర్మాణం, కిరాణా వ్యాపారం, స్వయం ఉపాధి రంగాలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. వాటిలో అత్యధిక భాగం ఇప్పటికీ మూతపడేవున్నాయి. నోట్ బందీ విఘాతం నుంచి అవి కోలుకునే పరిస్థితిలేదనే చెప్పవచ్చు. డీమానిటైజేషన్‌తో ఉద్యోగాలు కోల్పోయిన వారు చాలా కాలం నిరుద్యోగులుగానే ఉండిపోయారు. ఇప్పటికీ ఆ దుర్గతిలో వున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. నోట్ల రద్దు జాతీయ ప్రయోజనాల కోసమే తీసుకున్నారా లేక వాటిని ఉపేక్షించి తీసుకున్నారా అనే విషయమై అంతిమ తీర్పు ఇంకా వెలువడవలసివున్నది.

జీఎస్టీ (వస్తుసేవల పన్ను) చట్టాన్ని జాతీయ ప్రయోజనాలను పటిష్ఠం చేసేందుకు తీసుకువచ్చామని ప్రభుత్వం ఉద్ఘాటిస్తోంది. చట్టాన్ని సక్రమంగా రూపొందించి, జీఎస్టీ రేటు ఏకైక రేటు అయివున్నట్టయితే ప్రభుత్వ ఉద్ఘాటన యుక్తమైన వాదన అని ఒప్పుకోవచ్చు. అయితే జీఎస్టీ అనుభవాలు అలా లేవు కదా. పైగా జీఎస్టీ అమలుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ముందుగా సిద్ధం చేసుకోలేదు. కొత్త పన్ను వ్యవహారాల విషయంలో పరిపాలనా యంత్రాంగానికి శిక్షణ ఇవ్వకుండానే అమలును ప్రారంభించారు! ఇంచుమించు రెండు సంవత్సరాల అనంతరం కూడా జీఎస్టీ వసూళ్ళు అంచనాల కంటే తక్కువగానే వున్నాయి. రాష్ట్రాలకు ఇచ్చిన హామీ మేరకు నష్టపరిహారం చెల్లించడం లేదు. వాపస్ చేయవలసిన సొమ్ము విషయం ప్రభుత్వం, వ్యాపార వర్గాల మధ్య ఒక ఎడతెగని వివాదంగా వున్నది. జీఎస్టీని ఉపసంహరించడం జాతీయ ప్రయోజనాలకు దోహదం చేయదు. అలాగని ప్రస్తుత రూపురేఖలు, రేట్లతోనే దాన్ని కొనసాగించడం కూడా దేశ ప్రయోజనాలకు తోడ్పడదు గాక తోడ్పడదు.

అధికరణం 370ని వదిలించుకోవడానికి అధికరణం 370ని ఉపయోగించుకోవడం జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకేనని మోదీ ప్రభుత్వం వాదిస్తోంది. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది కూడా అందుకేనని పాలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. 2019 ఆగస్టు 5 నుంచి కశ్మీర్ లోయను పూర్తిగా మూసివేశారు. కశ్మీరీలకు బయటి ప్రపంచంతో ఎటువంటి సంబంధాలు లేకుండా చేశారు. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకేనని మరి చెప్పాలా? ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను ఆరు నెలల పాటు ఎటువంటి ఆరోపణలు లేకుండానే గృహనిర్బంధం పాలు చేశారు. ఆ తరువాత ప్రజా భద్రతా చట్టాన్ని ప్రయోగించి ఆ నిర్బంధాన్ని మరో రెండు సంవత్సరాల పాటు పొడిగించారు, ఎలాంటి అభియోగాలు మోపకుండానే సుమా! ఇదంతా ఎందుకోసం?

> **నరేంద్ర మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు కంకణం కట్టుకున్నది. ఆ కర్తవ్య నిర్వహణలో ప్రభుత్వం అహోరాత్రులు అవిరామంగా శ్రమిస్తోంది. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరడం, ప్రపంచ అగ్రరాజ్యంగా వెలుగొందే శుభవేళ వడిగా వచ్చేస్తోంది! అవునా, మోదీగారూ?**

జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకేనట. హెబియస్ కార్పస్ పిటిషన్లపై విచారణను ఏడు నెలలకు పైగా నిలిపివేయడం జాతీయ ప్రయోజనాలను సంరక్షించేందుకేనని మోదీ సర్కారు పదే పదే చెబుతున్నది. ఈ వాదనతో కశ్మీర్‌లో ఏ ఒక్కరూ సహజంగానే ఏకీభవించడం లేదు.

అసోం రాష్ట్రంలో జాతీయ పౌరుల పట్టికను రూపొందించడం జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకేనని మోదీ ప్రభుత్వం పేర్కొంది. ఆ రాష్ట్రంలో 19,06,657 మంది విదేశీయులు లేదా అక్రమ వలసదారులు ఉన్నట్టు జాతీయ ప్రయోజనాల పరిరక్షణ రీత్యా గుర్తించారు. ఈ 'విదేశీయులు లేదా అక్రమ వలసదారుల'ను 'చెదపురుగులు'గా ఈసడిస్తూ, వారిని 2024 సంవత్సరం నాటికి దేశం నుంచి పంపించివేస్తామని మోదీ ప్రభుత్వం అంటున్నది. ఆ 'విదేశీయుల'లో 12 లక్షల మందికి పైగా హిందువులు కూడా ఉన్నట్టు తెలిసిరావడంతో 1955 నాటి పౌరసత్వ చట్టం సవరణకు పూనుకున్నారు. సవరణ చట్టం రూపకల్పన, పార్లమెంటులో ప్రవేశ పెట్టడం, ఆమోదం పొందడం కేవలం 72 గంటల్లో పూర్తిచేశారు. ముస్లిమేతర 'విదేశీయులు' దేశంలోనే వుండిపోయేందుకు ఈ సవరణ చట్టం అనుమతిస్తుంది. ముస్లింలు మాత్రం ఈ దేశాన్ని విడిచి వెళ్ళాలి (వెళ్ళకపోతే గెంటి వేస్తారు) . జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తీసుకువచ్చిన ఈ సవరణ చట్టం మున్నెన్నడూ లేనివిధంగా దేశంలో అల్లకల్లోలానికి కారణమయింది. జుబేదా బేగం అనే భారతీయురాలు తాను భారతదేశ పౌరురాలినేని ధ్రువీకరిస్తున్న 15 డాక్యుమెంట్లను సమర్పించింది. అయినా జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకై ప్రభుత్వం ఆమె పౌరసత్వ హక్కును తిరస్కరించింది.

పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నవారిపై, జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకై దేశద్రోహ అభియోగాలు మోపారు. లాఠీలు ఝళిపిస్తున్నారు. శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నవారిపై పోలీసు కాల్పులకు ఆదేశిస్తున్నారు (ఒక్క ఉత్తర ప్రదేశ్ లోనే ఇటువంటి కాల్పుల్లో 23 మంది చనిపోయారు). ఇదంతా జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకే సుమా! పౌరసత్వ సవరణ చట్టంపై పరోక్ష విమర్శ చేసిన ఒక నాటికను ప్రదర్శించినందుకుగాను ఒక ఉపాధ్యాయుడిని, ఒక విద్యార్థి తండ్రిని నిర్బంధించారు, జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు. ఎన్నికల ర్యాలీలలో గోలీ మారో అని అరిచేలా గుంపులను రెచ్చ గొట్టారు. అధికారంలో వున్న ఒక ముఖ్యమంత్రిని 'ఉగ్రవాది' అని దుయ్య బట్టారు. జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకే పాలకులు ఇలా వ్యవహరించారు. ఢిల్లీ విధానసభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ మధ్య పోటీని భారత్, పాకిస్థాన్‌ల మధ్య పోరాటంగా అభివర్ణించారు. ఎందుకో మరి చెప్పాలా?

160 నిమిషాల బడ్జెట్ ప్రసంగాన్ని చదవటం (అసంపూర్ణంగానే అయినప్పటికీ) సైతం జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడానికే. అలాగే కార్పొరేట్ కంపెనీలకు పన్ను రాయితీల రూపేణా రూ.1,45,000 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించడం కూడా ఎందుకో మరి చెప్పాలా? సవరించిన అంచనాల ప్రకారం వ్యవసాయం, ఆహారభద్రత, మధ్యాహ్న భోజన పథకం, నైపుణ్యాల అభివృద్ధి, ఆయుష్మాన్ యోజన (ఆరోగ్య భద్రతా పథకం) మొదలైన వాటిపై వ్యయాల్లో కోత విధించారు, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకే. 2017–18 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగం 6.1 శాతం మేరకు పెరిగిందని, వినియోగం 3.7 శాతం మేరకు తగ్గిపోయిందిని వెల్లడించిన జాతీయ నమూనా సర్వే సంస్థ నివేదికలు బహిర్గతం కాకుండా అడ్డుకున్నారు. ఎందుకు? జాతీయ ప్రయోజనాలను కాపాడే నిమిత్తమని మరి చెప్పాలా?

సుప్రసిద్ధ 'పెద్ద మనుషులు' నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతా, సందేసర సోదరులు, ఇంకా ఇతరులు గప్‌చుప్‌గా దేశం నుంచి పరారయ్యారు. జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకే వారు అలా వెళ్ళి పోవడానికి అనుమతించడం జరిగింది మరి. బ్రిటన్‌లో వున్న లలిత్ మోదీని భారత్‌కు అప్పగించాలని ఆ దేశ ప్రభుత్వంపై ఒత్తిడి చేయకపోవడం కూడా ఎందుకో మరి చెప్పాలా? ఈ జాతీయ ప్రయోజనాల జాబితాకు అంతూపొంతూ లేదు. జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకై ప్రభుత్వం అహోరాత్రులు అవిరామంగా శ్రమిస్తోంది. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరడం, ప్రపంచ అగ్రరాజ్యంగా, అవును, ప్రపంచ అగ్రరాజ్యంగా వెలుగొందే శుభవేళ వడిగా వచ్చేస్తోంది! అవునా, మోదీగారూ?

***(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)***

## జనవాక్యం

### నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఫిబ్రవరి నెల దాటకుండానే భానుడి ఉగ్రరూపంతో ఎండలు మండుతున్నాయి. నదులు, కాలువలలో నీటిమట్టం పడిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో అవసరమైన ప్రాంతాల్లో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. సాగునీరు లేక పంట భూములు, గొంతు తడవక పశువులు అల్లల్లాడుతున్నాయి. అయితే నీటి ఎద్దడికి మూలం, నివారణా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నదుల్లో, కాలువల్లోనూ సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు పరివాహక ప్రాంతాల్లో చెరువుల్లో పూడికతీత, బావులు, ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టినట్లయితే భూగర్భ జలాలు పెరగగలవు. ట్యాంకర్ల సరఫరాకి వెచ్చించే ధనాన్ని బావులు చెరువులు మరమ్మత్తులకు వినియోగించినట్లయితే నీటి ఎద్దడి నివారించడంతో పాటు మానవ,పశు సంతతితో పాటు భూమాతకు శాశ్వత నీటి పరిష్కారం లభిస్తుంది.

***– యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం***

### కుంచించుకుపోతున్న విమాన సేవలు?

తాజాగా విశాఖ విమానాశ్రయం నుండి రెండు విమాన సేవలు రద్దు అవుతున్నాయన్న వార్త విశాఖ వాసులను తీవ్ర నిరాశ,నిస్పృహలకు గురి చేస్తున్నది.గత సంవత్సర కాలంలో క్రమ క్రమంగా విమానాల రాకపోకలు తగ్గిపోతున్నాయి.విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించినా విమాన సర్వీసులు తగ్గిపోవటం ఆశ్చర్యంగా ఉంది. గత ఏడాది కాలంగా విశాఖలో రోజు రోజుకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.ఇలా అభివృద్ధి తిరోగమనంలో ఉంటే యువతకు ఉపాధి లేక వలసలు పోవాల్సిన పరిస్థితులు కనబడుతున్నాయి.పాలకుల వివాదాస్పద, హేతుబద్ధతలేని పోకడలతో రాష్ట్రానికి పెట్టుబడులు రాని వాతావరణం సృష్టించారు.కేంద్రం నుండి నిధులు రాబట్టటంలోనూ పూర్తిగా వైఫల్యం చెందారు.ఇది ముమ్మాటికీ రాష్ట్ర పాలకుల తప్పే!

***– కంభంపాటి కోటేశ్వర రావు***
విశాఖపట్నం

# ప్రత్యేక హోదాతోనే అభివృద్ధి వికేంద్రీకరణ

ఆరు సంవత్సరాల క్రితం పార్లమెంటులో నాటి ప్రధాన మంత్రి డా. మన్‌మోహన్ సింగ్ అవశేష ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను ప్రకటించారు. ఈ ప్రత్యేక హోదా ప్రకటించడానికి చెప్పిన సహేతుక కారణాలను తదనంతరం కేంద్రంలో అధికారం చేపట్టిన నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం విస్మరించడం వల్ల ఆరు సంవత్సరాల అనంతరం కూడ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ, ఆర్థిక, సామాజిక అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయి. అప్పులలో కూరుకుపోతూ రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిపోయింది. విభజన జరిగినప్పుడు నెలకొన్న వాతావరణమే సాగుతూ రాష్ట్ర భవిషత్తు అంధకారబంధురమైనది. విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధాని హైదరాబాద్ తెలంగాణకే దక్కడంతో విశ్వనగరంగా అభివృద్ధి చెందిన హైదరాబాద్ ఆదాయం మొత్తం తెలంగాణ రాష్ట్రానికే దక్కుతున్నందువల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు 5సంవత్సరాలు ప్రత్యేక హోదాను ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. కేబినెట్ ఆమోదం కూడా పొందింది. ఆర్డినెన్స్ జారీచేయాలనే ప్రయత్నం ఎన్నికల నియమావళి కారణంగా సాధ్యంకాలేదని తదుపరి ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపడుతుందని ఆనాడు ప్రధానమంత్రి చెప్పారు. దానితో షరతులతో కూడిన రాష్ట్ర విభజన జరిగింది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీని ముగిసిపోయిన అధ్యాయం అంటూ తేలిక భావంతో చూసి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తి విస్మరించి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై విశ్వాసం సన్నగిల్లే విధంగా అపహాస్యం చేసింది. రాజకీయ వైఖరులు, వైరుధ్యాల దుష్ప్రభావం అభివృద్ధి పైనా పరిపాలపైనా పడని విధంగా ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ వ్యవస్థకు చోటు చేసే విధంగ ప్రవర్తిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఆంధ్రప్రదేశ్‌ను దీనావస్థకు దిగజార్చింది.

రాష్ట్ర విభజన చేసిన గాయం కన్నా ఎక్కువగా వై.ఎస్. జగన్ ప్రభుత్వం చేసిన మూడు రాజధానుల ప్రకటన రాష్ట్ర ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేసి రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి అన్ని రాజకీయపక్షాలు, అన్ని వర్గాలు, ప్రాంతాలు ప్రజలు ఆమోదించి ఆహ్వానించిన అమరావతి రాజధాని తరలింపు నిర్ణయం ఒక విధ్వంసకర చర్య. రాజధాని అంటేనే శాసనవ్యవస్థ ఉన్నత న్యాయస్థానం, సచివాలయవ్యవస్థ మూడు పాలనా వ్యవస్థలను కలిగిఉండే "ముఖ్యపట్టణం". మూడు వ్యవస్థలు వేరువేరు నగరాలలో ఉంటే ఏఒక్క నగరానికి రాజధాని స్థాయి గుర్తింపు రాదు. ఉన్నత న్యాయస్థానం వేరే ప్రాంతాలలో ఉన్న రాష్ట్రాలు కొన్ని ఉన్నప్పటికీ వాటి చారిత్రక నేపథ్యం భిన్నమైనది. ఆయా రాష్ట్రాలు పునర్విభజనకు ముందే ఆ ప్రాంతంలో ఆ వ్యవస్థలు ఏర్పడి ఉండడం కారణంగా ఒక సర్దుబాటుగా ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పడినవి మాత్రమే అని గ్రహించాలి. అలహాబాద్‌లో హైకోర్టు నాగపూర్‌లో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు, మహారాష్ట్రతో ఉన్న సరిహద్దు వివాదం కారణంగా బెల్గాంలో కొద్దికాలం ఆ సమావేశాలు కర్ణాటక, ఆంధ్ర, కేరళలతో కూడిన మద్రాసు ప్రెసిడెన్సీ అనంతర కాలంలో కేంద్రస్థానం కానప్పటికీ తమిళనాడుకు మద్రాసు రాజధానిగా స్థిరపడిపోవడం ఇటువంటివే. ఒక గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నిర్మించుకొనే అవసరం, అవకాశం మనకు లభించినందు వలన మూడు వ్యవస్థలు కలిగిన లోపభూఇష్టత లేని పరిపూర్ణ రాజధానిగా అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయమైంది. రాజధాని అనేది కేవలం ఒక పరిపాలనా కేంద్రం మాత్రమే కాదు, అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను కలిపి ఉంచే ఒక ముఖ్యమైన బంధం. దేశంలోను ప్రపంచంలోను ఆ రాష్ట్రానికి గుర్తింపునిచ్చే శాశ్వత చిరునామా. రాజధాని అభివృద్ధిని ప్రాంతీయ అభివృద్ధిగా ప్రచారం చేయడం తగదు. రాజధానిలో ఉండవలసిన కార్యాలయాలను మూడు ప్రాంతాలకు విభజించడంవలన అదనంగా ఒక్క ఉద్యోగం రాదు. వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు వొరిగేదేమీలేదు. అధికార వికేంద్రీకరణ స్థానిక సంస్థల విధులలో రాజకీయ జోక్యం లేకుండా, నిధులు, విధులు బదలాయించి స్వతంత్ర నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛనివ్వడంద్వారానే సాధ్యమవుతుంది. రాజధానిని మూడుముక్కలు చేయడం ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందనేది అశాస్త్రీయ అద్భుతకల్పన. ప్రజలలో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే చర్య. మళ్ళీ రాష్ట్రం మరో విభజనకు దారితీసే పరిస్థితులకు నాటుపడిన విషభావం.




> **విశాఖపట్టణం పారిశ్రామిక నగరమైనప్పటికీ రాష్ట్ర జనాభాకు సరిపడా అవసరాలు తీరనందునే ఇతర రాష్ట్రాలు, నగరాలు, దేశాలకు మనయువత పొట్టచేత పట్టుకుని వలస పోవడం జరిగింది. విశాఖపట్టణంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు మరో మహానగరం అవసరం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని.. 13జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక హోదా.. ఇదే మన నినాదం కావాలి. ప్రభుత్వ రంగంలో కడప ఉక్కు, రామాయపట్నం మేజర్‌పోర్టు, కాకినాడ పెట్రోలియం రిఫైనరీ మరియు కెమికల్ కాంప్లెక్స్ చేపట్టినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగి అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.**

ఆయా ప్రాంతాలలో లభించే వనరుల ఆధారంగా 13జిల్లాల అభివృద్ధికి అన్ని పారిశ్రామిక రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా ఒక్కటే రాష్ట్ర విభజన షరతుగా పార్లమెంటు మనకు ఇచ్చిన హక్కు. మూడు రాజధానుల పేరుతో ప్రజలను ప్రాంతాల వారీగా విభజించి ప్రత్యేకహోదా ఉద్యమాన్ని నీరుగార్చి ముగించివేసే కుట్రకు ఆంధ్రప్రదేశ్ బలికాకుండా అప్రమత్తం కావలసిన బాధ్యత మేధావులు, ప్రజసంఘాలు, ఉద్యమ సంస్థలపైనే ఉన్నది.

ఒక పక్క ప్రపంచం వేగంగా ముందుకు కదులుతుంటే ఆంధ్రప్రదేశ్ అర్ధశతాబ్దం వెనుక బడిపోయింది. 33వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి స్వచ్ఛందంగా ఇచ్చి సమాజపరం చేయడం నిర్ద్వంద్వంగా సమ సమాజాన్ని కాంక్షించే గొప్ప నిర్ణయం. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించుకొనే ధ్యేయంగా రాష్ట్ర ఆర్థికాబివృద్ధి సాధించుకొనే విధంగా రాజధాని అమరావతి భూములను సద్వినియోగం చేసుకోవాలి. విశాఖపట్టణం పారిశ్రామిక నగరమైనప్పటికీ రాష్ట్ర జనాభాకు సరిపడా ప్రజల అవసరాలు తీరనందునే ఇతర రాష్ట్రాలు, నగరాలు, దేశాలకు మనయువత పొట్టచేత పట్టుకుని వలస పోవడం జరిగింది. విశాఖపట్టణంతో పాటు ఈ రాష్ట్ర అవసరాలకు మరో మహానగరం ఆంధ్రప్రదేశ్‌కు అవసరం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని.. 13జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక తరగతి హోదా.. ఇదే మన నినాదం కావాలి. ప్రభుత్వ రంగంలో కడప ఉక్కు, రామాయపట్నం మేజర్‌పోర్టు, కాకినాడ పెట్రోలియం రిఫైనరీ, కెమికల్ కాంప్లెక్స్ చేపట్టినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగి అన్ని పాంతాలు అభివృద్ధి చెంది నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

■ **అవధానుల హరి**
కన్వీనర్, ప్రత్యేకహోదా
ఆత్మగౌరవ పోరాట కమిటీ

## గల్లీ వాసుల మనసులు గెలిచిన
## ఢిల్లీ లీడర్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మూడోసారి విజయదుందుభి మోగించి దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించింది. ఏడు పార్లమెంటు సీట్లను ఏకపక్షంగా బీజేపీకిచ్చిన ఢిల్లీ ఓటర్లు ఇంతలోనే ఆప్‌కు మెజార్టీ కట్టబెట్టింది ఎందుకనే ప్రశ్న సహజంగానే వచ్చింది. దీనిపై ఎవరి విశ్లేషణలు వారు చేస్తున్నారు. ఈ విషయమై రాజధాని ప్రజలు ఒక సర్వేలో తమ అభిప్రాయాలను స్పష్టంగానే వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశ భద్రత, జాతీయస్థాయి సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆ స్థాయి నాయకత్వానికి మోదీ సమర్థవంతమైన లీడర్ అని భావించాము. ఇప్పుడు ఢిల్లీ వరకు స్థానిక సమస్యలను పరిష్కరించడంలో కేజ్రీవాల్ రియల్ లీడర్‌గా వ్యవహరిస్తున్నందున మరోసారి వీరినే గెలిపించాలని భావించామని తెలియజేశారు. బీజేపీకి రాజధాని ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం అయినందున బీజేపీయే ఢిల్లీలో అధికారంలోకి వస్తుందని వేసిన రాజకీయ విశ్లేషకులు, ఎన్నికల పండితులు, మీడియా అంచనాలు తలకిందులైనాయి. నగరంలోని మురికివాడలను, అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాలను, ఇరుకు గల్లీలను, చాలీ చాలని ఆదాయాలతో నెట్టుకొస్తున్న మధ్య తరగతి వర్గాలను ప్రత్యేకంగా గుర్తించి వారితో ఎప్పుడూ నిరంతర సంబంధ బాంధవ్యాలు కొనసాగిస్తూ కొంతమేర స్థానిక ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని నిర్మూలించడం, నీరు, విద్యుత్తు వంటి అతి ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడం ఢిల్లీ బస్సులనందు మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి ఆదేశాలు జారీ చేయడం వంటి కారణాలతో పైన పేర్కొన్న ప్రత్యేక వర్గాలు ఇతని వైపు మొగ్గుచూపాయి. తనను కలుసుకోవడానికి వచ్చే సందర్శకులకు ప్రత్యేకంగా అపాయింట్‌మెంట్స్ లేకుండా ఎప్పుడూ అందుబాటులో వుండడం కూడా కేజ్రీవాల్‌కు చాలా క్రేజ్‌ను పెంచాయి. ఎన్నికల్లో గెలుపును కట్టబెట్టాయి.

***– తిప్పినేని రామదాసప్పనాయుడు***

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం ● 22 ఫిబ్రవరి 2020
navya@andhrajyothy.com

తెలుసుకుందాం!



## స్కిన్‌ఫాస్టింగ్‌తో...

చర్మ సంరక్షణలో సరికొత్త ట్రెండ్ 'స్కిన్ ఫాస్టింగ్'. అంటే చర్మం మెరుపు కోసం ఉపయోగించే సౌందర్య సాధనాలకు విరామం ఇవ్వడం. దాంతో చర్మం శ్వాస తీసుకుంటుంది. వారానికి ఒకసారైనా 'స్కిన్‌ఫాస్టింగ్' పాటించాలి అంటున్నారు చర్మ నిపుణులు...

**ఎలా చేయాలంటే...**

రాత్రి పూట రాసుకునే క్రీమ్ లేదా మాయిశ్చరైజర్‌ను కొన్ని రోజులు మానేయండి. దాంతో చర్మం తనంత తాను మరమ్మతు చేసుకుంటుంది. ఫలితంగా అందం కోసం సౌందర్య ఉత్పత్తుల వాడకం చాలా వరకు తగ్గుతుంది. కొన్ని రకాల స్కిన్‌కేర్ ఉత్పత్తులు చర్మాన్ని పొడిగా, గరుకుగా మారుస్తాయి. అప్పుడు 'స్కిన్‌ఫాస్టింగ్' చేస్తే మీ చర్మతత్వానికి ఏరకమైన క్రీమ్స్, లోషన్స్ పడతాయో తెలుస్తుంది. ఒకరకంగా చర్మానికి ఏది మంచో ఏది చెడో తెలిసిపోతుంది. స్కిన్‌ఫాస్టింగ్ చేయడం వల్ల చర్మం డీటాక్స్ అవుతుంది.

ఆహారం- ఆరోగ్యం



## పొట్ట బరువుగా...

నా వయసు 52 సంవత్సరాలు. ఈమధ్య మధుమేహం వచ్చింది. టాబ్లెట్స్ వాడుతున్నా. ఆహార విషయంలో జాగ్రత్తగానే ఉంటా. కానీ ఈమధ్య సాయంత్రం అయ్యేప్పటికీ పొట్ట బరువుగా, గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఇది మధుమేహం వల్ల వచ్చే సమస్యనా, లేదా ఆహార మార్పులు ఏమైనా చేయాలా?

**-మనోహరి,** కాకినాడ

పొట్ట ఉబ్బరం, బరువుగా ఉండటం, గ్యాస్‌తో ఇబ్బంది... ఇవన్నీ కూడా ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలు. సాధారణంగా మధుమేహం, బీపీ ఉన్నవారికి ఇలా అనిపించొచ్చు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం, ప్రాసెస్ చేసిన ఆహారం అతిగా తినడం, అతిగా మందులు వాడటం, మత్తుమందులు, మద్యపానం, పొగత్రాగడం, నిద్రలేమి మొదలైనవి నిత్యం ఇన్‌ఫ్లమేషన్‌కు గురి చేస్తూ ఉంటాయి. సో... ఇలాంటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటంటే... ◗ ఆకుకూరలు ప్రతిరోజూ వాడటం. ◗ బాదం పప్పు ప్రతిరోజూ 10 తీసుకోవడం. ◗ పంచదార, స్వీట్స్ వెంటనే మానేయడం. ◗ పండ్లు అధికంగా తీసుకోవడం. ◗ వారానికి రెండుసార్లు చేపలు తినడం. చేపలు తిననివారు వాల్‌నట్స్, ఆల్మండ్స్ క్రమం తప్పకుండా తీసుకోవాలి. ◗ ప్రతిరోజూ రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం. ◗ రోజుకు 8 గంటలు నిద్రపోవాలి. అది కూడా సమయానికి నిద్రపోవడం ముఖ్యం. ◗ మజ్జిగ, పెరుగు, ప్రో బయాటిక్ సప్లిమెంట్ వాడటం వల్ల కూడా రోగనిరోధక శక్తి పెరిగి, పొట్ట ఉబ్బడం తగ్గుతుంది.

ఈవిధంగా లైఫ్‌స్టయిల్‌లో, ఆహార నియమాల్లో మార్పులు చేస్తే శరీరం తేలికగా ఉంటుంది.



● **డాక్టర్ బి.జానకి,** న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com



వంటిల్లు

# ఇవి...ఇంటి స్నాక్స్!

**బయట ఫుడ్ కన్నా ఇంటిఫుడ్ ఆరోగ్యకరం అని తెలిసినా కొన్నింటిని ఎలా తయారు చేయాలో తెలియదు. ముఖ్యంగా పిల్లలు ఇష్టంగా తినే స్నాక్స్ తయారీ తల్లులకు ఒకరకంగా పరీక్షే. డ్రైఫ్రూట్స్‌తో ఇంట్లోనే రుచికరమైన, ఆరోగ్యకరమైన స్నాక్స్ ఎన్నో తయారుచేయొచ్చు. చిక్కీ, కోఫ్తా, కేక్, కబాబ్, లడ్డూ... ఈ హెల్దీ స్నాక్స్ చేసి పిల్లల ముందు పెట్టండి. పిల్లలే కాదు... వీటిని ఇంటిల్లిపాది కూడా ఇష్టపడతారు!**

## డ్రై ఫ్రూట్ చిక్కి

**కావలసినవి**

వేరుసెనగలు - 100 గ్రాములు, జీడిపప్పు - 100 గ్రాములు, వాల్‌నట్స్ - 100 గ్రాములు, బాదం - 50 గ్రాములు, సోంపు - ఒక టేబుల్‌స్పూన్, పంచదార - 350గ్రా., తేనె - 350గ్రా., వెన్న - రెండు టేబుల్ స్పూన్లు, నిమ్మరసం - ఒక టీస్పూన్, తినేసోడా - అర టీస్పూన్.

**తయారీ**

- వేరుసెనగలు, జీడిపప్పు, వాల్‌నట్స్, బాదం, సోంపును చిన్నమంటపై వేగించాలి.
- తరువాత ఆ మిశ్రమంలో పంచదార, తేనె, నీళ్లు పోసి ఉడికించాలి.
- మిశ్రమం చిక్కబడే వరకు ఉడికించాలి.
- ఇప్పుడు స్టవ్‌పై నుంచి దింపి నిమ్మరసం, వెన్న, తినేసోడా వేసి కలియబెట్టాలి.
- దీన్ని ఒక ప్లేట్‌లోకి తీసుకుని చల్లార్చాలి.
- చల్లారి, గట్టిగా అయిన తరువాత చిన్నచిన్న ముక్కలుగా కట్ చేయాలి.
- వీటిని డబ్బాలో భద్రపరిచి పిల్లలకు అప్పుడప్పుడు ఇస్తుంటే ఇష్టంగా తింటారు.

## ఆల్మండ్ కోఫ్తా



**కావలసినవి**

బంగాళదుంపలు - నాలుగు, జాజికాయ పొడి - చిటికెడు, పాలు - రెండు టేబుల్‌స్పూన్లు, బాదం పలుకులు - ముప్పావు కప్పు, పిండి - ఒక కప్పు, కోడిగుడ్లు - మూడు, ఉప్పు - కొద్దిగా, మిరియాల పొడి - అర టీస్పూన్, బ్రెడ్ ముక్కలు - కొన్ని.

**తయారీ**

- ముందుగా బంగాళదుంపలు ఉడికించాలి.
- పొట్టు తీసి గుజ్జుగా చేసి ఒక పాత్రలోకి తీసుకోవాలి.
- అందులో బాదం పలుకులు, ఉప్పు, మిరియాలపొడి, జాజికాయ పొడి, పాలు, పిండి, రెండు కోడిగుడ్లు కొట్టి వేసి బాగా కలియబెట్టాలి.
- ఈ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో పావుగంట పాటు పెట్టాలి.
- తరువాత కోఫ్తాలుగా కట్ చేసుకోవాలి.
- ఒక ప్లేటులో పొడి పిండి, మరొక ప్లేటులో కోడిగుడ్డు సొన, ఇంకో ప్లేటులో బ్రెడ్ ముక్కలు తీసుకోవాలి.
- ఒక్కో కోఫ్తాను తీసుకుంటూ పిండిలో అద్ది, కోడిగుడ్డు సొనలో అద్దాలి. తరువాత బ్రెడ్‌ముక్కలపై దొర్లించాలి.
- ఈ కోఫ్తాలను ప్రీ హీట్ ఓవెన్‌లో పెట్టి ఉడికించి వేడి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

## ప్లమ్ కేక్



**కావలసినవి**

వెన్న - ఒక కప్పు, పంచదార - ఒకటిన్నర కప్పు, కోడిగుడ్లు - ఆరు, బాదం - 125గ్రా., వెనిలా ఎసెన్స్ - రెండు టీస్పూన్లు, మిక్స్‌డ్ ఫ్రూట్స్ - రెండున్నర కప్పులు, పిండి - రెండు కప్పులు, కేక్ టిన్ - ఒకటి.

**తయారీ**

- రెండు టేబుల్‌స్పూన్ల మైదాను ఒక పాత్రలో తీసుకుని అందులో మిక్స్‌డ్ ఫ్రూట్స్ ముక్కలు, బాదం వేసి బాగా కలపాలి.
- ఈ పిండిలో వెన్న, పంచదార (తీపిని బట్టి తీసుకోవాలి), కోడిగుడ్లు, వెనీలా ఎసెన్స్ వేసి కలియబెట్టాలి.
- ఈ మిశ్రమాన్ని కేక్ టిన్‌లోకి తీసుకుని ప్రీ హీటెడ్ ఓవెన్‌లో 30 నుంచి 40 నిమిషాల పాటు ఉడికించాలి.
- బేకరీలోలాగే నోరూరించే ప్లమ్ కేక్ రెడీ అయిన తర్వాత దాన్ని ముక్కలుగా కోసి ఇవ్వాలి.

## డ్రై ఫ్రూట్ లడ్డూ



**కావలసినవి**

ఖర్జూరం - పావు కప్పు, జీడిపప్పు - పావుకప్పు, బాదం - పావుకప్పు, పిస్తా - పావుకప్పు, డ్రై అప్రికాట్స్ - ఆరు, డ్రై ఫిగ్స్ - నాలుగు, ఎండు కొబ్బరి - రెండు టేబుల్‌స్పూన్లు, నువ్వులు - రెండు టేబుల్‌స్పూన్లు, నెయ్యి - ఒకటీస్పూన్.

**తయారీ**

- ముందుగా ఒక పాత్రలో నెయ్యి వేసి బాదం, జీడిపప్పు బాగా వేగించాలి.
- తరువాత పిస్తా వేసి మరో రెండు నిమిషాలు వేగించి వీటన్నింటి తీసి పక్కన పెట్టుకోవాలి.
- తరువాత అప్రికాట్స్, ఫిగ్స్ కాస్త వేడి అయ్యేలా వేగించాలి.
- ఖర్జూరం, అప్రికాట్స్, ఫిగ్స్‌ను మిక్సీలో వేసి గ్రైండ్ చేయాలి.
- ఈ మిశ్రమంలో జీడిపప్పు, బాదం, పిస్తా వేసి కలపాలి.
- ఈ మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతుల్లోకి తీసుకుంటూ లడ్డూలుగా చేసుకోవాలి.
- ఎండుకొబ్బరి, నువ్వులు లడ్డూలపై అద్దుకుంటూ పక్కన పెట్టుకోవాలి.
- ఈ డ్రై ఫ్రూట్ లడ్డూలను పిల్లలు ఇష్టంగా తింటారు.

## దహీ అంజీర్ కబాబ్



**కావలసినవి**

అంజీర్ - 100గ్రా., పెరుగు - 250గ్రా., పనీర్ - 400గ్రా., సెనగపిండి - 150గ్రా., బ్రెడ్ ముక్కలు - కొన్ని, అల్లం - చిన్నముక్క, పచ్చిమిర్చి - నాలుగు, కొత్తిమీర - ఒకకట్ట, నెయ్యి - 200గ్రా., గరంమసాలా- ఒక టీస్పూన్, యాలకుల పొడి - అర టీస్పూన్, జీలకర్ర పొడి - ఒక టీస్పూన్, ఉప్పు - రుచికి తగినంత.

**తయారీ**

- ఒక పాత్రలో పెరుగు తీసుకొని అందులో పనీర్, అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమీర, గరంమసాల, యాలకుల పొడి, జీలకర్రపొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.
- మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతులోకి తీసుకుంటూ వేగించిన సెనగపిండి, బ్రెడ్ ముక్కలతో కలపాలి.
- చిన్న చిన్న ఉండలుగా తీసుకొని మధ్యలో అంజీర్ పెట్టి కబాబ్‌లుగా చేసుకోవాలి.
- ఒక పాత్రలో నూనె వేసి కాస్త వేడి అయ్యాక చిన్నమంటపై ఈ కబాబ్‌లను గోధుమ వర్ణంలోకి వచ్చేదాకా ఫ్రై చేసుకోవాలి.
- పుదీనా చట్నీ కాంబినేషన్‌లో ఇవి బాగుంటాయి.

కళ



**చాక్లెట్ కవర్, ప్లాస్టిక్ వాటర్ బాటిల్, ఆలౌట్ లిక్విడ్ బాటిల్, కొబ్బరి చిప్పలు... ఇలా ఏ వస్తువైనా వాడేసిన తర్వాత చెత్తలో కలిపేస్తాం! కానీ ఆమె మాత్రం వాటితో చూడముచ్చటైన బొమ్మలు తయారు చేస్తారు. క్విల్లింగ్ పేపర్‌తో బొమ్మలు, టెక్స్‌టైల్ డాల్స్ తయారు చేసి 'ఔరా' అనిపించుకున్నారు. 'గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి ఎక్కిన ఒక ఈవెంట్‌లో కూడా ఆమె భాగస్వామ్యం ఉంది. నెల్లూరుకు చెందిన పాబోలు శారదామణిని ముచ్చటగొలిపే బొమ్మల 'మణి'హారం అనొచ్చు. అసలు ఆమెకు ఈ కళ ఎలా అబ్బిందంటే...**



# బొమ్మల మణిహారం!

"మాది ప్రకాశం జిల్లా పామూరు. బీకాం కంప్యూటర్స్ వరకు చదివాక నెల్లూరువాసి పాబోలు సుబ్రహ్మణ్యంతో వివాహమయ్యింది. మాకు ఇద్దరు సంతానం. పిల్లలు బడికి, ఆయన షాప్‌కు వెళ్లిన తర్వాత పగలంతా ఇంట్లో నేనొక్కదాన్నే ఉండాలంటే బోర్ కొట్టేది. దాంతో ఏదో చేయాలన్న తపన మొదలైంది. అప్పుడే ఓ ఆలోచన తట్టింది. ఇంట్లో వాడి పడేసిన చాక్లెట్ కవర్లు, వాటర్ బాటిళ్లు, ఆలౌట్ బాటిల్స్, న్యూస్ పేపర్స్ కనిపించాయి. వాటితో ఏదైనా చేద్దామని అనుకున్నా. అంతే ఆ మరుసటి రోజే కొన్ని బొమ్మలు తయారు చేశా. వాడేసిన పైపులతో ఫ్లవర్‌వాజ్‌లు.. ఫొటో ఫ్రేమ్‌లు... ఇలా ఒక్కటేమిటి నా మనసులో ఏం అనిపిస్తే వాటిని చకచకా చేసుకుంటూ పోయా. నా ఉత్సాహం చూసి ఇంట్లో వాళ్లు కూడా ప్రోత్సహించారు.

**క్విల్లింగ్ పేపర్లతో..**

కొన్నాళ్ల తర్వాత ఇంకా ఏదైనా కొత్తగా తయారు చేయాలని అనిపించింది. మార్కెట్లో దొరికే సాధారణ రంగు కాగితాలను 3 నుంచి 12 మిల్లీ మీటర్ల వెడల్పుతో కట్ చేసి అమ్ముతూ ఉంటారు. నా దృష్టి వాటిపై పడింది. నాకు నేనుగా 5 ఎం.ఎం వెడల్పు కలిగిన క్విల్లింగ్ పేపరుతో బొమ్మలు తయారు చేయడం మొదలు పెట్టాను. వాటిలో 12 రాశులు, చిన్నారులు ఆడుకునే బొమ్మలు, దశావతారులు, భరతమాత, జంతు ప్రదర్శన శాల, సంగీత వాయిద్య పరికరాలు, పెళ్లి సందడి దృశ్యాలు, మూడు కోతుల బొమ్మలు, క్రీస్తు జననం దృశ్యాలు, జపనీస్ ఫ్యామిలీ బొమ్మలు, దేవతామూర్తులు... ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. కొన్నాళ్లకు 'క్విల్లింగ్ జ్యువెల్లరీ' తయారు చేయడం మొదలు పెట్టాను. మొదట్లో కొంత ఇబ్బంది పడ్డా ఆ తర్వాత అలవాటయ్యింది. ఇంట్లో ఉండే చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలు, కొబ్బరి చిప్పలు... ఇలా వాడి పారేసే వస్తువులతో కూడా జ్యువెల్లరీ చేశా. త్రీడీ క్విల్లింగ్ బొమ్మలు తయారు చేసినందుకు 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు'లో నాకు చోటు దక్కింది. ఆ తర్వాత అనేక అవార్డులు అందుకున్నా.



'బాహుబలి' బొమ్మలు...

**'బాహుబలి' బొమ్మలు...**

పేపర్స్‌తోనే కాకుండా వస్త్రంతో కూడా సృజనాత్మకంగా బొమ్మలు తయారుచేయడం స్వయంగా నేర్చుకున్నా. వీటిలో 'బాహుబలి' నటీనటుల బొమ్మలు కూడా ఉన్నాయి. దేశంలో 15 రాష్ట్రాలకు చెందిన వధూవరుల బొమ్మలను కూడా చేశా. గత ఏడాది బెంగళూరులో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఇతర కళాకారులతో కలిసి 2500 బొమ్మలను ప్రదర్శించాం. ఈ ఈవెంట్‌కు 'గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు లభించింది."

### అనాథ పిల్లలకూ నేర్పుతున్నా..

హాబీగా నేర్చుకున్న ఈ కళను పిల్లలకూ నేర్పుతున్నా. ముఖ్యంగా అనాథ శరణాలయంలో ఉండే చిన్నారులకు ఈ కళ నేర్పడం వల్ల వారి జీవనోపాధికి ఉపయోగ పడుతుందని అనుకుంటున్నా. నా దగ్గర ఈ కళను నేర్చుకున్న కొందరు పిల్లలు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీలలో బహుమతులు కూడా గెలుచుకున్నారు. 'క్విల్లింగ్' పేపర్లతో తయారు చేసే బొమ్మలతో సోలోగా 'గిన్నిస్ బుక్ రికార్డ్' సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నా. అందుకు అవసరమైన బొమ్మల తయారీలో బిజీగా ఉన్నా. ఏదో ఒకరోజు నా లక్ష్యాన్ని చేరుకుంటా.

● **గోళ్ల రామకృష్ణ,** నెల్లూరు
ఫొటోలు: **ఎస్.డి.జకీర్**



వినూత్నం



## 'ఫుడ్‌వేస్ట్' ఇట్టే చెప్పేస్తుంది!

'ఫుడ్ బిహేవియర్' అనేది అందరికీ అవసరమే. పార్టీల్లో, ఫంక్షన్లలో ప్లేటు నిండా ఆహారాన్ని నింపుకుని, ఆ తర్వాత తినలేక డస్ట్‌బిన్‌లో పడేసేవారు చాలామంది కనిపిస్తారు. అలా వాళ్లు పారేస్తున్న పదార్థాల బరువు ఎంత ఉంటుందో అక్కడే తెలిసిపోతే ఎలా ఉంటుంది? మరోసారి ఫుడ్ వేస్ట్ చేసేందుకు ఎవరికీ మనసొప్పదు. అచ్చంగా అలాంటి ఆలోచనే ఇది. రాజస్థాన్‌లోని 'అనిల్ అగర్వాల్ ఎన్విరాన్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్'లో ఈ డిజిటల్ డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేశారు. ఈ డస్ట్‌బిన్ ఆర్గానిక్, ప్లాస్టిక్, పేపర్, అదర్స్ పేరిట నాలుగు రకాల డబ్బాలతో ఉంటుంది. వాటన్నింటిని ఒక డిజిటల్ త్రాసుతో అనుసంధానించారు. ప్లేట్‌లో మిగిలిన ఆహారపదార్థాలను డస్ట్‌బిన్‌లో వేయగానే అక్కడే ఉన్న డిజిటల్ త్రాసులో గ్రాములు, కిలోల లెక్కన 'వేస్ట్' బరువును చూపెడుతుంది. 'దీనివల్ల ప్రతీ ఒక్కరికి 'ఫుడ్ బిహేవియర్' అలవడుతుందని, ఫుడ్ వేస్ట్ చాలా తగ్గింద'ని ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు అంటున్నారు. మన ఫంక్షన్‌హాళ్లలో కూడా ఇలాంటి డస్ట్‌బిన్‌లు ఏర్పాటుచేస్తే బాగుంటుందేమో కదూ.



టెక్ సందేహాలు

## వైర్‌లెస్ ఇయర్‌బడ్స్ వాడొచ్చా?

**వైర్‌లెస్ ఇయర్ బడ్స్ వాడటం వల్ల ఏమైనా సమస్యలు ఉంటాయా? వాటి పనితీరు ఎలా ఉంటుంది?**

**- పార్థు**



ఇటీవలి కాలంలో వైర్‌లెస్ ఇయర్ బడ్స్ వినియోగం బాగా పెరిగింది. ఇవి బ్లూటూత్ ఆధారంగా పనిచేస్తాయి. మంచి క్వాలిటీ కలిగిన వైర్డ్ ఇయర్‌ఫోన్లతో పోలిస్తే వైర్‌లెస్ ఇయర్ బడ్స్ కొద్దిగా శబ్దం నాణ్యతను తక్కువ అందిస్తాయి. అయితే ఒక అంచనా ప్రకారం చాలామందికి 90 శాతానికి మించి శబ్దాలలో స్పష్టత అర్థం కాదు కాబట్టి, వైర్‌లెస్ ఇయర్ బడ్స్ మెరుగైన క్వాలిటీ అందిస్తున్నట్లు అనిపిస్తూ ఉంటుంది. వీటిని ఒక అరగంట లేదా గంట వాడటం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు కానీ, రోజు మొత్తం మీద అంతకన్నా ఎక్కువ సమయం వాడినప్పుడు వినికిడి లోపం తలెత్తుతుంది. అలాగే చెవులకు ఇన్ఫెక్షన్స్ వస్తూ ఉంటాయి. కాబట్టి మీ జాగ్రత్తలో మీరు ఉండటం మంచిది.

## ముందుగా ఆ ఫోన్లకే ఎందుకు?

**గూగుల్ సంస్థ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం లేటెస్ట్ వెర్షన్స్‌ను మొట్టమొదట పిక్సెల్ ఫోన్లకు మాత్రమే ఎందుకు అందిస్తుంది?**

**- రాజశేఖర్**



గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం రూపొందించేటప్పుడు తాను స్వయంగా తయారు చేసిన పిక్సెల్ ఫోన్ల మీద ప్రయోగాలు చేస్తుంది. ఆ కారణం చేత డెవలపర్ ప్రివ్యూ వెర్షన్ మొట్టమొదట పిక్సెల్ ఫోన్లకే లభిస్తుంది. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆండ్రాయిడ్ బీటా ప్రోగ్రాంలో భాగంగా ఏవైతే ఫోన్ తయారీ సంస్థలు ఆండ్రాయిడ్ లేటెస్ట్ వెర్షన్ తమ ఫోన్లకు బీటా రూపంలో అందించడానికి సిద్ధంగా ఉంటాయో ఆయా ఫోన్లను కూడా బీటా వెర్షన్ జాబితాలో చేర్చుకోవడం జరుగుతుంది. ఆండ్రాయిడ్ వెర్షన్‌లో ఆపరేటింగ్ సిస్టంలో తయారు చేసేది గూగుల్ సంస్థ అయితే, ఫోన్‌లను తయారు చేసేది ఇతర కంపెనీలు కాబట్టి అవి సంసిద్ధత వ్యక్తం చేయకుండా గూగుల్ తనకు తాను ఆండ్రాయిడ్ లేటెస్ట్ వెర్షన్ మార్కెట్లో ఉన్న అన్ని ఫోన్లకు అందించలేదు. ఈ పరిస్థితిని మార్చడానికి గూగుల్ తాజాగా పలు రకాల పద్ధతులు తీసుకువస్తోంది. ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్‌కు సంబంధించిన పార్టిషన్ ఒకటి మాత్రమే విడిగా అప్‌డేట్ అయ్యే విధంగా ప్రాజెక్ట్ ట్రెబల్ వంటి పద్ధతులు కూడా తీసుకు వచ్చినప్పటికీ, అధిక శాతం ఫోన్ తయారీ కంపెనీలు దీనిని అమలు పరచడానికి ముందుకు రాలేదు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం: navya@andhrajyothy.com

టెక్ గురు




# సరికొత్త ప్రపంచానికి స్వాగతం!

రోబోట్ అంటే అందరికీ గుర్తొచ్చేది.. ఒక యంత్రం అని. రోబోట్ కొంత ప్రోగ్రామింగ్ ద్వారా మనం నిర్దేశించిన పనులను చేసి పెడుతూ ఉంటుంది. అయితే జీవం లేని వాటితో పాటు, మరోవైపు ప్రాణం ఉన్న మరికొన్ని రోబోట్లు కూడా రాబోతున్నాయి. ఒక కప్ప అండంలోని స్టెమ్ సెల్స్‌ని ఆధారంగా చేసుకొని తయారుచేసిన ఇలాంటి రోబోట్స్ మానవ శరీరంలో మెడిసిన్ అవసరమైన భాగానికి ఈదుకుంటూ వెళ్లి మెడిసిన్‌ని నేరుగా ఆ ప్రదేశానికి అందించడంతోపాటు, సముద్రాలలో పేరుకుపోతున్న మైక్రోప్లాస్టిక్‌ని సేకరించడానికి ఉపయోగపడనున్నాయి. ఇవి కేవలం మిల్లీమీటర్ పరిమాణంలో ఉంటాయి.

### స్పర్శతో కూడిన వర్చ్యువల్ రియాలిటీ

వర్చ్యువల్ రియాలిటీ హెడ్‌సెట్‌ని తలకు తగిలించుకుంటే మనం ఉన్న ప్రదేశాన్ని పూర్తిగా మర్చిపోయి మనం ఆడే గేమ్, అప్లికేషన్లో పూర్తిగా మునిగిపోతాం అన్న విషయం తెలిసిందే. వర్చ్యువల్ రియాలిటీ హెడ్‌సెట్ తగిలించుకొని వేర్వేరు దేశాలలో నివసిస్తున్న ఇద్దరు కుటుంబ సభ్యులు మాట్లాడుకుంటుంటే, ఒకరికి ఒకరు ఎదురుగా ఉన్న అనుభూతి అయితే కలుగుతుంది. అయితే దాంతోపాటు స్పర్శ కూడా జతచేరితే మరింత ప్రభావవంతంగా ఉంటుంది కదా? సరిగ్గా ఇదే సదుపాయం త్వరలో రాబోతోంది. ఇద్దరు వ్యక్తులు ప్రత్యేకమైన సెన్సార్లని అమర్చుకుంటే ఒకరినొకరు తాకిన అనుభూతి కూడా పొందగలుగుతారు. గేమ్స్ ఆడేటప్పుడు మీరు ఒక క్యారెక్టర్‌ని ఎంచుకుంటారు కదా! వేరే ప్లేయర్ వచ్చి మీ క్యారెక్టర్‌ని తాకితే ఆ అనుభూతి మీకు కూడా కలుగుతుంది. అంటే మనం ఉన్న ప్రపంచాన్ని మర్చిపోయి వేరే లోకంలో విహరించవచ్చు అన్నమాట.

### చిన్న సూదితో కేన్సర్ నిర్ధారణ

ప్రాణాంతకమైన కేన్సర్‌ని గుర్తించడం కోసం లండన్ శాస్త్రవేత్తలు ఒక స్మార్ట్ సూదిని కనుగొన్నారు. ఇప్పటివరకు కేన్సర్‌ని గుర్తించాలంటే శరీరం లోని సంబంధిత భాగాన్ని బయాప్సీగా సేకరించి, దాన్ని విశ్లేషించాల్సి వచ్చేది. అయితే కొత్తగా ఆవిష్కరించిన స్మార్ట్‌నీడిల్ రామన్ స్పెక్ట్రోస్కోపీ అనే టెక్నిక్ ఆధారంగా పనిచేస్తుంది. శరీరంలో పరిశీలించాల్సిన ప్రదేశంలోకి తక్కువ విద్యుత్ కలిగి ఉండే ఒక చిన్న లేజర్ కిరణాన్ని పంపిస్తుంది. క్షణాల్లో కేన్సర్ వ్యాధి ఉందా లేదా! అన్నది నిర్ధారణ అవుతుంది.

### సిలికాన్ చిప్‌లలో కృత్రిమ న్యూరాన్లు

మెదడులో జ్ఞాపకాలు మొదలుకుని, అనుభూతుల వరకూ న్యూరాన్ల ద్వారా, వారి మధ్య జరిగే ఫైరింగ్ ద్వారా ఏర్పడుతూ ఉంటాయి. అయితే గుండెపోటు వచ్చినప్పుడు గానీ, అల్జీమర్స్ లాంటి జ్ఞాపకశక్తికి సంబంధించిన రుగ్మతల సమయంలో మెదడులో న్యూరాన్లు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. ఈ నేపథ్యంలో పరిశోధకులు సిలికాన్ చిప్‌ల మీద పొందుపరచగలిగే కృత్రిమమైన న్యూరాన్లని అభివృద్ధి చేశారు. ఇవి మన నాడీవ్యవస్థలో ఉండే వివిధ రకాల న్యూరాన్ల లక్షణాలను పుణికి పుచ్చుకోగలుగుతాయి. ఒక న్యూరాన్ కేవలం 140 నానోవాట్స్ విద్యుత్‌ను మాత్రమే వినియోగించుకుంటుంది. ఒక మైక్రో ప్రాసెసర్‌కి మనం అందించే విద్యుత్‌లో ఇది బిలియన్ భాగం మాత్రమే. అంత తక్కువ విద్యుత్తుని తాను కూడా వినియోగించుకుంటూ న్యూరాన్ల లక్షణాలను ఈ తాజా ఆవిష్కరణ కలిగి ఉంటుంది. హార్ట్ ఫెయిల్యూర్, అల్జీమర్స్ వంటి సందర్భాలలో మెడికల్ ఇంప్లాంట్స్‌గా ఇవి ఉపయోగపడతాయి.

### ప్లాస్టిక్‌ని తినేసే బ్యాక్టీరియా

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు అతి పెద్ద సమస్య ప్లాస్టిక్. ఒక నివేదిక ప్రకారం నిమిషానికి ప్రపంచ వ్యాప్తంగా కోటి వాటర్ బాటిల్స్ అమ్ముడవుతున్నాయి. అనేక ఇతర రూపాల్లో కూడా ప్లాస్టిక్ వినియోగం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు ప్లాస్టిక్‌ని తినేసే ఒక బ్యాక్టీరియాని కనుగొన్నారు. 2016 నుంచి పరిశోధనలు మొదలు పెట్టి ఒక ప్రత్యేకమైన ఎంజైమ్ ఆధారంగా ప్లాస్టిక్‌ని తినేసే ఈ బ్యాక్టీరియాని కనుక్కోవడం జరిగింది. దీన్ని భారీ స్థాయిలో ఉత్పత్తి చేసి ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదే గనక సాధ్యపడితే ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడుతుంది.

### వెరైటీ స్కానర్

షాపింగ్ మాల్స్‌లో ఉండే బార్‌కోడ్ స్కానర్ మీరే చూసే ఉంటారు. సరిగ్గా అదే విధంగా కనిపించే ఒక ప్రత్యేకమైన స్కానర్‌ని ఏదైనా ఫోటో మీద పెట్టి స్కాన్ చేసినప్పుడు. ఆ ఫోటో మొత్తం మెమరీ లోకి వెళ్లి, ఆ తర్వాత ఆ స్కానర్‌ని టేబుల్, గోడ, పేపర్ వంటి ఏ ఉపరితలం మీద పెట్టినా ఇంతకుముందు స్కాన్ చేసిన ఫోటో ఉన్నది ఉన్నట్లు ప్రత్యేకమైన ఇంక్ ద్వారా ముద్రితమవుతుంది. ఇలాంటి ఎన్నో రకాల ప్రత్యేకమైన ఉత్పత్తులు భవిష్యత్తులో రాబోతున్నాయి. ఖచ్చితంగా ఇప్పుడు మనం జీవిస్తున్న విధానానికి భిన్నమైన జీవనశైలిని భవిష్యత్తులో ఆస్వాదించబోతున్నాం.

### తాగి ఉంటే నడవదు

మద్యం తాగి డ్రైవింగ్ చేసే వాళ్లని చూస్తూనే ఉంటాం. బ్రీత్ ఎనలైజర్ల ద్వారా అలాంటి వాళ్ళని పట్టుకున్నా కూడా పెద్దగా ఫలితం ఉండదు. మళ్లీ మళ్లీ అలాంటి పనులు చేస్తూనే ఉంటారు. అయితే సరికొత్త కార్ టెక్నాలజీ వస్తోంది. యుఎస్ నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ దీన్ని అభివృద్ధి చేసింది. త్వరలో ప్రపంచ వ్యాప్తంగా అన్ని కంపెనీల కార్లలో ఇది వచ్చే అవకాశం ఉంది. కార్ డ్రైవింగ్ మొదలు పెట్టడానికి ముందు స్టీరింగ్ పక్కన ఉండే ఒక బటన్ మీద వేలు పెట్టాల్సి ఉంటుంది. ఇది ఆ వ్యక్తి ఒక వేలిని స్కాన్ చేసి వేలి చివల్లో ఉండే రక్తాన్ని పరిశీలించి ఆ వ్యక్తి తాగి ఉన్నాడా లేదా గుర్తిస్తుంది. తాగి ఉంటే స్టీరింగ్ పనిచేయదు.



### పది నిమిషాల్లో ఛార్జింగ్



వాయు కాలుష్యానికి అడ్డుకట్ట వేయడం కోసం ఎలక్ట్రిక్ వాహనాలు ఉపయోగించడానికి యావత్తు ప్రపంచం సంసిద్ధం అవుతోంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాల్లో ఉండే అతి పెద్ద సమస్య ఒకసారి బ్యాటరీ ఛార్జింగ్ ఖాళీ అయితే మళ్లీ రీచార్జ్ చేసుకోవడానికి చాలా సమయం పట్టడం! దీనికి పరిష్కారంగా తాజాగా లండన్‌కు చెందిన పెన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు కేవలం పది నిమిషాల్లో పూర్తి ప్రయాణానికి సరిపడా బ్యాటరీ చార్జింగ్ చేసుకునే టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ఇక మీదట ఎక్కడైనా కాఫీ తాగడానికి ఆగినపుడు కారు ఛార్జింగ్ పెట్టి కాఫీ తాగి వచ్చేలోపు మళ్లీ అది ప్రయాణానికి సిద్ధం అవుతుంది.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

### గాలిలో వ్యవసాయం



క్రమేపీ వ్యవసాయ భూములు కుదించుకుపోతున్నాయి. అనేక గ్రామాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. ఇదంతా దీర్ఘకాలంలో ఆహారధాన్యాల మీద ప్రభావం చూపించబోతోంది. ఒక అంచనా ప్రకారం 2050 నాటికి ఇప్పుడున్న దాని కన్నా 70శాతం అదనంగా ఆహారం ప్రపంచానికి కావలసి ఉంటుంది. అందుకే ప్రత్యామ్నాయ పద్ధతిగా గాలిలో వేలాడే వ్యవసాయ క్షేత్రాలను ఆవిష్కరిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది టెర్రాస్ మీద కూరగాయలు, చిన్న చిన్న తమ అవసరాలకు పంటలను పండించడం తెలిసిందే. అలా చిన్న మొత్తంలో కాకుండా తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని గాలిలో వేలాడే వ్యవసాయ క్షేత్రాలు రానున్నాయి.

తెలుసుకుందాం!




వాట్సప్‌లో చాటింగ్ చేస్తుంటారు. అందులో కొన్ని చాట్స్ ఇతరులు చూడకూడనివి కూడా ఉండొచ్చు. అలాంటప్పుడు వాటిని దాచేయడం సాధ్యమేనా? అంటే అవును చేయొచ్చు.

- ముందుగా వాట్సప్ ఓపెన్ చేయండి. ఎవరి చాట్‌ను దాచేయాలనుకుంటున్నారో ఆ చాట్‌పై ప్రెస్ చేసి పెట్టండి.
- పై భాగంలో బాణం గుర్తు కిందకు చూపిస్తున్నట్టుగా ఉండే ఒక ఐకాన్ కనిపిస్తుంది. ఇప్పుడు దానిని ఎంచుకోండి.
- అంతే.. మీ చాట్ లిస్ట్‌లో నుంచి అది కనిపించకుండా పోతుంది.

**అన్నీ కనిపించకుండా...**

- పైభాగంలో కుడివైపున ఉన్న త్రీడాట్స్‌పై క్లిక్ చేయండి.
- సెట్టింగ్స్‌లోకి వెళ్లండి. అందులో చాట్, చాట్‌హిస్టరీని ఎంచుకోండి.
- తరువాత అర్చీవ్ ఆల్ చాట్స్‌పై క్లిక్ చేయండి.
- ఇప్పుడు మీ వాట్సప్ లిస్ట్‌లో ఉన్న చాట్స్ ఇతరులకు కనిపించవు.

**రికవరీ ఎలా?**

- వాట్సప్ ఓపెన్ చేయండి.
- చాట్స్ ట్యాబ్‌లో ఉండి స్క్రీన్ బాటమ్‌కు స్క్రోల్ చేస్తూ వెళ్ళండి.
- అక్కడ అర్చీవ్ ఆప్షన్ ఉంటుంది. దానిపై ప్రెస్ చేస్తే పై భాగంలో బాణం గుర్తు పైకి చూపిస్తున్నట్టుగా ఉండే ఒక ఐకాన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే హైడ్ అయిన చాట్స్ మళ్లీ కనిపిస్తాయి.

# ఉద్యోగాలు వదిలి.. సాగు బాట పట్టారు

స్ఫూర్తి




ఉపాధి, ఉద్యోగం కోసం యువత పట్టణాలకు వెళుతుంటే శశాంక్, అభిషేక్‌లు మాత్రం సొంతూరులోనే తమ కెరీర్ నిర్మించుకున్నారు. ఉన్నత చదువులు చదివిన ఈ అన్నదమ్ములు వ్యవసాయం వైపు అడుగులు వేయడం చాలా ఆశ్చర్యంగా జరిగింది. శశాంక్ ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ చేసిన అభిషేక్ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. కానీ వీరిద్దరికి ఉద్యోగం బోర్ అనిపించింది. ఇద్దరూ వ్యవసాయం చేయాలనుకున్నారు. కానీ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వీరు ఉద్యోగం మానేసి పొలం బాట పట్టడం ఇంట్లో వాళ్లకు నచ్చలేదు. అయినా పట్టువీడక వారిని ఒప్పించారు శశాంక్, అభిషేక్‌లు. "మా మేనమామ అప్పటికే ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తూ లాభాలు గడిస్తున్నాడు. ఆయన వద్దనే ఇద్దరం సాగు పాఠాలు నేర్చుకున్నాం. ఇంట్లో వాళ్లు ఒప్పుకున్న తరువాత నేను దేశం మొత్తం తిరిగి ఆధునిక వ్యవసాయం, సాంకేతికత గురించిన తాజా సమాచారం సేకరించా" అని గుర్తుచేసుకుంటారు శశాంక్.

ముందుగా శశాంక్, అభిషేక్‌లు ఒక రైతు నుంచి అయిదు ఎకరాల పొలం తీసుకొని అందులో క్యాప్సికమ్ పంట వేశారు. మొదటి సారి అనుకున్నంతగా పంట రాలేదు. మరుసటి పంటకు ఇంకా కష్టపడ్డారు. లాభాలు వచ్చాయి. దాంతో ఆధునిక పద్ధతులతో సాగులో లాభాల పంట పండించవచ్చని తెలుసుకున్నారు. అయిదేళ్ల తరువాత క్యాలీఫ్లవర్, క్యాబేజీ వంటి రకాలు పండించడం మొదలెట్టారు. ఇప్పుడు 22 ఎకరాలు సాగు చేస్తూ ఏడాదికి 15 కోట్లు సంపాదిస్తున్నారు.

> **మా సంస్థ ద్వారా ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చెయ్యడంలో రైతులకు శిక్షణ ఇస్తాం. దాంతో వారు ఎక్కువ దిగుబడులు సాధిస్తారు. 'అగ్రిప్లాంట్' లక్ష్యం ప్రతి గ్రామంలో విజయవంతమైన అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను తయారుచేయడం.**

**రైతులకు ఆధునిక సాగు పాఠాలు**

ప్రభుత్వాలు రైతుల్ని ఆదుకునేందుకు ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టినప్పటికీ అనుకున్న ఫలితాలు రావడం లేదు. మిగతా రాష్ట్రాల రైతులతో పోల్చితే ఉత్తరప్రదేశ్‌లోని రైతులు వెనుకే ఉన్నారు. మనదేశంలో ఎక్కువ మందికి ఉపాధి లభించే ఏకైక రంగం వ్యవసాయమే. మనదగ్గర సారవంతమైన నేలలు, నీళ్లు, సాగు అనుకూల వాతావరణం ఉంది. కానీ నేలతల్లినే నమ్ముకొని సాగు చేస్తున్న రైతులకు లాభం తెచ్చిపెట్టేంతగా ఆధునిక పరికరాలు, పద్ధతుల వాడకం ఇక్కడ లేదు. ఈ లోటును భర్తీ చేసి, రైతుల్ని సాధికారులుగా చేసేందుకు 2011లో 'అగ్రిప్లాంట్' అనే సంస్థ ఏర్పాటు చేశారు శకాంక్, అభిషేక్‌లు. "మా సంస్థ ద్వారా రైతులకుఆధునిక పద్ధతులతో వ్యవసాయం చెయ్యడంలో శిక్షణ ఇస్తాం. దాంతో ఎక్కువ దిగుబడులు సాధిస్తారు. 'అగ్రిప్లాంట్' లక్ష్యం ప్రతి గ్రామంలో విజయవంతమైన అగ్రిఎంటర్‌ప్రెన్యూర్స్‌ను తయారుచేయడం. ఎప్పుడైతే రైతుల్ని సాధికారులుగా చేస్తామో అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది" అంటారు యువరైతు అభిషేక్. ఇప్పటి వరకూ అగ్రిప్లాంట్ సంస్థ 4,500 గ్రామీణ రైతులకు సాగు మెలకువల్లో శిక్షణ ఇచ్చింది. సుమారు పదివేల మంది రైతులు ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడుతున్నారు. తాము లాభాలు చూడడమే కాదు తోటి రైతులు సాగు సిరులు చూడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ఈ ఇద్దరూ నవతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

లిటిల్స్

5 తేడాలు గుర్తించండి



జవాబు

### డైలీ సుడోకు -287

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 6 | | 3 | | | 5 | |
| | 9 | | | 8 | | 6 | | |
| 3 | 8 | | | | | | | 2 |
| 8 | 6 | | 1 | | | | | |
| | 1 | 3 | | 7 | | 5 | 8 | |
| | | | | | 8 | | 2 | 1 |
| 6 | | | | | | | 1 | 8 |
| | | 1 | | 5 | | | 7 | |
| | 7 | | | 1 | | 9 | | |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 286 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 8 | 5 | 6 | 9 | 1 | 7 | 3 | 4 |
| 6 | 3 | 9 | 7 | 4 | 2 | 5 | 1 | 8 |
| 4 | 1 | 7 | 8 | 5 | 3 | 6 | 9 | 2 |
| 1 | 7 | 3 | 2 | 6 | 9 | 8 | 4 | 5 |
| 8 | 4 | 2 | 3 | 7 | 5 | 1 | 6 | 9 |
| 5 | 9 | 6 | 4 | 1 | 8 | 3 | 2 | 7 |
| 3 | 5 | 4 | 9 | 8 | 6 | 2 | 7 | 1 |
| 7 | 6 | 8 | 1 | 2 | 4 | 9 | 5 | 3 |
| 9 | 2 | 1 | 5 | 3 | 7 | 4 | 8 | 6 |






# రెడ్ @ డోలమైట్స్


రామ్, మాళవిక శర్మ

యూరప్ దేశం ఇటలీలో డోలమైట్స్ అని ఓ ప్రాంతం ఉంది! అదీ సముద్రతీరానికి పదివేల అడుగుల ఎత్తులో, మైనస్ డిగ్రీస్ టెంపరేచర్‌లో, మంచు కొండల్లో!! ఇప్పటివరకూ పలు హాలీవుడ్ సినిమా షూటింగులు అక్కడ జరిగాయి. ఆ ప్రాంతంలో చిత్రీకరణ జరుపుకున్న తొలి తెలుగు చిత్రంగా 'రెడ్' రికార్డులకు ఎక్కింది. 'నేను... శైలజ', 'ఉన్నది ఒకటే జిందగీ' విజయాల తర్వాత యువ హీరో రామ్, దర్శకుడు కిశోర్ తిరుమల, నిర్మాణ సంస్థ స్రవంతి మూవీస్ కలయికలో రూపొందుతున్న హ్యాట్రిక్ సినిమా 'రెడ్'. 'స్రవంతి' రవికిశోర్ నిర్మాత. ఒక్క పాట మినహా సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఇటీవల ఇటలీలో రెండు పాటలను తెరకెక్కించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "రామ్, మాళవిక శర్మపై ఇటలీలో ఈ నెల 12 నుండి 18 వరకూ టుస్కాన్, ఫ్లారెన్స్, డోలమైట్స్ ప్రాంతాల్లో, వెనిడియా కార్నివాల్‌లో రెండు పాటలు చిత్రీకరించాం. ఈ నెలాఖరున హైదరాబాద్‌లో మరో పాటను చిత్రీకరిస్తాం. దాంతో సినిమా పూర్తవుతుంది" అన్నారు. 'ఇస్మార్ట్ శంకర్' విజయం తర్వాత రామ్ నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 9న విడుదల చేస్తామని చిత్రసమర్పకులు కృష్ణ పోతినేని తెలిపారు. నివేదా పేతురాజ్, అమృతా అయ్యర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మణిశర్మ సంగీత దర్శకుడు.

# సరోగసీ ద్వారా అమ్మాయి పుట్టింది

"మా ఇంటి లక్ష్మి వచ్చింది. మా కుటుంబాన్ని పరిపూర్ణం చేసింది" అని హిందీ నటి శిల్పా శెట్టి, వ్యాపారవేత్త రాజ్ కుంద్రా దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 15న తమకు అమ్మాయి పుట్టిందని శుక్రవారం (ఫిబ్రవరి 21న) ప్రకటించారు. వీరు సరోగసీ ద్వారా సంతానాన్ని పొందారు. ఇప్పుడీ అమ్మాయి వీరికి రెండో సంతానం! ఏడేళ్ల క్రితం మగబిడ్డ వియాన్‌కు శిల్పా శెట్టి జన్మనిచ్చారు. పాపాయికి 'సమిశా శెట్టి కుంద్రా' అని పేరు పెట్టినట్టు శిల్ప-రాజ్ దంపతులు తెలిపారు. 'స' అంటే సంస్కృతంలో 'కలిగి ఉండడం' అని అర్థం. 'మిశా' అంటే రష్యన్‌లో 'దేవత లాంటి వ్యక్తి' అని అర్థం. 'దేవత లాంటి వ్యక్తిని కలిగి ఉన్నాం' అని అర్థం వచ్చేలా పేరు పెట్టారన్నమాట! "ఓం శ్రీ గణేశాయ నమః మా ప్రార్థనలు ఫలించి అద్భుతం జరిగింది. మా హృదయాలు కృతజ్ఞతతో నిండాయి. మా ఇంటికి లక్ష్మి వచ్చిందని చాలా సంతోషంగా ప్రకటిస్తున్నాం! ఇట్లు, ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతున్న తల్లితండ్రులు రాజ్, శిల్పా శెట్టి కుంద్రా. అమితానందంతో ఎంజాయ్ చేస్తున్న అన్నయ్య వియాన్" అని శిల్పా శెట్టి ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.


శిల్పా శెట్టి

# ఉగ్రరూపస్య...

"అతని పేరు మహేశ్.. అసలు పేరు ఉమా మహేశ్వరరావు! పల్లెల్లో సాఫ్ట్‌గా పని చేసుకునే ఫొటోగ్రాఫర్. సున్నితమైన ప్రేమికుడు కూడా! అలాంటి వ్యక్తి ఉగ్రరూపం దాల్చడానికి కారణమేంటి అన్నది తెరపైనే చూడాలి" అంటున్నారు వెంకటేశ్ మహా. ఆయన దర్శకత్వంలో సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున చిత్రం 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య'. ఆర్కా మీడియా వర్క్స్, మహాయాణ మోషన్ పిక్చర్స్ బ్యానర్స్‌పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, విజయ ప్రవీణ పరుచూరి నిర్మాతలు. షూటింగ్ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ "మలయాళంలో హిట్టైన 'మహేశింతే ప్రతీకారమ్' చిత్రానికి రీమేక్ ఇది. గ్రామీణ నేపథ్యంలో సాగుతుందీ సినిమా. మన నెటివిటీకి తగ్గట్టు దర్శకులు మార్పులు చేసి అద్భుతంగా మలిచారు. సత్యదేవ్ లుక్ కొత్తగా ఉంటుంది. అరకు ప్రాంతంలో 36 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం, ఏప్రిల్ 17న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం". నరేశ్, రామ్ ప్రసాద్, సుహాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: బిజ్‌బల్, సినిమాటోగ్రఫీ: అప్పు ప్రభాకర్.


సత్యదేవ్


కృతిశెట్టి, వైష్ణవ్ తేజ్

# ఈ జర్నీని ప్రేమిస్తావు

**- రామ్ చరణ్**

తెలుగు తెరకు హీరోగా పరిచయమవుతున్న చిరంజీవి మేనల్లుడు వైష్ణవ్ తేజ్‌ను రామ్‌చరణ్ పరిశ్రమలోకి ఆహ్వానించారు. వైష్ణవ్ తేజ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఉప్పెన' సినిమా కొత్త పోస్టర్‌ను శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. "బిగ్ వెల్‌కమ్ వైష్ణవ్ తేజ్! ఈ జర్నీని నువ్వు ప్రేమిస్తావు. పూర్తి స్థాయిలో దీన్ని ఆస్వాదించు. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని రాసుకొచ్చారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. కృతిశెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కీలక పాత్ర పోషిస్తున్నారు.


కాజల్

# ప్రేమతో... అను!

"హలో! మంచి... చెడు... అనేది జీవితంలో వచ్చే సందర్భాలు, వాటిని మనం చూసే దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది. 'నాకేది మంచిది?' అని ఈ వేసవిలో మీకు మీరే నిర్ణయించుకోండి! ప్రేమతో... అను" అని కాజల్ అగర్వాల్ అన్నారు. అను పాత్రలో ఆమె నటిస్తున్న చిత్రం 'మోసగాళ్ళు'. మంచు విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రమిది. రుహానీ శర్మ మరో హీరోయిన్. జెఫ్రీ గి చిన్ దర్శకుడు. విరోనికా మంచు నిర్మాత. హిందీ నటుడు సునీల్ శెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రేక్షకులకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ శుక్రవారం కాజల్ అగర్వాల్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ "మన దేశంలో జరిగిన పెద్ద ఐటి స్కామ్ ఆధారంగా ఈ సినిమా రూపొందిస్తున్నాం. ఇటీవలే లాస్ ఏంజిల్స్‌లో కొన్ని సన్నివేశాలు తీశాం. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ చేస్తున్నాం. ఈ వేసవిలో చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. నవదీప్, నవీన్ చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: షెల్డన్ చౌ.

# కరెంట్ పోతే.. మర్డరే..!

'డాన్ శీను', 'బలుపు' చిత్రాల తర్వాత రవితేజ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'క్రాక్'. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన యథార్థ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ కథానాయిక. సముద్రఖని, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. సరస్వతి ఫిల్మ్ డివిజన్ పతాకంపై బి.మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఒంగోలులో రాత్రి ఎనిమిది గంటలకు కరెంట్ పోయిందంటే కచ్చితంగా మర్డరే' అన్న డైలాగ్‌తో సాగే టీజర్‌ను శివరాత్రి సందర్భంగా శుక్రవారం రామానాయుడు ప్రివ్యూ థియేటర్‌లో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "టీజర్‌లో రవితేజ మాస్ పెర్ఫార్మెన్స్‌కు, ఆయన శైలి డైలాగ్‌లకు స్పందన బావుంది. రవితేజ నుంచి ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉంటాయి. తమన్ నేపథ్య సంగీతం అదిరిపోయేలా ఇచ్చాడు. మే 8న సినిమాను విడుదల చేస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి. మధు, కో ప్రొడ్యూసర్ అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.


రవితేజ

# బాక్సింగ్ వర్సెస్ అడిమురై!


ధనుష్, మెహరీన్

లోకంలో కిక్ బాక్సింగే నంబర్ వన్ స్పోర్ట్ అనీ, అందులో తన కుమారుడితో తలపడే గట్స్ ఇండియాలో ఎవరికీ లేవనీ విర్రవీగే విలన్‌కి ప్రాచీన తమిళ యుద్ధవిద్య అడిమురైతో లోకల్ బాయ్ లాంటి హీరో ఎటువంటి సమాధానం చెప్పాడు? లోకల్ బాయ్ ప్లాన్ ఏంటి? అనేది ఈ నెల 28న థియేటర్లలో చూడమని సీహెచ్ సతీష్‌కుమార్ అన్నారు. ధనుష్ హీరోగా, మెహరీన్, స్నేహ హీరోయిన్లుగా నటించిన తమిళ సినిమా 'పటాస్'. ఆర్‌ఎస్ దురై సెంథిల్‌కుమార్ దర్శకుడు. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలు. ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల ముందుకు 'లోకల్ బాయ్'గా వస్తోంది. ఈ నెల 28న శ్రీమతి జగన్మోహిని సమర్పణలో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత సీహెచ్ కుమార్ విడుదల చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "అడిమురై గొప్పతనాన్ని వివరిస్తూ మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. ధనుష్ ద్విపాత్రాభినయం చేశారు. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేలా కథ, కథనాలు ఉంటాయి" అన్నారు.

# తెలుగులోనూ బాండ్25



జేమ్స్ బాండ్ సిరీస్‌లో రూపొందుతున్న 25వ సినిమా 'నో టైమ్ టు డై'. 'చనిపోవడానికి సమయం లేదు' అని అర్థం! డేనియల్ క్రేగ్ మరోసారి జేమ్స్ బాండ్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ఇండియాలో ఏప్రిల్ 3న విడుదల కానున్న సంగతి తెలిసిందే. విశేషం ఏంటంటే... ఇంగ్లిష్‌లో మాత్రమే కాదు, అదే రోజున తెలుగు, తమిళ, హిందీ భాషల్లోనూ విడుదల కానుంది.

# అమ్మాయిలూ జాగ్రత్త...

నవీన్.కె.చారి, ప్రియాన్ష, మేఘన చౌదరి, సుమాయ, కావ్య, శ్రీదేవి హీరోహీరోయిన్లుగా వడ్ల జనార్థన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హలో మేడమ్'. వడ్ల గురురాజ్, వడ్ల కార్తీక్ నిర్మాతలు. శుక్రవారం ఈ సినిమా లోగోను ఫిల్మ్ చాంబర్‌లో దర్శకుడు సాగర్, ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆవిష్కరించారు. వడ్ల జనార్థన్ మాట్లాడుతూ "సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, దాడులు ఆధారంగా రూపొందుతున్న సినిమా ఇది. అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలనే సందేశమిస్తున్నాం. త్వరలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని తెలిపారు.


మేఘన, ప్రియాన్ష, శ్రీదేవి

# స్వేచ్ఛ ఉంటే మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తారు

**- మంగ్లీ**



స్వేచ్ఛ ఉంటే మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తారని కథానాయిక, గాయని మంగ్లీ చెప్పారు. ఆమె నటించిన 'స్వేచ్ఛ ' చిత్రం ట్రైలర్‌ను బుధవారం రాత్రి మీడియాకు ప్రదర్శించారు. మంగ్లీ మాట్లాడుతూ ' మా కమ్యూనిటీల్లో జరిగే కథాంశంతో ఈ సినిమా తీశారు. ఒక యువతిని వాళ్ల నాన్న అమ్మేస్తే ఆమె బాగా చదువుకొని వచ్చి సొంతవూరుని బాగు చేస్తుంది. మా బంజారా కమ్యూనిటీలో ఈ సినిమా విడుదలై విజయం సాధించింది. తెలుగులో కూడా ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు మంగ్లీ. చిత్ర నిర్మాత రాజూ నాయక్ మాట్లాడుతూ ' బంజరా భాషలో 'గోర్ జీవన్' పేరుతో ఈ చిత్రం విడుదలై ఘనవిజయం సాధించింది. అందుకే తెలుగులోనూ ఈ నెల 28న విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు బోలే, నిర్మాత సురేశ్ కొండేటి కూడా పాల్గొన్నారు.

# రాహువుతో పోరాటం ఆసక్తికరం

**- ఏ.వి.ఆర్ స్వామి**



"వ్యాపార రంగం నుంచి సినిమా పరిశ్రమలో నిర్మాతగా అడుగుపెట్టా. డబ్బు సంపాదన నా లక్ష్యం కాదు. మంచి సినిమాలతో ప్రేక్షకులకు వినోదం పంచాలన్న సంకల్పంతో నిర్మాతనయ్యా. ఇది కేవలం వ్యాపకం మాత్రమే. కథ నచ్చితేనే సినిమాలు తీస్తా" అని ఏ.వి.ఆర్ స్వామి అన్నారు. అభిరామ్ వర్మ, కృతిగార్గ్ జంటగా నటించిన చిత్రం 'రాహు'. సుబ్బు వేదుల దర్శకుడు. ఏ.వి.ఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మాతలు. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రం గురించి నిర్మాతల్లో ఒకరైన ఏ.వి.ఆర్ స్వామి శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. "ఈ కథలో హీరోయిన్ జీవితంలో ఒక రాహువు ఉంటాడు. కన్వర్షన్ డిజార్డర్‌తో బాధ పడుతున్న ఆమె రాహువుతో ఎలా పోరాడింది అన్నది ఇతివృత్తం. హై స్టాండర్డ్స్‌తో రూపొందిన న్యూ ఏజ్ థ్రిల్లర్ ఇది. కుటుంబ సభ్యులతో చూసే సినిమాలు తక్కువ అవుతున్న తరుణంలో మంచి కథతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా 'రాహు' సినిమా తీశాం. నటీనటులు చక్కని నటన కనబర్చారు. సంగీతం, ఫొటోగ్రఫీ అన్ని కరెక్ట్‌గా కుదిరాయి. ఈ రోజుల్లో సినిమా తియ్యడం గొప్ప కాదు, మార్కెట్ చేసుకోగలగాలి. ఆ విషయంలో మేం సక్సెస్ సాధించాం అనుకుంటున్నా. సురేశ్‌బాబుకి సినిమా నచ్చి విడుదల చేస్తున్నారు. ప్రేక్షకాదరణ పొంది మా డబ్బు మాకొస్తుందనే నమ్మకం ఉంది" అని అన్నారు.

# ఆ ట్రిప్‌లో ఏం జరిగింది.?


సోనా పాటిల్, మహి

మహి, సోనా పాటిల్ జంటగా రూపుదిద్దుకొంటున్న చిత్రం 'విన్నర్స్ ట్రిప్'. శ్రీను తెలుగు దర్శకత్వంలో సంపత్ శ్రీను, కె.లక్ష్మణరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గురించి నిర్మాతల్లో ఒకరైన సంపత్ శ్రీను మాట్లాడుతూ ' గోవాలో సినిమా మొత్తం తీశాం. 30 రోజుల్లో టాకీ, పది రోజుల్లో పాటలు చిత్రీకరించాం. ఇది చిన్న సినిమా అయినా పెద్ద రేంజ్‌లో రావడానికి ప్రతి ఒక్కరూ సహకరించారు' అన్నారు. 'ఒక ఎఫ్.ఎం. రేడియో కాంటెస్ట్‌లో గెలిచిన విజేలందరినీ ఓ ట్రిప్‌కు తీసుకెళ్తే , అక్కడ వారికి ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి,, వాటిల్లోంచి ఎంత మంది బయటపడ్డారు అన్నది ఈ చిత్రకథాంశం.' అని చెప్పారు దర్శకుడు తెలుగు శ్రీను.

## సమస్యలు వచ్చినప్పుడే చాంబర్లు గుర్తొస్తాయా?



**» వ్యాపారవేత్తలను ప్రశ్నించిన పీయూష్ గోయల్**

న్యూఢిల్లీ: పారిశ్రామిక చాంబర్ల (సంఘాలు)ను తేలిగ్గా తీసుకోవద్దని వ్యాపారవేత్తలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. చాలా మంది వ్యాపారవేత్తలు తమకు సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే ఈ పారిశ్రామిక సంఘాలను ఆశ్రయిస్తున్నారని, మిగతా సందర్భాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఫిక్కీ, అసోచామ్‌లు నిర్వహించే కార్యక్రమాల్లో కేవలం ప్రస్తుత అధ్యక్షుడు, కొంత మంది పూర్వ అధ్యక్షులు, రాబోయే అధ్యక్షులు, కొంత మంది ఆఫీస్ బేరర్లు మాత్రమే కనిపిస్తుంటారని ఆయన చెప్పారు. జాతికి ఎంతో ముఖ్యమైన వాణిజ్య, పారిశ్రామిక, వ్యాపార వర్గాలు ఎక్కడున్నారు అని ఆయన ప్రశ్నించారు.

శుక్రవారంనాడిక్కడ జరిగిన ఏఐఎంఏ సమావేశంలో పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. తన సందేశాన్ని మీ సహచరులు, స్నేహితుల దృష్టికి తీసుకువెళ్లాలని ఏఐఎంఏ ప్రెసిడెంట్ సంజయ్ కిర్లోస్కర్, మాజీ అధ్యక్షుడు హర్షపతి సింఘానియాలకు సూచించారు. అసోసియేషన్లను తక్కువగా తీసుకోవద్దని కూడా వారికి తెలియజేయాలన్నారు. మీకు సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే వెళ్లడానికి పారిశ్రామిక సంఘాలు లేవన్నారు. ఈ సందర్భంగా గోయల్ ఒక ఉదాహరణను పారిశ్రామికవర్గాలతో పంచుకున్నారు. ప్రభుత్వం బొమ్మలపై దిగుమతి సుంకాలను పెంచాలని నిర్ణయం తీసుకుందని, ఈ నేపథ్యంలో బొమ్మల పరిశ్రమ సూపర్ యాక్టివ్ అయిందని అన్నారు.

## ‘మేడ్ ఇన్ ఇండియా’ ఐకియా కప్పుల రీకాల్

**» భారత మార్కెట్లో కంపెనీ వ్యాపార ప్రణాళికలపై ప్రభావం**

ప్రపంచ ఫర్నీచర్ రిటైలింగ్ దిగ్గజం ఐకియా గతనెల 15న మేడ్ ఇన్ ఇండియా కప్పులను రీకాల్ (వెనక్కి రప్పించడం) చేసింది. వీటి తయారీలో ఉపయోగించిన రసాయనాలు నిర్దేశిత మోతాదు కంటే అధికంగా ఉండటం వల్లే వెనక్కి రప్పిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. భారత్‌లో తయారైన ట్రోలిగ్టివిస్ ట్రావెల్ మగ్‌లను కొనుగోలు చేసిన వినియోగదారులు ప్రపంచవ్యాప్తంగా తమకున్న 400 స్టోర్లలో ఎక్కడైనా అప్పగించి సొమ్ము పూర్తి రిఫండ్ పొందవచ్చని ఐకియా తన ప్రకటనలో పేర్కొంది. ఇవే కప్పులు ఇటలీలో తయారైనవి మాత్రం వినియోగానికి పూర్తి సురక్షితమని స్పష్టం చేసింది. ఈ మేడ్ ఇన్ ఇండియా కప్పులను గత ఏడాది ఆగస్టు నుంచి భారత్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయిస్తూ వచ్చింది సంస్థ. ఈ కప్పుల వినియోగంతో కస్టమర్ల ఆరోగ్యంపై తక్షణ ప్రభావమేమీ లేనప్పటికీ, ఎలాంటి ఫిర్యాదులు అందిన దాఖలాలు లేనప్పటికీ ముందుజాగ్రత్త చర్యగానే రీకాల్ చేసినట్లు ఐకియా వెల్లడించింది.

ఐకియా తన కప్పులను రీకాల్ చేసిన విధానం భారత బ్రాండ్ ఇమేజీకి గండికొట్టేలా ఉందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కేవలం మేడ్ ఇన్ ఇండియా కప్పులను మాత్రమే కొనుగోలు చేయవద్దని కంపెనీ కోరిందంటే, ఈ సమస్యను ఆ వస్తువుకు లేదా తన కంపెనీకి గాకుండా వస్తువు తయారైన దేశానికి ఆపాదించిన భావన కలుగుతోం

### భారత బ్రాండ్ ఇమేజ్‌కు దెబ్బ!

దని ట్రస్ట్ రీసెర్చ్ అడ్వైజరీ సీఈఓ ఎన్ చంద్రమౌళి అభిప్రాయపడ్డారు. ఇది వాస్తవ సమస్య నుంచి కస్టమర్ల దృష్టి మరల్చే ప్రయత్నం లాగే కన్పిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఎందుకంటే, ఇతరుల నుంచి సేకరించే వస్తువు నాణ్యత తమ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉందా..? లేదా..? అని సరి చూసుకోవాల్సిన పూర్తి బాధ్యత ఆ వస్తువును సేకరించిన కంపెనీదే. కానీ, ఈ విషయంలో ఐకియా తన అజాగ్రత్తను, అలక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించినట్లుగా అన్పిస్తున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భారత్ మార్కెట్లో 150 కోట్ల డాలర్ల పెట్టుబడులను ప్రకటించిన ఐకియా.. దేశంలో తన తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ముంబైలోనూ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించింది. ముందు ఢిల్లీ, బెంగళూరులోనూ ఏర్పాటు చేయబోతున్నది. అంతేకాదు, ముంబై, పుణెలో ఆన్‌లైన్ స్టోర్లను సైతం ఏర్పాటు చేసింది. అయినప్పటికీ, నిబంధనల మేరకు స్థానికంగా వస్తు సేకరణ జరపలేకపోతోంది. స్థానికంగా సంస్థ వస్తు సేకరణ ప్రణాళికలపై కప్పుల రీకాల్ ప్రభావం చూపవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు.

సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) నిబంధనల ప్రకారం.. భారత్‌లో పెట్టుబడులు పెట్టిన ఈ రంగ కంపెనీలు తాము విక్రయించే వస్తువుల్లో 30 శాతం స్థానికంగానే సేకరించాల్సి ఉంటుంది. వస్తు సేకరణ విషయంలో తమకు భారత్ ముఖ్యమైన మార్కెట్లలో ఒకటని ఐకియా అంటోంది. ప్రభుత్వ ‘మేక్ ఇన్ ఇండియా’ ఎజెండాకు పూర్తి మద్దతిస్తామని, ఇక్కడి మార్కెట్లో రిటైల్ విక్రయ కార్యకలాపాలు ప్రారంభించిన ఏడాదిన్నర కాలంలో స్థానికంగా వస్తు సేకరణ స్థాయి 25 శాతానికి చేరుకుందని కంపెనీ తెలిపింది. 2020 నాటికి స్థానికంగా వస్తు సేకరణను 60 కోట్ల యూరోల స్థాయికి పెంచాలనుకుంటున్నట్లు చెప్పింది.

## రిలయన్స్ ‘మీడియా’ వ్యాపారాల పునర్ వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తన మీడియా, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారాలను పునర్ వ్యవస్థీకరిస్తోంది. ఇందులోభాగంగా ఈ వ్యాపారాలన్నిటినీ ‘నెట్‌వర్క్18’ పేరుతో ఒకే గొడుగు కిందికి తెస్తోంది. దీంతో రిలయన్స్ నిర్వహణలోని వినోద చానల్స్ ‘సోనీ’ కంపెనీలో విలీనమయ్యే అవకాశాలు సన్నగిల్లినట్టే. గత ఏడాది కొనుగోలు చేసిన కేబుల్ టీవీ, బ్రాడ్‌బ్యాండ్ కంపెనీలు హాత్‌వే, డెన్ నెట్‌వర్క్‌లనూ పునర్ వ్యవస్థీకరించటంలో భాగంగా నెట్‌వర్క్18 అనుబంధ కంపెనీలుగా మార్చింది. రిలయన్స్ జియో పబ్లిక్ ఇష్యూకు ముందస్తు చర్యగా ఆర్ఐఎల్ ఈ చర్యలు చేపట్టిందని మార్కెట్ వర్గాల అంచనా వేస్తున్నాయి.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 21వ తేదీకి.. | | విజయవాడ | 355 |
| హైదరాబాద్ | 340 | విశాఖపట్నం | 375 |
| 22వ తేదీకి.. | | వరంగల్ | 343 |
| చిత్తూరు | 403 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 355 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 45 | విజయవాడ | 55 |
| వరంగల్ | 45 | గుంటూరు | 55 |
| మహబూబ్‌నగర్ | 45 | ఒంగోలు | 55 |
| కరీంనగర్ | 45 | చిత్తూరు | 55 |
| కర్నూలు | 45 | నెల్లూరు | 55 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 58 |
| గోదావరి | 44 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 41,850 | --- | --- | 42,500 | 42,540 |
| క్రితం ముగింపు | 41,570 | 42,000 | 43,210 | 41,750 | 41,770 |
| 22 క్యారెట్లు | 39,810 | --- | --- | 39,350 | 40,510 |
| క్రితం ముగింపు | 39,570 | 39,000 | 39,750 | 38,660 | 39,780 |
| వెండి (కిలో) | 47,900 | --- | --- | 48,900 | 52,500 |
| క్రితం ముగింపు | 47,600 | 49,500 | 49,300 | 48,700 | 51,600 |

# బంగారం 50,000?

## మరో ఏడాదిలో చేరుకునే చాన్స్...సిటీ గ్రూప్ అంచనా

గత రెండు రోజుల్లో పసిడి ధరలు ఆల్‌టైం రికార్డుల మోత మోగించాయి. కరోనా వైరస్ విజృంభణతో ప్రపంచ ఆర్థిక ప్రగతిపై నీలినీడలు కమ్ముకున్నాయి. దాంతో, భద్రమైన పెట్టుబడి సాధనమైన బంగారం, వెండికి అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఊపందుకుంది. తత్ఫలితంగా ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర ఏడేళ్ల గరిష్ఠ స్థాయి 1,600 డాలర్ల ఎగువకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా దేశీయంగానూ విలువైన లోహాల రేట్లు ఎగబాకాయి. గురువారం 10 గ్రాములు బంగారం ఒక దశలో రూ.43,000 పలికింది.



బంగారం, వెండి ధరలు మున్ముందు మరింత ఎగబాకనున్నాయని కమోడిటీ విశ్లేషకులు భావిస్తున్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో అంతర్జాతీయంగా వాణిజ్యం మందగించడం, ప్రపంచ ఆర్థిక వృద్ధి నెమ్మదించడం, రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధ భయాలు ఇందుకు కారణం కావచ్చని వారంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ట్రేడర్లు ఈక్విటీల్లోని తమ పెట్టుబడులను విలువైన లోహాల్లోకి మళ్లించవచ్చని, భవిష్యత్‌లో వీటికి డిమాండ్ మరింత పుంజుకోవచ్చన్నది వారి అభిప్రాయం. అనిశ్చిత వాతావరణం ఇలాగే కొనసాగితే వచ్చే 1-2 ఏళ్లలో ఔన్సు బంగారం 2,000 డాలర్లకు చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం సిటీ గ్రూప్ అంచనా వేసింది. ఈ ప్రకారం దేశీయంగా పసిడి ధర కనీసం రూ.50,000 స్థాయిని దాటనుంది. ఆసియాలోని చైనా, భారత్‌లు మందగమనంలోనే కొనసాగితే మాత్రం బంగారానికి డిమాండ్ అంతగా పెరగకపోవచ్చని అభిప్రాయపడింది. ఎందుకంటే, ప్రపంచంలో అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునేది ఈ రెండు దేశాలే.

### బుల్ ట్రెండ్ మొదలైంది..

బంగారం మళ్లీ బుల్ ట్రెండ్‌లోకి మళ్లిందని స్కోటియా బ్యాంక్ మెటల్స్ విభాగ వ్యూహకర్త నిక్కీ షీల్స్ అంటున్నారు. ఈ ఏడాది భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు అధికమయ్యే అవకాశాలు ఉన్నందున ఔన్సు గోల్డ్ రేటు 1,500 డాలర్ల ఎగువనే ట్రేడ్ కావచ్చంటున్నారు.

**1,921 డాలర్లు** అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ గత ఆల్‌టైం గరిష్ఠ ధర 2011లో నమోదైంది

**రూ. 42,492** ఢిల్లీ స్పాట్ మార్కెట్లో తులం బంగారం గత సెషన్ ముగింపు ధర

**1,646 డాలర్లు** శుక్రవారం ఔన్స్ గోల్డ్ రేటు

**7 శాతం** ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరల పెరుగుదల

## ఐటీ కంపెనీల్లో గుబులు

### భయపెడుతున్న కరోనా



**వచ్చే 2-3 వారాలు అత్యంత కీలకం**

ముంబై : చైనాను తారెత్తిస్తున్న కరోనా వైరస్.. భారత ఐటీ కంపెనీలనూ భయపెడుతోంది. ప్రస్తుతానికైతే భారత ఐటీ కంపెనీలపై ఈ ప్రభావం పెద్దగా లేదు. అయితే వచ్చే రెండు మూడు వారాల్లో పరిస్థితి అదుపులోకి రాకపోతే మాత్రం తిప్పలుతప్పక పోవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చైనాలోని అనేక తయారీ కంపెనీలు భారత ఐటీ కంపెనీల ఖాతాదారులు కావడమే ఇందుకు కారణం.

### ఉద్యోగులపై ప్రభావం

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ వంటి భారత ఐటీ కంపెనీలకు చైనాలో యూనిట్లు ఉన్నాయి. ఈ యూనిట్ల ద్వారా ఈ కంపెనీలు చైనాలోని తయారీ కంపెనీలకు అవసరమైన ఐటీ సేవలు అందిస్తున్నాయి. ఈ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల్లో దాదాపు సగం మంది స్థానిక చైనీయులే. వైరస్ భయంతో భారత ఐటీ కంపెనీలు ఇంటి నుంచే పని చేయమని తమ ఉద్యోగులకు చెప్పాయి. లేదా వైరస్ ప్రభావం లేని ఇతర ప్రాంతాలకు తరలించి అక్కడి నుంచి పని చేయిస్తున్నాయి. దీంతో ఖర్చులు మరింత పెరిగే ప్రమాదం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

> కొన్ని భారత ఐటీ కంపెనీలు చైనాలోని తయారీ కంపెనీలకు ఐటీ సేవలు అందిస్తున్నాయి. మధ్య, దీర్ఘకాలంలో ఈ కంపెనీలపై కరోనా ప్రభావం తప్పకుండా ఉంటుంది.
>
> **- ప్రవీణ్ రావు, వైస్ చైర్మన్, నాస్కామ్**

### 7 శాతం ఆదాయం చైనా నుంచే..

ప్రస్తుతం భారత ఐటీ కంపెనీలకు చైనా ఏమంత పెద్ద మార్కెట్ కాదు. అమెరికా, ఐరోపా దేశాలే ఈ కంపెనీలకు పెద్ద మార్కెట్లు. అయితే ఆసియా, పసిఫిక్ దేశాల నుంచి వచ్చే ఐటీ ఆదాయాల్లో 5-7 శాతం వాటా చైనాదే.

కరోనా వైరస్ దెబ్బతో చైనా జీడీపీ వృద్ధి రేటు 0.3 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా. త్వరలో పరిస్థితి కుదుటపడకపోతే పరిస్థితి మరింత క్షీణించే ప్రమాదం ఉంది. ఆ ప్రభావం చైనాలో పని చేస్తున్న భారత ఐటీ కంపెనీలపైనా తప్పదు. మున్ముందు పరిస్థితి ఇంకా దయనీయంగా మారితే భారత ఐటీ కంపెనీల రాబడులకు మరింత గండిపడే అవకాశాలు లేకపోలేదు.

## రిటైర్‌మెంట్ ఫండ్స్‌కు భలే గిరాకీ



### రూ.10,425 కోట్లకు చేరిన పెట్టుబడులు

ముంబై: ఉద్యోగుల రిటైర్‌మెంట్ పెట్టుబడుల స్వరూపం మారుతోంది. గతంలో ఎక్కువ మంది ఉద్యోగంలో ఉండగానే పదవీ విరమణ తర్వాత అవసరమయ్యే ఆర్థిక అవసరాల కోసం ఈపీఎఫ్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి దీర్ఘకాలిక పెట్టుబడుల్లో మదుపు చేసేవారు. ఇప్పుడు చాలామంది ఉద్యోగులు మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే రిటైర్‌మెంట్ ఫండ్స్‌లోనూ మదుపు చేస్తున్నారు. దీంతో ఈ సంవత్సరం జనవరి నాటికి ఈ పథకాల నిర్వహణలోని పెట్టుబడుల విలువ (ఏయూఎం) రూ.10,425.3 కోట్లకు చేరింది.

గత ఏడాది ఏప్రిల్‌లో నమోదైన రూ.8,376.2 కోట్లతో పోలిస్తే ఇది 24.5 శాతం ఎక్కువ. దేశంలోని ఎంఎఫ్‌లకు ప్రాతినిధ్యం వహించే అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) ఒక నివేదికలో ఈ వివరాలు వెల్లడించింది.

### పెరుగుతున్న అవగాహన

గతంతో పోలిస్తే ఇన్వెస్టర్లలో రిటైర్‌మెంట్ పథకాలపై అవగాహన పెరిగింది. ఈ పథకాల్లో మదుపు చేసిన పెట్టుబడులను ఐదేళ్ల తర్వాత లేదా రిటైర్‌మెంట్ వయసులో వెనక్కి తీసుకోవచ్చు. దీర్ఘకాలిక పెట్టుబడుల అవసరాలపై మదుపరుల్లో అవగాహన పెరగడం ఇందుకు ప్రధాన కారణమని యాంఫీ సీఈఓ ఎన్ ఎస్ వెంకటేశ్ తెలిపారు.

## జీఎంఆర్-గ్రూప్ ఏడీపీ డీల్‌కు సీసీఐ ఓకే

న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల కల్పన సంస్థ జీఎంఆర్ ఇన్‌ఫ్రా, ఫ్రాన్స్‌కు చెందిన గ్రూప్ ఏడీపీకి మధ్య కుదిరిన వాటా విక్రయ ఒప్పందానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. విమానాశ్రయాల అభివృద్ధి, నిర్వహణ విభాగం జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో 49 శాతం వాటాను గ్రూప్ ఏడీపీకి విక్రయించేందుకు జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (జీఐఎల్) గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ.10,780 కోట్లు.

## విప్రో చేతికి అమెరికా కంపెనీ

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన డిజిటల్ కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ కంపెనీ ‘రేషనల్ ఇంటరాక్షన్’ను కొనుగోలు చేసినట్లు దేశీయ ఐటీ దిగ్గజం విప్రో ప్రకటించింది. తన డిజిటల్ వ్యాపార విభాగమైన విప్రో డిజిటల్ ద్వారా ఈ కొనుగోలు జరిపింది. ఒప్పందం విలువను మాత్రం వెల్లడించలేదు. వాషింగ్టన్ ప్రధాన కేంద్రంగా 2009లో ప్రారంభమైన రేషనల్ ఇంటరాక్షన్‌లో ప్రస్తుతం 300కు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. సియాటిల్, బెలెవ్యూ, డబ్లిన్, సిడ్నీలోనూ శాఖలను ఏర్పాటు చేసింది. డిజిటల్ సేవలు మరింత వ్యాప్తి చెందడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో సేవల సామర్థ్యాన్ని మరింత పెంచుకునేందుకు రేషనల్ ఇంటరాక్షన్ కొనుగోలు దోహదపడనుందని విప్రో డిజిటల్ పేర్కొంది.

## విదేశీ మారక నిల్వల్లో సరికొత్త రికార్డు

ముంబై: భారత్ వద్ద విదేశీ మారక నిల్వల స్థాయి సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఈ నెల 14తో ముగిసిన వారానికి నిల్వలు మరో 309.1 కోట్ల డాలర్లు పెరిగి 47,609.2 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. విదేశీ కరెన్సీ ప్రవాహం మరింత పెరగడం ఇందుకు దోహదపడింది.

## రెండో దశ పరీక్షల్లో ఆరిజీన్ సొరియాసిస్ ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బయోటెక్నాలజీ కంపెనీ ఆరిజీన్ సొరియాసిస్ ఔషధ మాలిక్యూల్ (మూల కణం) ‘ఏయూఆర్101’ పై రెండో దశ వైద్య పరీక్షలు ప్రారంభించింది. కేన్సర్, ఇన్‌ఫ్లేమెటరీ వ్యాధులకు ఉత్తమమైన థెరపీల అభివృద్ధిలో నిమగ్నమైన ఆరిజీన్.. డాక్టర్ రెడ్డీస్ అనుబంధ కంపెనీ. ఒక స్థాయి నుంచి తీవ్ర స్థాయిలో సొరియాసిస్ ఉన్న రోగులపై ఫేస్ 2 పరీక్షలు ప్రారంభించామని, సొరియాసిస్ ఔషధ అభివృద్ధిలో పురోగతి కంపెనీకి మైలురాయని ఆరిజీన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీ రామచంద్ర తెలిపారు. 2020 చివరినాటికి ముఖ్యమైన క్లినికల్ డేటా అందుబాటులోకి రాగలదని ఆ తర్వాత భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు ఉంటాయని తెలిపారు.

## గ్రామీణ విద్యార్థులకు వెరిజాన్, ఐఐటీ-ఎం శిక్షణ

చెన్నై: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు ఇంజనీరింగ్ రంగంలో కొత్త అవకాశాలను కల్పించేందుకై వెరిజాన్ ఇండియా, ఐఐటీ మద్రాస్‌తో జత కట్టింది. ‘వన్ ల్యాబ్-వన్ స్కూల్’ పేరిట నిర్వహించే ఈ కార్యక్రమంలో.. తమిళనాడు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలకు అత్యున్నత గ్రాడ్యుయేట్ పరిశోధనశాలలను ఐఐటీ (ఎం) అనుసంధానం చేయనుంది. ఈ ప్రాజెక్టుకు పూర్తి నిధుల్ని వెరిజాన్ సమకూర్చనుంది. దీనికోసం ఐఐటీ-మద్రాస్‌లోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎంఎస్, ఎంటెక్, పీహెచ్‌డీ విద్యార్థులతో కూడిన పరిశోధన బృందాలు గ్రామీణ ఉన్నత పాఠశాలల్ని దత్తత తీసుకోనున్నాయి. 2018 జూన్ నుంచి మొత్తం 20 బృందాలు 20 పాఠశాలలతో అనుసంధానమయ్యాయని, తొమ్మిదవ తరగతికి చెందిన 800 మంది విద్యార్థులకు 150 మంది గ్రాడ్యుయేట్లు శిక్షణను అందించారని ఐఐటీ-మద్రాస్ వెల్లడించింది. భారత్‌లో శాస్త్రీయ విద్యాబోధనను మార్చే శక్తి ఈ కార్యక్రమానికి ఉందని వెరిజాన్ ఇండియా ధీమా వ్యక్తం చేసింది.

ప్రాంతాల మధ్య, దేశాల మధ్య ప్రయాణానికి విమానాలు ఎంతో ముఖ్యమైనవి. అతి తక్కువ సమయంలో ఈ లోహ విహంగాలు కోట్లాది మందిని తమ గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. వీటి రాకపోకల్లో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పవు. ప్రయాణికుల సంఖ్య తగ్గితే విమాన కంపెనీలకు నష్టాలూ తప్పవు. అయితే ఇప్పుడు కరోనా వైరస్ విమానయాన సంస్థల పాలిట శాపంలా మారింది. ఇప్పటికే ఈ వైరస్ చాలా మంది ప్రాణాలను బలిగొంది. వేలాది మంది దీని బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో అనేక దేశాలు విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించాయి. దీని వల్ల విమాన కంపెనీలు భారీ స్థాయిలో రాబడిని కోల్పోతాయన్న అంచనాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎయిర్‌లైన్స్‌పై కరోనా దెబ్బ



## రూ.2 లక్షల కోట్ల ఆదాయానికి గండి: ఐఏటీఏ

### ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో 2,780 కోట్ల డాలర్లు

ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న విమానయాన కంపెనీలు ఈ ఏడాదిలో ఉమ్మడిగా 2,780 కోట్ల డాలర్ల రాబడిని కోల్పోయే అవకాశం ఉందని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) చెబుతోంది. కరోనా వైరస్ సంక్షోభమే ఇందుకు కారణంగా పేర్కొంది. పూర్తి ఏడాదికి ప్రయాణికుల డిమాండ్‌లో 13 శాతం తగ్గుదల ఉంటుందన్న దాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాకు వచ్చినట్లు తెలిపింది. “ఏడాది ఎయిర్‌లైన్స్‌కు చాలా కష్టమైన సంవత్సరం” అని ఐఏటీఏ సీఈఓ అలెగ్జాండర్ దీ జునియాక్ తెలిపారు. విస్తరిస్తున్న వైరస్‌ను నియంత్రించడం అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. ఇంతకు ముందు 2008-09 ఆర్థిక సంక్షోభం తర్వాత ఇప్పటివరకెన్నడూ ఈ స్థాయిలో విమాన ప్రయాణ డిమాండ్ తగ్గలేదని ఆయన చెప్పారు.

### ప్రయాణికుల రాకపోకలు 4.7% తగ్గే చాన్స్

ఈ ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా విమాన ప్రయాణికుల రాకపోకలు 4.7 శాతం తగ్గవచ్చని ఐఏటీఏ భావిస్తోంది. చైనాలోని ఎయిర్‌లైన్స్ దేశీయ మార్కెట్లోనే 1,280 కోట్ల డాలర్ల రాబడిని కోల్పోయే అవకాశం ఉంది. ఆసియా-పసిఫిక్ రీజియన్ వెలుపలి విమానయాన కంపెనీలు 150 కోట్ల డాలర్ల నష్టాలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా వైరస్ కారణంగా ఎయిర్‌లైన్ కంపెనీలు 2,930 కోట్ల డాలర్లు (రూ.2లక్షల కోట్లు) కోల్పోవచ్చని అంచనా వేస్తోంది. ఒకవేళ వైరస్ ఆసియా-పసిఫిక్ మార్కెట్లలో మరింతగా విస్తరిస్తే ఇతర ప్రాంతాల్లోని ఎయిర్‌లైన్స్‌పై కూడా ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఐఏటీఏ హెచ్చరిస్తోంది. అన్ని పరిస్థితులు అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ఈ ఏడాదిలో ఆసియా-పసిఫిక్ రీజియన్‌లోని ఎయిర్‌లైన్స్ 4.8 శాతం వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. అయితే ఇప్పుడు పరిస్థితులు తలక్రిందులయ్యాయి. అయితే కొన్ని అంశాలతో మాత్రం ఎయిర్‌లైన్ ఇబ్బందులు కాస్త తగ్గడానికి అవకాశం ఉందంటున్నారు.

> “ప్రభుత్వం ద్రవ్య, పరపతి విధానాన్ని ప్రతికూల ఆర్థిక ప్రభావాల నుంచి బయట పడేయడానికి వినియోగించే అవకాశం ఉంది. ఇంధన ధరలు తక్కువగా ఉన్నందు వల్ల కొన్ని విమానయాన కంపెనీలకు కొంత ఉపశమనం లభించవచ్చు. అయితే ఇది ఎంత కాలం అన్న దాన్నిబట్టి ఆధారపడి ఉంటుంది. ఇక కంపెనీలు రాబడులను కోల్పోతే వాటి లాభాలపై ఎంత మేరకు ప్రభావం ఉంటుందన్న దాని గురించి ఇప్పుడే చెప్పలేం. ఇప్పటికే ఎయిర్‌లైన్స్ కంపెనీలు తమ సామర్థ్యాలను తగ్గించుకుంటున్నాయి. కొన్ని రూట్లకు సర్వీసులను తగ్గిస్తున్నాయి”
>
> **- ఐఏటీఏ**

### విమానాల రద్దు

చైనాలో కరోనా వైరస్ విస్తృతి నేపథ్యంలో అంతర్జాతీయ విమానయాన సంస్థలైన బ్రిటిష్ ఎయిర్‌వేస్, జర్మనీకి చెందిన లుఫ్తాన్సా, ఆస్ట్రేలియాకు చెందిన క్వాంటాస్, అమెరికాకు చెందిన మూడు అతిపెద్ద విమానయాన కంపెనీలు చైనాకు విమాన సర్వీసులను రద్దు చేశాయి. కొన్ని సందర్భాల్లో విమాన సర్వీసుల రద్దు ఏప్రిల్ లేదా మే వరకు కొనసాగవచ్చంటున్నారు. ఉద్యోగులు మూడు వారాల పాటు వేతనం లేని సెలవు తీసుకోవాలని క్యాథేపసిఫిక్ కోరింది. చాలా దేశాలు చైనాకు వెళ్లవద్దని తమ దేశ పౌరులకు సూచిస్తున్నాయి. చాలా మంది స్వచ్ఛందంగా తమ దేశాలకు వెళ్లిపోతున్నారు.

## జీడీపీ 4.9 శాతమే

**» ఎన్‌సీఏఈఆర్**

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) జీడీపీ వృద్ధి రేటు 5% కూడా చేరే సూచనలు కనిపించడం లేదు. మహా అయితే వృద్ధి రేటు 4.9 శాతం ఉంటుందని జాతీయ అనువర్తిత ఆర్థిక పరిశోధనా మండలి (ఎన్‌సీఈఏఆర్) తెలిపింది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ), ఆర్‌బీఐ అంచనా వేసిన 5% కన్నా ఇది తక్కువ. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) మాత్రం భారత జీడీపీ వృద్ధి రేటు 5.6 % వరకు ఉంటుందని అంచనా వేసింది.

## ఆర్‌బీఎల్ బ్యాంక్, బజాజ్ అలియాంజ్ జట్టు

ముంబై: ప్రైవేటు రంగంలోని ఆర్‌బీఎల్ బ్యాంకు, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు కస్టమైజ్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ సొల్యూషన్లను బ్యాంకు కస్టమర్లకు అందించనున్నారు. ఈ భాగస్వామ్యం కింద బజాజ్ అలియాంజ్ లైఫ్ తన రిటైల్ ఉత్పత్తులను బ్యాంకు కస్టమర్లకు అందిస్తుంది.


పెదపరిమి శిబిరంలో శివలింగానికి పూజలు


తాడికొండ అడ్డరోడ్డు శిబిరంలో రూపొందించిన శివలింగం వద్ద మహిళల జై అమరావతి నినాదాలు

● జగన్ మనసు మారాలి!

# శిబిరాల్లో.. శివపూజలు

## నేడు అమరావతి బంద్

రైతులు, రైతుకూలీలు, మహిళలపై పోలీసులు దౌర్జన్యం చేయటంతో పాటు, అక్రమ కేసులు బనాయించారని, ఈ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ అమరావతిలోని 29 గ్రామాల్లో శనివారం బంద్‌కు పిలుపునిస్తున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు. విద్య, వ్యాపార సంస్థలు బంద్ పాటించాలని జేఏసీ కోరింది.

## అభ్యంతరకర చిత్రీకరణలు తప్పే

▸▸ తుళ్లూరు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

తుళ్లూరు: డ్రోన్ కెమెరాలతో అభ్యంతరకర చిత్రీకరణలు తప్పేనని, రైతులు చేసే ప్రశాంతమైన ధర్నాలు, నిరసనలకు పోలీసులు అడ్డురారని తుళ్లూరు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల గోడు తెలుసు కాబట్టే పోలీసులు సామరస్యంగా ఉన్నారని అన్నారు. అయితే చట్టాన్ని అతిక్రమించి రోడ్డు మీదకొచ్చి గంటల తరబడి ధర్నాలు చేస్తే కేసులు పెట్టక తప్పదని చెప్పారు. కృష్ణాయపాలెంలో తహశీల్దార్‌ని అడ్డుకున్నందుకు, హోం మినిస్టర్, డీజీపీ వస్తున్న సమయంలో ట్రాక్టర్‌ను అడ్డుపెట్టినందుకు కొందరిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే పెదపరిమిలో ఎమ్మెల్యే రోజాను అడ్డుకున్న కేసులో అయిదుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. గురువారం డ్రోన్ చిత్రీకరణ సమయంలో ఆపరేట్ చేస్తున్న కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన వారిపై కూ డా కేసులు నమోదు చేశామన్నారు. అసభ్యకర సన్నివేశాలు చిత్రీకరిస్తే ఎవరైనా శిక్షార్హులేనన్నారు. రైతు లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ శరత్ బాబు, తనపై కూడా కేసు రిజిస్టర్ అయినట్టు డీఎస్పీ తెలిపారు. జేఏసీ నాయకుడు పువ్వా డ సుధాకర్ రైతులను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు కాబట్టే అరెస్టు చేస్తున్నట్టు చెప్పామన్నా రు. ఈ తరువాత మాట మార్చిన మరో నాయకుడు శ్రీనివాస్ కుల ప్రస్తావన తెచ్చి డ్రోన్‌తో పోలీసులు అభ్యంతరకర చిత్రీకరణలు చేస్తున్నట్టు అవాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నా రు.



మందడం దీక్ష శిబిరంలో మహిళల నిరసన

▸▸ మహాశివరాత్రి రోజూ కొనసాగిన ఆందోళనలు

▸▸ సీఎం మనసు మారాలంటూ లింగాభిషేకాలు

▸▸ అమరావతికి జై కొట్టిన సీపీఐ

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్ మనసు మార్చు శివా!'- అంటూ అమరావతి రైతులు మహాశివరాత్రిని పురస్కరించుకుని తాము ఆందోళనలు చేస్తున్న శిబిరాల్లోనే లింగార్చనలు చేశారు. రాజధాని తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాక తమ పోరాటం ఆగదని.. సీఎం జగన్ అన్ని గ్రామాల్లోనూ పర్యటించి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవాలని.. రైతులు విజ్ఞప్తి చేశారు. రాజధానిగా అమరాతినే కొనసాగించాలని కోరుతూ రైతులు చేపట్టిన ఆందోళనలు శుక్రవారం 66వ రోజుకు చేరాయి. మహాశివరాత్రి రోజు కూడా రైతులు నిరసనలు కొనసాగించారు. తుళ్లూరు, మందడంలో మహాధర్నా నిర్వహించగా, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం తదితర ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. కోటప్పకొండ తిరుణాళ్లలో జై.. అమరావతి నినాదం మార్మోగింది. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, కావూరు గ్రామస్థులు ఏర్పాటు చేసిన ప్రభ తాళ్లను చేతపట్టుకుని అమరావతి రైతులు నినాదాలు చేస్తూ కోటప్పకొండకు సాగారు. మందడం, వెలగపూడి, తుళ్లూరు తదితర గ్రామాల నుంచి రైతులు, మహిళలు బస్సులు, కార్లలో కోటప్పకొండకు పయనమైయ్యారు. ఆకుపచ్చ కండువాలు కప్పుకొని రైతులు ప్రదర్శనలో పాల్గొన్నారు. అమరావతి రైతులకు భక్తులు సంఘీభావం తెలిపి వారితో ముందుకు సాగారు. అమరావతి ఉద్యమ గీతాలను వినిపించారు. కమ్మవారిపాలెం ప్రభకు 'జై అమరావతి' బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అయితే, పోలీసులు అమరావతి బ్యానర్లను తొలగించగా రైతులు నిరసన వ్యక్తం చేశారు.

- తాడికొండ అడ్డరోడ్డులో నిరసనలు వ్యక్తం చేస్తున్న రైతులు, మహిళలు శుక్రవారం శివరాత్రి పండుగ సందర్భంగా శివునికి ప్రత్యేక పూజలు చేశారు. శిబిరం ముందు శివలింగాన్ని ఏర్పాటు చేసి, పువ్వులతో శివలింగాకారాన్ని, 'జై అమరావతి' అని రాసి నిరసనలు కొనసాగించారు. పొన్నెకల్లు గ్రామ మహిళలు శిబిరంలోనే జాగారం చేశారు.
- రాయపూడి దిక్షా శిబిరంలో హిందూ, ముస్లిం మహిళలు కలిసి కాలేషా దర్గాలో పొంగళ్లు చేసి ర్యాలీగా దీక్షా శిబిరానికి వచ్చారు. అక్కడ శివపూజ చేయటంతో పాటు, గోపూజ చేసి మతసామర్యం చాటారు. అమరావతి కోసం దీక్ష చేశారు. ముస్లిం మహిళలు మాట్లాడుతూ, ఢిల్లీ షాహీన్‌బాగ్‌లో దీక్ష చేస్తున్న మహిళలు తమకు ఆదర్శమని చెప్పారు.
- మందడం దీక్షా శిబిరాన్ని టీడీపీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు.

రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లును వ్యతిరేకిస్తామన్నారు. టీడీపీ ఎమ్మెల్సీలను డబ్బుతో కొనుగోలు చేయటానికి జగన్ సిద్ధమయ్యారని ఆరోపించారు.

- తాడేపల్లి మండలం పెనుమాక, మంగళగిరి మండలం నవులూరు, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు, జేఏసీ నేతలు నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు శుక్రవారం 66వ రోజుకు చేరాయి.

### రైతులదే తుది విజయం: దేవినేని

అమరావతి ఉద్యమంలో రైతులదే తుది విజయమని, ధైర్యంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు. కృష్ణాయపాలెంలో రైతులు, రైతు కూలీలు, జేఏసీ నేతలు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. అమరావతిని ఏకైక రాజధాని కొనసాగించాలని దీక్షలు చేస్తుంటే సీఎం జగన్‌కు నవ్వులాటలా ఉండడం బాధాకరమన్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అత్యుత్సాహంతో పని చేస్తున్నాడని విమర్శించారు.


కోటప్పకొండకు అమరావతి ప్రభ

గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామస్తులు ప్రతి సంవత్సరం శివరాత్రికి 90 అడుగుల ప్రభను కట్టుకుని కోటప్పకొండ వెళ్తారు. ఈ సంవత్సరం రాజధాని రైతులు, మహిళలకు మద్దతుగా ప్రభను ఏర్పాటు చేసి, కాలినడకను కొండకు చేరుకున్నారు.

## మూడు రాజధానులకు మేం వ్యతిరేకం

▸▸ అమరవతి ఉద్యమానికి సీపీఐ మద్దతు

▸▸ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా మూడు రాజధానులు లేవని, ఏపీ సీఎం జగన్ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కావడం లేదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. మూడు రాజధానుల నిర్ణయం వల్ల రాజకీయ సంక్షోభం ఏర్పడిందని, దీనికి ఆర్థిక సంక్షోభం కూడా తోడవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగన్ ఇలాంటి సలహాలు ఎవరు ఇస్తున్నారో తెలియడం లేదని చెప్పారు. శుక్రవారం విజయవాడ వచ్చిన రాజాను అమరావతి జేఏసీ నాయకులు కలిసి రాజధాని అమరావతిలోనే కొనసాగాలే సహకరించాలని, జేఏసీ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అమరావతి జేఏసీ నాయకులు ఎ.శివారెడ్డి, గద్దె తిరుపతిరావు, ఆర్‌వీ స్వామి, తదితరులతోపాటు కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ రాజాను కలిశారు. అనంతరం, రాజా మాట్లాడుతూ.. మూడు రాజధానులకు తమ పార్టీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. అమరావతి ఉద్యమాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లాల్సిన అవసరముందన్నారు. జాతీయస్థాయిలో ఆందోళనను ఉధృతం చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. సీఎం జగన్ తన పతనాన్ని తనే కోరి తెచ్చుకుంటున్నారని దుయ్యబట్టారు.


సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు వినతిపత్రం ఇస్తున్న అమరావతి జేఏసీ నేతలు

## ట్విటర్‌లో టీడీపీ

### మహిళా సీఎం ఎవరో స్పష్టతివ్వండి: అనిత

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): "ఎడారి గడ్డపై నిమ్మగడ్డకి, తాడేపల్లి అడ్డాలో ఉన్న జగన్‌కీ ఉన్న క్విడ్ ప్రోకో బంధం తెలిసిన పారిశ్రామికవేత్తగా భవిష్యత్తును ఊహించి ఏపీకి మహిళా సీఎం రావాలనే మీ కోరిక సమంజసమైనదే. హాట్ ట్వీట్ చేసి డిలీట్ చేసినా, మీ మనసులో కోరిక బయటపెట్టారు" అని తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ట్వీట్ చేశారు. "అభివృద్ధి వద్దు, సంక్షేమం రద్దు అంటున్న జగన్ మాకొద్దంటున్నారు ప్రజలు. తాడేపల్లిలో భారతి, షర్మిల మధ్య కుర్చీపోరు తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఏ మహిళ సీఎం కావాలనుకుంటన్నారో మరో ట్వీట్‌లో క్లారిటీ ఇస్తారని ఆశిస్తున్నాం" అని పొట్లూరి వరప్రసాద్‌ని ఉద్దేశించి అనిత ట్వీట్ చేశారు. మరో ట్వీట్‌లో భార్య పేరుతో అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించి వివాహ వ్యవస్థకే జగన్ కళంకం తెచ్చారని ఆరోపించారు.

### అంత రేటుకి దొంగమామ ఎలా కొన్నాడు? అచ్చెన్న

"రూ.10 షేర్‌ని రూ.1440 పెట్టి కొనడానికి శ్రీనివాసన్ ఏమైనా నీకు పిల్లనిచ్చిన మామా..? మీ అమ్మకు తోడపుట్టిన నీ మరో మేనమామా..? నీ మామే(గంగిరెడ్డి) కొనలేదు ఒక్కో షేరు అంత రేటుపెట్టి..!! ఇక నీ మేనమామ రవీంద్రనాథ రెడ్డి కొనేరకం ఎటూ కాదు ఆ రేటుకి..!!! మరి ఈ 'దొంగ మామ' ఎలా కొన్నాడు చెప్మా? సీబీఐ భారతి సిమెంట్స్ తీగ లాగింది. ఈడీ దెబ్బకు నీ డొంకలన్నీ కదిలాయా జగ్గూ దాదా..!" అని టీడీఎల్పీ ఉపనేత కే అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు.

### జైలు పిలుస్తోంది.. సిద్ధంగా ఉండండి: బుద్దా

"తీగలాగితే డొంక కదిలింది. జైలు పిలుస్తోంది... 'కావాలి తుగ్లక్.. రావాలి తుగ్లక్' అని. సిద్ధంగా ఉండండి విజయసాయిరెడ్డి" అని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్వీట్ చేశారు. "మహా మేత ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి, బంజారాహిల్స్‌లో ఉన్న స్థలాన్ని రెగ్యులరైజ్ చెయ్యాలని చంద్రబాబుని ప్రాధేయపడ్డాడు. తుగ్లక్ రెడ్డెమో 5 ఏళ్లలోనే రూ.43 వేల కోట్లకు పడగలెత్తాడు. ఆ మ్యాజిక్ వెనుక ఉన్న లాజిక్ సీబీఐ, ఈడీ పూసగుచ్చినట్లు వివరిస్తున్నాయి" అని బుద్దా ట్వీట్‌లో విమర్శించారు.

### వారికి క్విడ్ ప్రోకో కామెర్లు: బీటీ నాయుడు

"జగన్ అక్రమాస్తుల పత్రిక సాక్షిగా బీసీ నాయకుడు అచ్చెన్నాయుడికి అవినీతి అంటించాలని చూస్తున్నారు. బీసీ నిధుల మళ్లింపు, పదవుల్లో అన్యాయంపై జగన్ సర్కారుని నిలదీస్తున్న అచ్చెన్నకి సమాధానం ఇవ్వలేక క్విడ్ ప్రోకో కామెర్లతో ఆరోపణలు చేస్తున్నారు" ఎమ్మెల్సీ బీటీ నాయుడు.

### బాబు ప్రగతి వెలుగుల్ని అడ్డుకోలేరు: కాల్వ

"ఏపీ అభివృద్ధికి వైసీపీ రంగులేసి, టీడీపీ అమలు చేసిన పథకాలకు బొమ్మలు మార్చి నవ్యాంధ్రలో చంద్రబాబు ప్రగతి వెలుగుల్ని వైఎస్ జగన్ అడ్డుకోలేరు" అని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ట్వీట్ చేశారు.

### రంగులేసి డప్పుకొట్టుకోండి: పంచుమర్తి

"సజ్జల రెడ్డిగారూ, దొంగ లెక్కల వీసారెడ్డి స్కూల్‌లో శిక్షణ పొందినట్టున్నారు. వెలిగొండ తొలి సొరంగం 18.84 కిలోమీటర్లకి 17 కిలోమీటర్లు చంద్రబాబే పూర్తి చేశారు. మిగిలిన 1.84 కిలోమీటర్లు పూర్తి చేయకుండానే తప్పుడు లెక్కలు చెబుతున్నారు" అని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ ట్వీట్ చేశారు. "మీకు కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్టులపై లేదని తేలింది. చంద్రబాబు చేసిన అభివృద్ధికి వైసీపీ రంగులేయడం, పేర్లు మార్చడం తెలిసిన జగన్‌తో సొరంగానికి రంగులేసి డప్పుకొట్టుకోండి" అన్నారు.

### భూములు లాక్కోవడం దుర్మార్గం: వడ్డే

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 21: "ఉగాది నాటికి 25 లక్షల మందికి ఇళ్ల స్థలాల పంపిణీ ఎట్టి పరిస్థితుల్లో సాధ్యం కాదు. దీని పేరుతో దళిత, గిరిజన, వెనకబడిన వర్గాల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం దుర్మార్గం. దమ్ముంటే పేదల ఇళ్ల స్థలాల పంపిణీకి సీఎం జగన్, మంత్రుల కుటుంబాల ఆధీనంలోని స్థలాలను ఇవ్వాలి" అని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. నాడు నేనున్నానంటూ ముద్దులు పెట్టి... నేడు దళిత, గిరిజన, పేదల పొట్ట కొట్టడం తగునా? అని ప్రశ్నించారు.

## అచ్చెన్నపై పూర్తిస్థాయి విచారణ

▸▸ కఠిన చర్యలు తీసుకుంటాం.. మంత్రి ధర్మాన



గుజరాతీపేట(శ్రీకాకుళం), ఫిబ్రవరి 21: ఈఎస్‌ఐలో మందులు, వైద్య పరికరాల కొనుగోలులో భారీ కుంభకోణానికి కార్మిక శాఖ మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు తెరలేపారని.. ఆయనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి.. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఏ తప్పూ చేయలేదని చెబుతున్న అచ్చెన్నాయుడు తన వారికి నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టు కట్టబెట్టాలంటూ సిఫారసులు ఎందుకిచ్చారో చెప్పాలని శుక్రవారం డిమాండ్ చేశారు. రూ.5 లక్షలకు ఏవి కొనాలన్నా టెండర్లు పిలవాలన్న సంగతిని పక్కనబెట్టి.. నచ్చినవారికి పనులను అప్పగించారని ఆరోపించారు. ఇలా రూ.900 కోట్ల పైగా ప్రజాధనాన్ని టీడీపీ హయాంలో దోచుకున్నారని మండిపడ్డారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో ఈ స్కాం బట్టబయలైందని.. అర్హతలు లేని ఏజెన్సీల నుంచి మందులు కొనుగోలు చేసి ప్రభుత్వ సొమ్మును కాజేశారని స్పష్టమైందని తెలిపారు. టెలీహెల్త్ సర్వీసుల పేరుతో ఆర్డర్స్ ఇవ్వడంలో అచ్చెన్నాయుడు ఒత్తిడి తెచ్చి భారీగా లబ్ధి పొందారని అన్నారు. ఈఎస్ఐలో నకిలీ కొటేషన్లు తీసుకుని ఆర్డర్లు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారని చెప్పారు. మాజీ మంత్రికి సహకరించిన వారిపైనా చర్యలుంటాయని తెలిపారు.

## టెలీహెల్త్‌పైనే నోట్ పంపా

▸▸ మందులిచ్చేయండని సిఫారసు చేయలేదు

▸▸ విచారణ జరిపించుకోవచ్చు: అచ్చెన్న



శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అమలవుతున్న టెలీహెల్త్ సర్వీసెస్‌ను ఇక్కడా అమలు చేయాలని కేవలం నోట్ మాత్రమే ఇచ్చానని మాజీ మంత్రి, టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈఎస్ఐలో కుంభకోణం జరిగిందన్న నేపథ్యంలో తనపై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఈ మేరకు శుక్రవారం సందేశం పంపారు. శ్రీకాకుళం జిల్లాలోని స్వగ్రామం నిమ్మాడలో తాను ఉండగా టీవీల్లో వార్తలు చూశానని.. ఈఎస్ఐలో భారీ కుంభకోణం జరిగిపోయిందని, మంత్రిగా తాను సిఫారసు చేసి నామినేషన్‌పై మందుల కొనుగోలుకు లేఖ రాశానంటూ ముందుగా జగన్ మీడియా, తర్వాత ప్రభుత్వం పేర్కొన్నాయని చెప్పారు. మరికొన్ని టీవీల్లో ఇదే ప్రసారం చేయడంతో అసలు విషయాన్ని ప్రజలకు, పాత్రికేయులకు తెలియజేస్తున్నానని తెలిపారు. 'నేను 2016లో కార్మిక శాఖ మంత్రిగా ఉండగా.. ప్రధాని ఈఎస్ఐ సమావేశం ఒకటి నిర్వహించారు. టెక్నాలజీ పెరిగిందని, టెలీహెల్త్ సర్వీసెస్‌ను కూడా ఈఎస్ఐలలో అందించాలని ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఆ ఏడాది డిసెంబరులో కేంద్రం నుంచి ఇదే విషయమై లేఖ వచ్చింది. టెలీహెల్త్ సర్వీసెస్ దేశంలో ఎక్కడ అమలవుతున్నాయని అప్పుడు నేను అధికారులను అడగ్గా.. తెలంగాణలో అమలవుతున్నట్లు చెప్పారు. తెలంగాణ రీతిలో ఇక్కడా అమలుచేయాలని మాత్రమే నేను నోట్ పంపాను. ఇదే విషయమై 2016 డిసెంబరులోనే అధికారులతో సమీక్ష నిర్వహించి.. అందులో మినిట్స్‌లో కూడా పొందుపరిచారు. మంత్రిగా ఆనాడు అది నా బాధ్యత. కానీ దానిని ఇప్పుడు భూతద్దంలో చూపిస్తున్నారు. ఫలానా వారికే మందులను నామినేషన్ పద్ధతిపై కేటాయించాలంటూ నేను ఎక్కడా సిఫారసు చేయలేదు. అవినీతికి పాల్పడే ఉద్దేశం, అవసరం నాకు లేదు. మంత్రిగా ఉన్నప్పుడు ఏ ఒక్క కాగితం కూడా వృధా చేయకుండా బైండింగ్ కూడా చేయించా. ప్రస్తుతం టెలీహెల్త్ సర్వీసెస్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం నేను స్వగ్రామంలో ఉన్నాను. రికార్డులన్నీ ప్రభుత్వం వద్దే ఉన్నాయి. విచారణ జరిపించుకోవచ్చు. అచ్చెన్నాయుడికి డబ్బులు అవసరమైతే పదిమందిని సహాయం కోరతాడు గానీ.. తప్పులు చేయబోడు' అని స్పష్టంచేశారు.

## అచ్చెన్న లేఖ రాయలేదు

▸▸ తుగ్లక్‌ని విమర్శించారనే ఈ బురద: లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): "దొంగ పేపర్, దొంగ చానల్ ట్రాప్‌లో పడి మీ పరువు తీసుకోకండి. రెండు వేల కోట్లు అంటూ అందరినీ తప్పుదోవ పట్టించారు. ఉన్నది రూ.2 లక్షలే అని తెలిశాక నాలుక కరుచుకున్నారు. ఇప్పు డు బీసీ నాయకుడిపై పడ్డారు. బీసీలకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేస్తుంది" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ట్విటర్‌లో మండిపడ్డారు. "తుగ్లక్ బీసీ నిధులు పక్కదారి పట్టించారని గళమెత్తినందుకు అచ్చెన్నాయుడికి అవినీతి మరక అంటించాలని ప్రయత్నిస్తున్నా రు. మందులు, వస్తువుల కొనుగోళ్లకు ఎలాంటి లేఖలు అచ్చెన్నాయుడు రాయలేదని ఆధారాలున్నా లీక్ వార్తలతో ఏదో పీకాలని దొంగ పేపర్, చానల్ తాపత్రయపడడంలో తప్పులేదు. కానీ మిగిలిన వాళ్లు క్విడ్ ప్రో కో వార్తల ట్రాప్‌లో పడితే ఉన్న విలువ పోతుంది" అని లోకేశ్ ట్వీట్ చేశారు.

## 'వెలిగొండ'పై సజ్జల అబద్ధాలు

▸▸ దేవినేని ఉమ ఆగ్రహం



మంగళగిరి, ఫిబ్రవరి 21: ముఖ్యమంత్రి జగన్ వెలిగొండ పర్యటన చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందని.. వెలిగొండ పనుల్లో అవినీతి జరిగితే ఆయన ఏం గడ్డి పీకుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమ మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు అబద్ధాలతో బతికేస్తున్నారని విరుచుకుపడ్డారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. వెలిగొండ ఒకటో టన్నెల్ పనులు 90.96 శాతం పూర్తయ్యాయని, 17.78 కిలో మీటర్ల వరకు టన్నెల్ బోరింగ్ పనులు పూర్తయ్యాయని, మొత్తం 18.798 మీటర్లలో 17.78 కిలోమీటర్ల వరకు పూర్తయినట్లు సీఎం చేసిన సమీక్షలో ప్రభుత్వమే అంగీకరించిందని పేర్కొన్నారు. జగన్ వ చ్చాకే వెలిగొండ టన్నెల్ పూర్తిచేసినట్లు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. శుక్రవారం సాయం త్రం బెంగుళూరు వెళ్లి.. సోమవారం ఉదయాన్నే తిరిగొచ్చే ఆయన.. ఎవరి నుంచి ఎంతెంత వసూలు చేస్తున్నాడో డమ్మీ మంత్రులను అడిగితే తెలుస్తుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక గత ఐదేళ్లలో వెలిగొండ ప్రాజెక్టులో టన్నెల్-1లో 4.4 కిలోమీటర్ల పనులను పూర్తి చేశామన్నారు.

## బీసీల గొంతు నొక్కడమే లక్ష్యం

▸▸ వారంటే జగన్‌కు చిన్నచూపు

▸▸ అందుకే మండలి రద్దు ప్రతిపాదన

▸▸ విధానాలపై ప్రశ్నిస్తున్నందుకే కక్ష

▸▸ వాస్తవ వక్రీకరణలతో జగన్ మీడియా కథనాలు

▸▸ చంద్రబాబు, కొల్లు, వర్ల విమర్శ



అమరావతి, మంగళగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అచ్చెన్నాయుడు అవినీతికి పాల్పడ్డారంటూ వచ్చిన వార్తా కథనాలని వైసీపీ చేస్తున్న విష ప్రచారం అంటూ తెలుగుదేశం మండిపడింది. వైసీపీ ప్రభుత్వ విధానాలను, బీసీలను మోసం చేస్తున్న తీరును అచ్చెన్న ఎండగడుతున్నందునే కక్ష కట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. "బీసీలంటే జగన్‌కు చిన్నచూపు. బీసీ నాయకులు ఎదగడాన్ని సహించలేడు. టీడీపీలో బీసీ నేతలకు ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసీపీ బురద జల్లుతోంది. బీసీల గొంతు నొక్కాలన్నదే జగన్ లక్ష్యం" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆరోపించారు. టీడీపీ బీసీ నేతలను వైసీపీ టార్గెట్ చేయడం హేయమన్నారు. అచ్చెన్నాయుడు, గణేశ్‌లపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు చంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీల గొంతు నొక్కేందుకే జగన్ కౌన్సిల్ రద్దుపై తీర్మానం పెట్టారన్నారు. 20 మంది బీసీలు, ఇద్దరిద్దరు ఎస్టీ, ఎస్సీలు, ముగ్గురు మైనార్టీలు కౌన్సిల్‌లో ఉండడం జగన్‌కు కడుపుమంట అని ఆరోపించారు. బీసీలపై ద్వేషంతోనే ఆదరణ పథకం రద్దు చేశారని, కార్పొరేషన్ల నిధులు దారి మళ్లించి స్వాహా చేశారని మండిపడ్డారు. వాటిని ప్రశ్నించారనే టీడీపీ బీసీ నేతలు అచ్చెన్నాయుడు, గణేశ్‌లపై ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేశారు. జగన్ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారని ధ్వజమెత్తారు. ఆయన బురదను తమ బీసీ నేతలకు అంటించి అణిచివేయాలని చూస్తే వారు అంతకంతకు ఎదుగుతారని హెచ్చరించారు. అబద్ధాల జగన్ మీడియాలో అచ్చెన్నపై తప్పుడు కథనాలు రాయడం హాస్యాస్పదమని చంద్రబాబు విమర్శించారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. "బీసీలను మాయచేసి, మోసం చేస్తున్న వైనాన్ని బీసీల ప్రతినిధిగా అచ్చెన్నాయుడు బట్టబయలుచేస్తూ ప్రశ్నిస్తున్నారు. అందుకే అచ్చెన్నాయుడుకు అవినీతి మరకలను అంటించి, అక్రమ కేసులను పెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. బీసీ నేతల గొంతు నొక్కే కుట్ర ఇది" అని రవీంద్ర విమర్శించారు. అన్ని రాష్ట్రాలలో టెలీ హెల్త్ సర్వీసెస్‌ను ఆమలు చేయాలంటూ 2016లో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అప్పటికే తెలంగాణలో ఇది అమలువుతున్న నేపథ్యంలో ఆ నమూనానే తీసుకోవాలని అచ్చెన్న సూచించారన్నారు. దీనిని వక్రీకరించిన వైసీపీ అసత్యప్రచారానికి పాల్పడుతోందని రవీంద్ర విమర్శించారు.

### జగన్, పెద్దిరెడ్డి తప్పు ఒప్పుకుంటారా?: వర్ల

ఇదే అంశంపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రకటన చేశారు. హైకోర్టు తప్పు పట్టినా, రూ.1400 కోట్లతో ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులేసి, గ్రామ సచివాలయాలపై బొమ్మలేయించుకున్న సీఎం జగన్, పంచాయతీ రాజ్ మంత్రి పెద్దిరెడ్డి తప్పు చేసినట్లు అంగీకరిస్తారా? అని వర్ల ప్రశ్నించారు. చిత్తశుద్ధితో రాజకీయాలు చేసే టీడీపీ బీసీ నేత అచ్చెన్నాయుడు వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తారా? అని మండిపడ్డారు. విజిలెన్స్ రిపోర్టులో ఈసీజీ, టోల్ ఫ్రీ సర్వీసెస్‌కు రూ.7.96 కోట్లు మాత్రమే నామినేషన్ కింద కేటాయించినట్లు ఉందన్నారు. వాస్తవానికి భిన్నంగా జగన్ మీడియా ఈఎస్ఐలో అక్రమాలంటూ కథనాలు వండివార్చిందంటూ వర్ల విమర్శించారు.

## బిల్ట్ ఏపీ కాదు... కిల్డ్ ఏపీ

▸▸ ఇడుపులపాయల ఎస్టేట్‌ను పంచగలరా?: జవహర్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వ భూములను అమ్ముకోవడానికే వైసీపీ ప్రభుత్వం బిల్ట్ ఏపీని తెర మీదకు తెచ్చింది. నిజానికి ఇది రాష్ట్ర ప్రజలపాలిటి కిల్డ్ ఏపీగా మారనుంది" అని మాజీ మంత్రి జవహర్ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. ఉగాదిలోగా స్థలాల టార్గెట్ పూర్తి చేసుకునేందుకు పేదల స్థలాలను స్వాధీనం చేసుకునే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూ కబ్జాలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పేదవాని గుడిసెని జేసీబీతో పీకేసి, ఆ స్థలాన్ని లాక్కుని, ఆ 2.5 సెంట్లలో 1.5 సెంట్లు తిరిగిస్తామనడం జగన్ నవ మాసాల పాలనలో 9వ మోసమని విమర్శించారు. విశాఖలో 4 వేల ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని 'బిల్ట్ ఏపీ' పేరుతో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సాగు చేసుకుంటున్న 10 వేల ఎకరాలను లాక్కుని పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని బిల్డప్ ఇస్తున్నారని మండిపడ్డారు. ఇడుపులపాయ ఎస్టేట్‌లో ఉన్న వందలాది ఎకరాలను జగన్ పేదలకు పంచగలడా? అని జవహర్ ప్రశ్నించారు.

### అమరావతి పాకిస్థాన్‌లో ఉందా?: సంధ్యారాణి

వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు వైసీపీ పాలన ఉందని టీడీపీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. అమరావతి ఉద్యమంపై నిఘా పేరుతో సామాన్యుల ఇళ్లపై, మహిళల స్నానాల గదులపై డ్రోన్లు ఎగరేస్తూ, ప్రశ్నించిన రైతులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. "పల్లెల్లో పైకప్పుల్లేని స్నానాల గదులుంటాయి. దయచేసి డ్రోన్లను తిప్పొద్దు.. అని మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఇదేమని అడిగిన వారిపై కేసులు పెడతారా? అమరావతి పాకిస్థాన్‌లో ఉందా?" అని నిలదీశారు. సుచరిత, రోజా నోరు మెదపరేం అంటూ ప్రశ్నించారు.

### ఉద్యోగుల ప్రశ్నలకు జవాబివ్వరేం? అర్జునుడు

మూడు రాజధానుల వల్ల ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలపై గత 70 రోజుల్లో ఏనాడన్నా నోరు విప్పారా? 3 చోట్ల కాపురాలు ఉండడం ఎలాగో తెలియక, బిడ్డల చదువులు ఎక్కడో అర్థం కాక జుట్టు పీక్కుంటున్న ఉద్యోగుల ప్రశ్నలకు వైసీపీ నేతలు జవాబివ్వరేమిటని టీడీపీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు నిలదీశారు. తుగ్లక్ చర్యలతో వచ్చే సమస్యలు, 10 వేలమంది ఉద్యోగుల ఆవేదన మీకు పట్టదా? అని శుక్రవారం ప్రభుత్వాన్ని నిలదీశారు.

విజయవాడకు చెందిన వెంకటరావు నిరుపేద కూలీ. కాలువగట్టు మీద గుడిసెలో నివసిస్తున్నాడు. ఉగాదికి ఇచ్చే స్థలం కోసం దర ఖాస్తు చేసుకున్నాడు. ఆయనకు అమరావతి ఏరియాలో ఇంటి స్థలం ఇస్తామని కబురొచ్చింది. ఎక్కడ విజయవాడ? ఎక్కడ అమరావతి? విజయవాడలో పనిచేసుకొనే పేదవాడు అమరావతిలో ఏం చేయాలి?

'పట్టా'లు తప్పే పేదల బతుకులు
ఉంటున్న చోటికి దూరంగా స్థలాలు
పది నుంచి 20 కిలోమీటర్లలో ఎంపిక
అక్కడ ఇల్లు కట్టుకుంటామంటేనే స్థలం
లేదంటే ఇవ్వబోమని నిక్కచ్చి షరతు

తిరుపతి పట్టణంలో రోజాకూలీగా పనిచేస్తున్న వెంకటప్పకు సొంత ఇల్లు లేదు. తిరుపతి రైల్వేస్టేషన్‌కు దూరంగా ఓ గుడిసెలో ఉంటున్నాడు. ఆయనకు తిరుపతి రూరల్ మండలంలో ఇంటిస్థలం చూపించారు. అది ఆయన నివాసానికి 18 కిలోమీటర్ల దూరంలో ఉంది. తిరుపతికి వెళ్లి పనిచేసుకొని తిరిగి రావాలంటే రోజూ 36 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే!

# ఇల్లెంత దూరం!


కడప జిల్లా చెన్నూరు మండలంలో లబ్దిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు 7.5 కి.మీ దూరంలో ఎంపిక చేసిన భూమి

## ఎందుకీ మెలిక?

**పేదలకు** తాము నివసిస్తున్న చోటకాకుండా మరో చోట ఎందుకు ఇంటిస్థలాలు కేటాయిస్తామంటున్నారు? భూములు అందుబాటులో లేవా? లేక భూసేకరణ చేయడం లేదా? ఇంటిస్థలాల విషయంలో సర్కారు తొలి నుంచి నేలవిడిచిసాము చేయడమే ఈ పరిస్థితికి కారణమని ఈ ప్రశ్నలకు నిపుణులు సమాధానమిస్తున్నారు. ఒకేసారి 25 లక్షల మంది పేదలకు ఇంటిస్థలాలు ఇస్తామని సర్కారు గత ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, దాన్ని అమలు చేయడానికి రెవెన్యూశాఖ సమర్పించిన కార్యాచరణ నివేదిక మాత్రం ఆచరణలో తలకిందులైంది. పేదలందరికి భూములు ఇవ్వాలంటే ప్రభుత్వం వద్ద ఉన్న దానితోపాటు ప్రైవేటుగా 25వేల ఎకరాల భూమిని సేకరించాలని రెవెన్యూశాఖ సర్కారుకు సిఫారసు చేసింది. ఇందుకోసం రూ. 14వేలకోట్లపైనే వ్యయం అవుతుందని నివేదించింది. 'ఇంటిస్థలాలకోసం రూ. 14వేల కోట్లు అంటే భయపడతామా? పేదలకోసం ఆ మాత్రం ఖర్చుపెట్టలేమా?' అంటూ అధికారుల నివేదికలపై చిర్రుబుర్రులాడిన సర్కారు పెద్దలు.. రానురాను ఆ జోరును తగ్గించారు. భారం తగ్గించుకోవాలని, ప్రత్యామ్నాయాలపై దృష్టిపెట్టాలని రెవెన్యూశాఖకు పదేపదే చెబుతూ వస్తున్నారు. ఎక్కువగా ప్రభుత్వ భూములపై ఆధారపడాలని షరతు విధించింది. ఖరీదైన భూములు ముట్టుకోవద్దనేది అందులో మరో కండీషన్. ఎన్ని ప్రయత్నాలు చేసినా భూమి సమకూరడం లేదు. మరోవైపు లబ్ధిదారుల టార్గెట్ భారీగానే ఉంది. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఇస్తామన్న సెంటున్నర భూమి కాస్తా సెంటుకు మార్చారు. అది కూడా అందుబాటులో లేకుంటే, జీప్లస్3, జీప్లస్5 కింద ప్లాట్‌లు ఇస్తామన్నారు. వాటికి కూడా భూమి దొరకడం లేదు. అంటే, పట్టణాల్లో ప్రైవేటు భూములు లేక పోలేదు. ఖరీదైన వాటిని భూసేకరణ కింద తీసుకోలేకనే.. సర్దుబాటు వ్యవహారాలు తెరమీదకు తీసుకొస్తున్నారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇపుడు ఉంటున్నది ఒకచోట! ఉగాదికి స్థలం ఇస్తామంటున్నది ఎక్కడో ఇంకో చోట! అదికూడా... ఇల్లు కట్టుకుంటామంటేనే స్థలం ఇస్తారట! లేదంటే... స్థలం లేదు! స్థలం తీసుకోవాలనుకుంటే... ఇప్పటిదాకా అలవాటుపడి, జీవనోపాధి దొరుకుతున్న ప్రదేశాన్ని వదిలిపెట్టాలి! అలా కాకుండా... పనిని, ఉపాధిని కాపాడుకోవాలంటే స్థలాన్ని వదులుకోవాలి! ఇది ఇళ్ల పట్టాల విషయంలో ప్రభుత్వం పెట్టిన మెలిక! రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల... మరీ ముఖ్యంగా పట్టణాలు, నగర ప్రాంతాల్లో ప్రస్తుతం లబ్ధిదారులు ఉంటున్న చోటు నుంచి 10 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో స్థలాలు కేటాయిస్తున్నారు. 'స్థలం ఇచ్చినచోట నివసిస్తాం' అని లిఖితపూర్వక హామీ ఇస్తేనే 'పట్టా ఇస్తాం' అంటూ షరతులు పెడుతున్నారు. ఇక్కడ ఉండే తమకు ఎక్కడో స్థలాలు ఇస్తే ఏం చేసుకొంటామని పేదలు లబోదిబోమంటున్నారు.

### ఇదీ గ్రామం లెక్క...

రెవెన్యూశాఖ లెక్కల ప్రకారం, 17,310 రెవెన్యూ గ్రామాలకు గాను 10,760 పల్లెల్లోనే ఇంటిస్థలాలకు అవసరమైన భూమి ప్రభుత్వం వద్ద ఉంది. 6182 మేజర్ పంచాయితీలు, వాటి ఆవాసాల్లో ప్రభుత్వం వద్ద సెంటు భూమి కూడా లేదని తేల్చింది. ఈ గ్రామాల్లో పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలంటే ప్రైవేటుగా భూమి సేకరించాలి. సహజంగా ఇంటిస్థలాలు ఇచ్చేందుకు గ్రామం వెంట ఉండే భూములను సేకరిస్తారు. లేదంటే కనీసం గ్రామానికి కొంత దూరంలో ఉన్న భూములను ఎంపిక చేస్తారు. దీని వల్ల కొత్తగా ఇచ్చే ఇళ్లకు, గ్రామానికి మధ్య దూరం ఎక్కువగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

### ఇదీ పట్టణం పరిస్థితి

రెవెన్యూశాఖ అంచనాల ప్రకారం, 110 నగరాలు, పురపాలక సంస్థల పరిధిలో 66 ప్రాంతాల్లోనే ఇంటిస్థలాలు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం వద్ద భూములున్నాయి. 44 పట్టణాలు, పురపాలక సంస్థల పరిధిలో సర్కారు వద్ద సెంటు భూమిలేదు. ఇక్కడ ప్రైవేటుగా భూమి సేకరించాలి. అన్ని పట్టణ ప్రాంతాల్లో 4,774 ఎకరాలు అవసరమని తేల్చారు. ఈ భూమిని సేకరించడానికి భారీగా ఖర్చవుతుందని చెప్పి, పట్టణాలకు దూరంగా ఉన్న గ్రామాల్లోనే ఈ లబ్ధిదారులకు ఇంటి స్థలాలు సర్దుబాటు చేయాలని రెవెన్యూ అధికారులకు అమరావతి నుంచి పలు మార్గదర్శకాలు వెళుతున్నాయి. అక్కడ ఉంటామంటేనే పట్టాలు ఇస్తామని పేదలకు షరతులు పెట్టడం ఈ వ్యవహారంలో అసలుట్విస్టు!

➡ **చిత్తూరు జిల్లా** మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు ఆరు కిలోమీటర్ల దూరంలోని వలసపల్లె పంచాయతీలో పది ఎకరాలు గుర్తించారు. ఆ భూమిలో సమాధులున్నాయి. వాటిని మినహాయించి మిగిలిన భూమిని లే అవుట్‌గా మార్చేశారు.

➡ **కడప జిల్లా** రాయచోటి పట్టణ లబ్ధిదారులకు ఆరు కిలోమీటర్ల దూరంలో సంబేపల్లె మండలం ముద్దినేనివాండ్లపల్లె వద్ద స్థలాలు కేటాయిస్తున్నారు. అంత దూరం వెళ్లలేమని, పట్టణానికి ఆనుకొని భూ సేకరణ చేసి ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## ఊరొదిలి..

➡ **విశాఖ** జిల్లాలో 2.2 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో 1.78 లక్షల మంది నగరంలోనే ఉన్నారు. సగటున 20 నుంచి 45 కిలోమీటర్ల దూరంలో స్థలాలు ఇచ్చారు. గతంలో కేవలం పది కిలోమీటర్ల దూరంలో గృహాలు నిర్మించి ఇస్తేనే లబ్ధిదారులు అక్కడికి వెళ్లేందుకు ఇష్టపడలేదు. ఎక్కడెక్కడో ఇస్తామంటే వెళ్లబోమని ఇప్పుడూ స్పష్టం చేస్తున్నారు.

➡ **కర్నూలు** జిల్లా మహానంది మండలం బుక్కాపురం, అల్లీనగరం, శ్రీ నగరం గ్రామాల్లోని లబ్ధిదారులకు దాదాపు 5 కిలోమీటర్ల దూరంలోని ఎమ్.తిమ్మాపురంలో పట్టాలు కేటాయించారు. అది కూడా రహదారి వసతి లేని చోట! ఇదే జిల్లా గోకవరం గ్రామ లబ్ధిదారులకు ఏడు కిలోమీటర్ల దూరంలోని కొత్తపల్లిలో ఇంటిస్థలాలను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. స్థలం కోసం ఉన్న ఊరిని, ఉపాధి అవకాశాలను వదిలి వెళ్లాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

➡ **కర్నూలు** జిల్లా ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామంలో 2001లో టీడీపీ హయాంలో 83 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలను కేటాయించారు. 2012లో కాంగ్రెస్ హయాంలో ఆ పట్టాలను రద్దు చేసి ఒక్కొక్కరికి 1.5 సెంట్లు చొప్పున 168 మందికి మరోసారి పంపిణీ చేశారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆ పట్టాలను మళ్లీ రద్దు చేసి ఒక్కో లబ్ధిదారుడికి సెంటు స్థలం చొప్పున పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది.

➡ **పశ్చిమ గోదావరి జిల్లా** జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు 12 కిలోమీటర్ల దూరంలోవున్న తాడువాయి పంచాయతీ పరిధిలోని చల్లావారిగూడెం స్థలం కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకోసం సేకరించిన స్థలంలోనే 22 ఎకరాలను వీరికి ఇస్తున్నారు.

➡ **విశాఖ జిల్లా** నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో ప్రభుత్వానికి చెందిన విలువైన సుమారు రెండు ఎకరాల భూమిని ఇదే మండలంలోని ఓఎల్ పురం గ్రామస్థులకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చేందుకు లేఅవుట్ వేసి సిద్ధం చేశారు. కానీ... చెట్టుపల్లి పంచాయతీకి చెందిన 295 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పంచాయతీ కేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో కొండ ప్రాంతాన్ని గుర్తించారు. తమ గ్రామ పరిధిలోని విలువైన స్థలాన్ని మరో ఊరి వాళ్లకు ఇచ్చి... తమకు మాత్రం ఎక్కడో ఇస్తారా అని చెట్టుపల్లి పేదలు ప్రశ్నిస్తున్నారు.

➡ **గుంటూరు జిల్లాలో** అచ్చంపేట, పెదపాలెం, చిగురుపాడు, కస్తల గ్రామాలకు చెందిన 693 మంది లబ్ధిదారులకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో స్థలాలు ఎంపిక చేశారు.

➡ **తాడేపల్లి** పట్టణ, మండల పరిధిలో నివేశన స్థలాల లబ్ధిదారుల కోసం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంగళగిరి మండల పరిధిలోని నవులూరు గ్రామంలో స్థలాలు కేటాయించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. తాడేపల్లికి చెందిన పేదలు నిత్యం విజయవాడకు వెళ్లి, రోజువారీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారే ఎక్కువ. ప్రస్తుతం తమకు కేటాయిస్తున్న స్థలాల నుంచి జీవనోపాధికి విజయవాడ వెళ్లడం దూరాభారంగా మారుతుందని వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

➡ గుంటూరు నగరంలో నివసించే పేదలకు పది కిలోమీటర్ల దూరంలోని వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో జీ+3 భవనాలు కట్టించి ఇచ్చేందుకు భూసేకరణ తలపెట్టారు.

➡ దుగ్గిరాల మండలంలోని 1700 మందికి రాజధాని ప్రాంత గ్రామాల్లో స్థలాలు కేటాయించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు లబ్ధిదారులు అంగీకరించక పోవడంతో... ఇవి తీసుకోకపోతే ఇక ఎక్కడా స్థలం రాదని వారిని అధికారులు బెదిరిస్తున్నారు.

# రాత్రికి రాత్రే దున్నేశారు



### చేతికొచ్చిన పంట చదును

**పశ్చిమ** గోదావరి జిల్లా టి.నరసాపురంలో ఐదుగురు పేదలు మూడు ఎకరాలు పండించుకొంటున్నారు. బాగా పండిన మొక్కజొన్న వారిలో ఆశలు మొలిపించింది. ఆ భూములను అధికారులు సేకరించాలనుకొన్నారు. రైతులు లేని సమయం చూసి రాత్రికి రాత్రే పంటనంతా నాశనం చేశారు. నేలకు వాలిపోయిన తమ కష్టాన్ని చూసి రైతులు కన్నీరు మున్నీరయ్యారు. పొలమంతా రాలిపోయిన మొక్కజొన్న కండెలను పోలవరం వైసీపీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కు చూపించి రోదించారు. ముందుగా చెబితే పంటనైనా కాపాడుకొనేవారమని గొల్లుమన్నారు. సీఎం జగన్ దృష్టికి రైతుల సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మండిపడ్డారు.

### ఎకరం అసైన్డు తీసుకొన్నా...

# 40 మంది పేదలకు లబ్ధి

- ముందస్తుగా నోటీసు ఇచ్చినా రైతులతో మాట్లాడే నిర్ణయం
- 'పశ్చిమ' కలెక్టర్ ముత్యాలరాజు వ్యాఖ్యలు
- 'పసుపు-కుంకుమ భూములూ వదల్లేదు' కథనంపై మీడియాకు వివరణ
- బలవంతం లేదు.. ఇష్టంగా ఇస్తున్నారు
- కడప కలెక్టర్ శ్రీకాకుళం ఇన్‌చార్జి కలెక్టర్ల వెల్లడి

ఏలూరు, కడప, శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చట్టప్రకారం ఒక ఎకరం అసైన్డు భూమి తీసుకొన్నప్పటికీ, దానిని 40 మంది పేదలకు పంచి లబ్ధి చేకూర్చుతున్నామని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు అన్నారు. పేదల అసైన్డు భూములను స్థలాల సేకరణలో ఎందుకు తీసుకొంటున్నారని మీడియా ప్రశ్నించగా, కలెక్టర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పేదలకు పెట్టడానికి పేదలనే కొడుతున్నారని 'ఆంధ్రజ్యోతి' రాస్తే.. ఇప్పటిదాకా ప్రభుత్వం, అధికారులు ఖండిస్తూ వచ్చారు. అయితే, ముత్యాలరాజు వ్యాఖ్యలు పేదలపై వేటగా మారిన స్థలాల సేకరణ మారిందన్న విషయాన్ని పరోక్షంగా అంగీకరించడం గమనార్హం. 'పసుపు-కుంకుమ భూమినీ వదల్లేదు' శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వచ్చిన కథనంపై శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన స్పందించారు. అలాగే, పేదల స్థలాల తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురిస్తున్న వరుస కథనాల నేపథ్యంలో కడప కలెక్టర్ సి.హరికిరణ్, శ్రీకాకుళం ఇన్‌చార్జి కలెక్టర్ కె. శ్రీనివాసులు కూడా స్పందించారు. తణుకు సమీపాన ఉన్న పైడిపర్రులో పసుపు-కుంకుమ భూముల సేకరణ వ్యవహారంపై పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు స్పందిస్తూ.. అక్కడ నోటిఫికేషన్ ఇచ్చామని, ఇప్పుడు రైతులే ముందుకు వచ్చి మాట్లాడుతున్నారని చెప్పారు. "పైడిపర్రు గ్రామంలో రైతులకు చెప్పకుండానే నోటిఫికేషన్ జారీ చేశామనడం సరికాదు. ప్రజావసరాల దృష్ట్యా ముందస్తుగా నోటిఫికేషన్ ఇచ్చినా, రైతులతో చర్చించే తుది నిర్ణయాలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం వారికి పరిహారం చెల్లించే విషయంలో చర్చిస్తున్నాం. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో గుర్తించిన అసైన్డు భూములను మాత్రమే స్వాధీనం చేసుకుంటున్నాం. ఇదే గ్రామానికి చెందిన గోళ్ల సుబ్బలక్ష్మికి చెందిన 92 సెంట్ల భూమిని స్వాధీన పరుచుకోలేదు" అని వివరించారు. అలాగే, పైడిపర్రులో రైతులకు 56 లక్షలు చొప్పునే చెల్లించేందుకు ఒత్తిడి చేస్తున్నామనడం కూడా సరికాదని, అసైన్డు భూముల వ్యవహారంలో తగిన చట్ట పరిధిలోనే భూమిని స్వాధీనం చేసుకుంటున్నామే తప్ప ఎవరినీ వేధించడం, ఒత్తిడి చేయడం తమ లక్ష్యం కాదన్నారు. కాగా, గతంలో ఇంటి పట్టా తీసుకొని ఉంటే అదే స్థలంలో వారికే ఇంటి పట్టాలు ఇస్తామని కడప జిల్లా కలెక్టర్ సి.హరికిరణ్ పేర్కొన్నారు. "తండ్రి పట్టాలిస్తే.. తనయుడు లాగేసుకుంటున్నాడు" శీర్షికన ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. "గత ప్రభుత్వాలు పేదలకు పట్టాలిచ్చినా ఇప్పటికీ అవి ఖాళీగానే ఉన్నాయి. తెలిసోతెలియక ప్రజలు ప్రభుత్వ ఇంటి పట్టా కొనుగోలు చేసి ఉంటే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం వాటిని క్రమబద్ధీకరిస్తున్నాం. అంతేగానీ ఎవరి ఇంటి పట్టా లాక్కోవడం లేదు" అని వివరించారు. కాగా, పేదలకు స్థలాల సేకరణలో భాగంగా ఎక్కడా బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోలేదని, జిరాయితీ భూములు కల్గిన రైతులు స్వచ్ఛందంగానే వాటిని ఇచ్చారని శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు.

### భూమి లాగేసుకుంటున్నారని...



పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి శివారు లింగారెడ్డిగూడేనికి చెందిన కొరపాటి అన్నమ్మ వయసు 60. 40 ఏళ్లుగా సాగే ఆమెకు తెలిసిన జీవితం. తాను సాగు చేస్తున్న అసైన్డు భూమి స్థలాల సేకరణలో పోతున్నదని తెలుసుకొని.. అన్నమ్మ తట్టుకోలేకపోయింది. గురువారం రాత్రి తీవ్ర గుండెపోటుకు గురయి మరణించింది. అన్నమ్మకు గతంలో ఎకరన్నర అసైన్డు భూమిని ప్రభుత్వం కేటాయించింది. బోరు కూడా మంజూరు చేసింది. ఆ భూమిలో ఆమె ఏటా వరివేస్తోంది. ఆ భూమిని తన కుమార్తెలకు పసుపు-కుంకుమ కింద ఇచ్చింది. ఈ వయసులోనూ ఆ పొలంలో పనులు చేస్తోంది. గురువారం రెవెన్యూ అధికారులు వచ్చి నోటీసులు ఇచ్చారు. పొలం కొలతలు వేసుకుని వెళ్లారు. అన్నమ్మ ఎంత బతిమాలినా అధికారులు వినిపించుకోలేదని తోటి మహిళా రైతులు వాపోయారు. తన పొలం కూడా సేకరణలో పోవడంతో అదే ప్రాంతానికి చెందిన కొరపాటి నవరత్నం మంచం పట్టింది.

### మా భూమే కనిపించిందా?



"మాకు ఎకరం పొలం ఉంది. సీజన్లో వ్యవసాయ పనులు, ఖాళీ సమయాల్లో ఇతర ఉపాధి పనులు చేసుకుంటాం. అలాంటి మా మా భూమే అధికారులకు కనిపించిందా? ఇది చాలా అన్యాయం"

**– బి.ఈశ్వరమ్మ, బాధిత రైతు, విజయనగరం మండలం**

### ఇది తగునా?



"నాకు ఎకరం పొలం ఉంది. కూరగాయలు, అరటి సాగుచేస్తున్నాను. ఈ ఏడాది రూ.50 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. కళ్లెదుటే పక్వానికి వచ్చిన పంటను నాశనం చేశారు. అధికారులకు ఇది తగునా? మా ఉసురు ప్రభుత్వానికి తగులుతుంది"

**– ఎ.రామమ్మ, రాకోడు, విజయనగరం జిల్లా**

### పరిహారం అందిస్తాం..

"ఐదు ఎకరాల్లో మూడు ఎకరాలు రైతుల నుంచి సేకరిస్తున్నాం. మిగతాది రైతులు సాగుచేస్తున్నా.. రెవెన్యూ రికార్డుల్లో గెడ్డ పోరంబోకుగా ఉంది. సేకరిస్తున్న మూడు ఎకరాలకు మాత్రం పూర్తిస్థాయిలో పరిహారం అందిస్తాం. సాగులోని భూమికీ డబ్బులిస్తాం"

**– రవికుమార్, ఆర్ఐ, విజయనగరం**

# బాబు సర్కార్‌పై సిట్

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈ అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని స్పీకర్ కూడా ప్రభుత్వాన్ని ఆదేశించారని గుర్తు చేశారు.

### 'సిట్'కు దిశా నిర్దేశం...

సిట్ పనితీరు - విధి విధానాలను కూడా జీవోలో పొందుపరిచారు. దీనిప్రకారం... సిట్ అధికారులు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) ప్రకారం ఆయా అంశాలపై విచారణ చేయవచ్చు. కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేయవచ్చు. అలాగే... సంబంధిత సమాచారాన్ని అవసరమైతే రాష్ట్ర - కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో పంచుకోవడంతోపాటు సమన్వయం చేసుకోవాలి. అంతేకాదు... తాము దర్యాప్తు చేస్తున్న అంశానికి సంబంధించి ఏ వ్యక్తినైనా, అధికారినైనా పిలిపించుకుని, వారి వాంగ్మూలం రికార్డు చేసుకునే అధికారం కూడా సిట్‌కు ఉంటుంది. ఇక... ఆయా అంశాలకు సంబంధించిన ఎలాంటి రికార్డులనైనా తెప్పించుకుని పరిశీలించవచ్చు. సిట్‌కు అన్ని శాఖలు, అందరు అధికారులు సహకరించాల్సిందే. ఇదే జీవోలో 'పోలీసు స్టేషన్' ప్రస్తావన కూడా తీసుకొచ్చారు. 'సిట్'నే ఒక పోలీసు స్టేషన్‌గా పరిగణిస్తారని స్పష్టం చేశారు.

### 'సిట్' స్టాండ్ ఏమిటి?

సాధారణంగా ఒక సంచలన సంఘటన, విస్తృతమైన పరిధి ఉన్న అంశంపై సమగ్రమైన, ప్రత్యేక దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేస్తుంటారు. ఉదాహరణకు.... వైఎస్ వివేకానంద రెడ్డి హత్యపై పోలీసు అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. విశాఖ భూముల లావాదేవీలపైనా సిట్ వేశారు. ఇందులో భూములతోపాటు మోసం, నేరాల కోణం కూడా ఉండటంతో రెవెన్యూతోపాటు పోలీసు అధికారులను నియమించారు. కానీ... ఇప్పుడు నిర్దిష్టంగా ఒక్క అంశంపై కాకుండా, 'హోల్‌సేల్'గా ఐదేళ్ల కాలంలో తీసుకున్న అన్ని కీలక నిర్ణయాలపై సిట్ వేయాలని నిర్ణయించడంపై అధికార వర్గాల్లోనే విస్మయం వ్యక్తమవుతోంది. పైగా... సిట్ అధిపతితోపాటు సభ్యులందరూ పోలీసు విభాగానికి చెందిన వారే. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 50కి పైగా విభాగాలు తీసుకున్న నిర్ణయాల్లో లోటుపాట్లపై వీరు దర్యాప్తు చేయడం సాధ్యమేనా? పాలనా నిర్ణయాల్లో లోటుపాట్లపై వీరికి అవగాహన ఏముంటుందని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

## 'టార్గెట్' కోసమేనా..

(మొదటి పేజీ తరువాయి)

సలహాదారుగా ఉన్న అజేయ కల్లం లాంటి వారిని డీఐజీ ర్యాంకు అధికారి పిలిపించడం సాధ్యం కాదని... తాము టార్గెట్‌గా పెట్టుకున్న 'కొందరు' వ్యక్తులను విచారణ ముందు నిలబెట్టి, ఇరుకున పెట్టేందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సిట్ ఏర్పాటు ఉత్తర్వును శుక్రవారం సాయంత్రమే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినప్పటికీ రాత్రి 9 గంటల వరకు దాన్ని రహస్య జీఓగా ఉంచారు. ఆ తర్వాతే విషయాన్ని బయటపెట్టారు. ఏ అంశంపై నియమించిన సిట్ అయినా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. అంతటితో దాని బాధ్యత పూర్తవుతుంది. నివేదికపై తదుపరి చర్యలు ప్రభుత్వమే తీసుకుంటుంది. కానీ... ఈ సిట్‌కు ప్రత్యేకంగా 'పోలీసు స్టేషన్' హోదా కల్పించడం గమనార్హం. దీని ఉద్దేశం ఏమిటనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

# కులానికో సొసైటీ

- బీసీల్లో సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వ యోచన
- రాష్ట్రంలో ఇప్పుడున్నవి 11
- కొత్తగా మరో 41 ఏర్పాటుకు సన్నాహాలు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీసీల్లో దాదాపు ప్రతి కులానికి ఒక సహకార ఆర్థిక కార్పొరేషన్, అభివృద్ధి సొసైటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. గత ప్రభుత్వం బీసీలకు 11 సమాఖ్యలను ఏర్పాటు చేసింది. బీసీల్లోని ప్రధాన కులాలతోపాటు, మరికొన్నిటిని ఒక్కో గ్రూప్‌గా చేసి ఈ సమాఖ్యల ద్వారా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది.

ఇప్పుడు ఆ 11కు జతగా మరో 41 సొసైటీలను ఏర్పాటు చేయాలని వైసీపీ ప్రభుత్వం ఆలోచిస్తోంది. త్వరలోనే దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటారని సమాచారం. రజక, యాదవ, తూర్పుకాపు, మత్స్యకార, నాయీ బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణ, గౌడ, కుమ్మరి శాలివాహన తదితర సహకార ఆర్థిక కార్పొరేషన్లు గతంలోనే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా కలింగ కోమటి, రెడ్డిక, జంగం, దేవాంగ, తొగట, కుర్మి, పోలినాటి వెలమ, కృష్ణ బలిజ, మేదర, ఆరెకటిక, పెరిక, కుంచిటి వక్కలిగ, సూర్య బలిజ, ముదలియార్, చట్టదాసరివైష్ణవ, శిష్ట కరణాలు, కూరాకుల, ఆర్యక్షత్రియ, అయ్యారక, అతిరాస్, దాసరి, యాట, శ్రీశయన తదితర కులాలతోపాటు, వాటి ఉప కులాలను చేర్చి ఈ సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో బీసీలు ఏ కులంలో ఎంతమంది ఉన్నారన్న వివరాలు ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. త్వరలోనే ముఖ్యమంత్రి జగన్ ఈ సొసైటీల ఏర్పాటుపై ఒక నిర్ణయం తీసుకోనున్నారని తెలిసింది.

# 26న రాష్ట్ర కేబినెట్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 26వ తేదీన జరగనుంది. ఈ నెల 12న (రెండో బుధవారం) సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో స్థానిక ఎన్నికల సంస్కరణలపై ప్రధానంగా చర్చ జరిగింది. మద్యం, డబ్బు పంపిణీ వంటి ప్రలోభాలకు అభ్యర్థులెవరైనా పాల్పడితే.. ఎన్నికల సమయంలోనూ.. ఎన్నికల తర్వాతా అనర్హుడిగా ప్రకటించేలా ఆర్డినెన్సు తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్డినెన్సు కూడా ఇచ్చారు. స్థానిక ఎన్నికల తర్వాతే బడ్జెట్ సమావేశాలను నిర్వహిద్దామని మంత్రులకు సీఎం ఆ సందర్భంగా చెప్పారు. కానీ ఇప్పుడు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ.. రిజర్వేషన్లకు సంబంధించి హైకోర్టు ఇచ్చే తీర్పుపై ఆధారపడి ఉండడంతో.. 26న జరిగే కేబినెట్‌లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనన్న ఆసక్తి నెలకొంది.

# దుబాయ్‌లో ఘనంగా శివరాత్రి





మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా భక్తులు పూజలు చేశారు. అమృత్‌సర్‌లో శివలింగానికి పాలాభిషేకం చేశారు. లఖ్‌నవూలో 'శివ బరాత్' తీశారు. థానేలోని కోపినేశ్వర్ దేవాలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్‌లో ఓ మహిళ నాలికపై మండుతున్న కర్పూరం పెట్టుకొని భక్తిని చాటుకుంది. శ్రీనగర్‌లోని శంకరాచార్య దేవాలయంలో భక్తులకు భారీ భద్రత కల్పించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్.. గోరఖ్‌నాథ్ మఠంలో అభిషేకం నిర్వహించారు. జమ్మూలో భక్తులు శివుడి ప్రసాదంగా 'భంగ్ ఘోటా' స్వీకరించారు. వారాణసీలో శివుడి దర్శనానికి భక్తులు భారీ క్యూ కట్టారు. దుబాయిలోని హవేలీ ప్రాంగణం జనసంద్రమైంది. దుబాయిలోని ఏకైక హిందూ ఆలయం శివమందిర్ భక్తులతో కిక్కిరిసింది. పెద్ద సంఖ్యలో వచ్చిన తెలుగువారు పూజల కంటె సెల్ఫీల్లోనే ఎక్కువగా గడిపారు.

## కోటి మందితో నాకు స్వాగతం

**›› మోదీ నాకు చెప్పారు: ట్రంప్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: తొలిసారి భారత పర్యటనకు వస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన కోసం జరుగుతున్న స్వాగత సంరంభం గురించి చాలా ఊహించుకొని మురిసిపోతున్నారు! అహ్మదాబాద్‌లో 70 లక్షల మంది తనకు స్వాగతం పలుకుతారని మొన్న ఉత్సాహంగా చెప్పిన ఆయన... ఆ సంఖ్యను ఇప్పుడు కోటికి పెంచేశారు. పైగా అంతమంది వస్తారని ప్రధాని మోదీయే తనతో చెప్పారని గురువారం కొలరాడోలో జరిగిన ప్రచార సభలో తెలిపారు. అంతేకాదు, అహ్మదాబాద్‌లో జరిగే 'నమస్తే ట్రంప్' కార్యక్రమం తనను చెడగొడుతుందని కూడా ఆయన చెప్పుకొన్నారు. ఎందుకంటే... కోటి మంది హాజరయ్యే కార్యక్రమం చూశాక, అమెరికాలో 60వేల మంది హాజరయ్యే సభలు తనను సంతృప్తిపర్చలేవని అన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను అంతా ఆయన భ్రమ అంటూ నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు.

### 150 కోట్ల మంది ప్రతినిధిగా ఫేస్‌బుక్‌లో మోదీకి అడ్వాంటేజ్

ఫేస్‌బుక్ ఫాలోవర్ల సంఖ్య విషయంలో తానే 'నంబర్ వన్', ప్రధాని మోదీ 'నంబర్ టూ' అని ట్రంప్ మరోసారి గొప్పగా చెప్పుకొన్నారు. భారత్‌లో జనాభా ఎక్కువగా ఉండడం మోదీకి కలిసివచ్చిందని వ్యాఖ్యానించారు. "మీకు 150 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. నాకు 35 కోట్ల మంది ఉన్నారు. మీకు అడ్వాంటేజ్ ఉంది" అని మోదీతో చెప్పానన్నారు. నిజానికి ఫేస్‌బుక్‌లో మోదీకి 4.40 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా, ట్రంప్‌కు 2.70 లక్షల మంది మాత్రమే ఉన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుతం భారత్ జనాభా 130 కోట్లు. అమెరికా జనాభా 32.5 కోట్లు.

### అమెరికాను భారత్ తీవ్రంగా దెబ్బతీస్తోంది: ట్రంప్

భారత్ చాలా ఏళ్లుగా అధిక సుంకాలతో తమ దేశ వాణిజ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. భారత్ విధిస్తున్న సుంకాలు ప్రపంచంలోనే ఎక్కువని అన్నారు. సోమవారం భారత్ పర్యటనకు వెళుతున్న తాను వాణిజ్య విషయాలు, అమెరికా ఉత్పత్తులకు మద్దతుపై ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని తెలిపారు. నిజంగానే మోదీ అంటే తనకు చాలా అభిమానమని మళ్లీ చెప్పారు. కొలరాడోలో 'కీప్ అమెరికా గ్రేట్' సభలో వేలాది మంది మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. కాగా.. ఆయనతో పాటు ఆయన కుమార్తె ఇవాంకా ట్రంప్, అల్లుడు జారెడ్ కుష్నర్ కూడా భారత్ పర్యటనకు రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

### అనామక సంస్థ ఆధ్వర్యంలో 'నమస్తే ట్రంప్' నిర్వహణ

డొనాల్డ్ ట్రంప్ నాగరిక్ అభినందన్ సమితి (డీటీఎన్ఏఎస్)... ఈ పేరు ఎప్పుడైనా విన్నారా? విదేశాంగ శాఖ తప్ప ఎవరికీ తెలిసి ఉండదు. ఎందుకంటే కనీసం అడ్రస్ కూడా లేని ఈ సంస్థే అహ్మదాబాద్‌లో 'నమస్తే ట్రంప్' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎవర్ని ఆహ్వానించాలో ఈ సమితే నిర్ణయం తీసుకుంటుందని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్‌కుమార్ తెలిపారు. ఈ సమితికి అడ్రస్ లేకపోవడమే కాదు ఆన్‌లైన్‌లోనూ దాని జాడ కనిపించడం లేదు. గూగుల్‌లో వెతికినా ఓ పట్టాన దొరకదు. సోషల్ మీడియా హ్యాండిల్స్ లేవు. నమస్తే ట్రంప్ కార్యక్రమానికి ఎవర్ని ఆహ్వానిస్తారనే విషయంపైనా ఇంకా స్పష్టత లేదు. ఇదిలా ఉండగా, ట్రంప్ పర్యటన షెడ్యూల్‌లో ప్రతిపక్ష బృందంతో భేటీ లేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

## మహా రామాలయం ఎత్తు 160 అడుగులు!



**›› 125 నుంచి పెంచాలని యోచన**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: అయోధ్యలో మహా రామ మందిర నిర్మాణం వచ్చే ఆరు నెలల్లోగా మొదలుకావొచ్చని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు నృత్య గోపాల్ దాస్ చెప్పారు. ప్రస్తుతం రాముణ్ని కొలుస్తున్న చోటే ఆలయం ఉంటుందని, వీహెచ్‌పీ నమూనాయే ప్రాతిపదికని శుక్రవారం గ్వాలియర్‌లో ప్రకటించారు. కాగా- ఆలయం ఎత్తును 125 అడుగుల నుంచి 160 అడుగులకు పెంచాలని తాజాగా ప్రతిపాదిస్తున్నారు. గతంలో రెండు అంతస్తుల మేర వర్తులాకార నిర్మాణం ఉండాలని నిర్ణయించిన రూపశిల్పులు- ఇపుడు మరో అంతస్తు వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. "వీహెచ్‌పీ రూపొందించిన నమూనా ఇప్పటికే ప్రజల్లో పాపులర్ అయింది. దీన్నే తీసుకుంటాం. అయితే ఎత్తు, అంతర నిర్మాణాల్లో మార్పులు, చేర్పులు తప్పనిసరి" అని ట్రస్ట్ సభ్యుల్లో ఒకరైన స్వామి గోవింద్ దేవ్ గిరి చెప్పారు. "మూడంతస్తులుండాలని అంతా భావిస్తున్నారు. దీనికి తోడు 35-అడుగుల ఎత్తయిన శిఖరంతో కూడిన మంటపం కూడా నిర్మించాలన్నది ప్రతిపాదన" అని మరో సభ్యుడు తెలిపారు. ఆలయ నమూనా, ఎత్తు, నిర్మాణ ప్రక్రియకు సంబంధించి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నృపేంద్ర మిశ్రా త్వరలోనే నిపుణులతో చర్చిస్తారని ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. ఎప్పట్నుంచి నిర్మాణం మొదలవ్వాలన్నది కూడా ఆయనే చర్చించి ఓ అవగాహనకు వస్తారని వెల్లడించాయి. బహుశా ఆయన దానిని కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి తెలియపరచవచ్చని అంటున్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని వస్తారా రారా అన్నది ఖరారు కాకపోయినా, ఈ కార్యక్రమానికి ఓ నిర్దిష్ట ప్రణాళిక ఉంటుందని మాత్రం తెలుస్తోంది. వీహెచ్‌పీ ఆకృతి ప్రకారం... ఆలయం పొడవు 270 అడుగులు, వెడల్పు 135 అడుగులు, ఎత్తు 125 అడుగులు. ప్రతీ అంతస్తులో 106 స్తంభాలు, వాటిని ఆనుకుని 185 రాతి దూలాలు. తలుపులన్నీ చెక్కతో చేసి చలువ రాతి ఫ్రేములకు బిగిస్తారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రాముడి విగ్రహం, మొదటి అంతస్తులో రామ దర్బారు ఉండాలని నమూనా చెబుతోంది. మొత్తం ఐదు ప్రవేశ ద్వారాలుంచాలని నిశ్చయించారు. సింహద్వారం, నృత్య మంటపం, రంగ మండపం, పూజా కక్ష్య, గర్భ గుడి మొదలైనవాటికి నిర్దుష్టంగా రూపకల్పన చేశారు.



ప్రధాని మోదీతో సమావేశమైన రామాలయ నిర్మాణ ట్రస్టు సభ్యులు

### ప్రధాని దిశా నిర్దేశం

రామాలయ నిర్మాణ ట్రస్ట్ సభ్యులు గురువారం రాత్రి ప్రధానితో సమావేశమైనపుడు.. ఎటువంటి వివాదాలు, గొడవలకు తావులేకుండా సామరస్యంగా, ప్రశాంతంగా ఆలయ నిర్మాణం సాగాలని ఆయన స్పష్టం చేశారు. శంకుస్థాపన ఆర్భాటంగా సాగరాదన్నది మరో ఆదేశం. దేశంలో మతసామరస్యం దెబ్బతినే ఏ చర్యా తీసుకోరాదని, ప్రజల మధ్య అశాంతిని రేపరాదని తేల్చిచెప్పారని ట్రస్ట్ ప్రధానకార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు.

## అయోధ్య ప్రత్యామ్నాయ స్థలానికి ఓకే

**యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు అంగీకారం**

లఖ్‌నవూ, ఫిబ్రవరి 21: అయోధ్యలో బాబ్రీ మసీదు స్థలానికి ప్రతిగా వేరేచోట ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల భూమిని తీసుకోవడం తమకు సమ్మతమేనని యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు ప్రకటించింది. వివాదాస్పద స్థలం రాముడికే చెందుతుందంటూ నవంబరు 9న తీర్పు వెలువరించిన సుప్రీం కోర్టు అదే సమయంలో ముస్లిం కక్షిదారులకు (సున్నీ వక్ఫ్ బోర్డుకు) ఐదెకరాల భూమిని ఇవ్వాలని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. దీంతో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఈ బోర్డుకు అయోధ్యకు 18 కిలోమీటర్ల దూరంలో లక్నో హైవేపై ఉన్న ధనిపూర్ అనే గ్రామం వద్ద ఆ భూమిని కేటాయించింది. దీనిని తిరస్కరించాలని కొన్ని ముస్లిం సంస్థలు, పర్సనల్ లా బోర్డు సున్నీలను కోరాయి. అయితే సున్నీ బోర్డు అందుకు అంగీకరించలేదు. "ఈ భూమిని తిరస్కరించలేం. దీనిని తీసుకోవడం మినహా మాకు మరో మార్గం లేదు. తీసుకోకుంటే అది కోర్టు ధిక్కార నేరం కిందకు వస్తుంది. మా వైఖరిలో మార్పులేదు. ఆ ఐదెకరాలూ ఎలా వినియోగించుకోవాలన్నది సోమవారం జరిగే బోర్డు సమావేశంలో నిర్ణయించుకుంటాం" అని సున్నీ బోర్డు నేత ఫరూకీ తెలిపారు.



## నగర ఆహారంలో కొవ్వు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: మెట్రో నగరాల్లో ప్రజలు కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తింటున్నారట. ఢిల్లీ, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై నగరాల్లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నిర్వహించిన సంయుక్త సర్వేలో ఈవిషయం వెల్లడైంది. రోజూ తినే ఆహారంలో 20 గ్రాముల కొవ్వే ఉండాలి. అయితే ఈ నగరాల్లో సగటున 32.6 గ్రాముల కొవ్వు పదార్థాలను తింటున్నారని గుర్తించారు.



## పర్దాపై నా కూతురికి స్వేచ్ఛనిచ్చాం: రెహ్మాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: తన కుమార్తె ఖతీజ, స్త్రీవాద రచయిత్రి తస్లీమా నస్రీన్‌ల మధ్య నడుస్తున్న పర్దా వివాదంపై ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ తొలిసారి స్పందించారు. "ఏది మంచో, ఏది చెడో తెలుసుకునేవిధంగా మా పిల్లలను పెంచాము. వాళ్ల ఇష్టప్రకారం నడుచుకునేలా స్వేచ్ఛనిచ్చాము" అని ఆయన స్పష్టంచేశారు. ఖతీజ బుర్ఖా వేషధారణ తనకు బాధ కలిగిస్తోందని తస్లీమా వ్యాఖ్యానించడంతో ఈ వివాదం చెలరేగింది.



## గుంజీలు తీస్తే ప్లాట్‌ఫాం టికెట్ ఉచితం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 : అది ఢిల్లీలోని ఆనంద్ విహార్ టెర్మినల్ రైల్వే స్టేషన్. ఈ స్టేషన్‌లో అమర్చిన ఓ కియోస్క్ ముందు 3 నిమిషాల్లో 30 గుంజీలు తీసి ఉచితంగా ప్లాట్‌ఫాం టికెట్ పొందొచ్చు. నిర్దేశించిన సమయంలో గుంజీలు తీయడం పూర్తవగానే మెషీన్ నుంచి టికెట్ బయటకు వస్తుంది. దీనికి 'ఫిట్ ఇండియా స్క్వాట్ మెషీన్' అని పేరు పెట్టారు. ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన కలిగించడానికి దీనిని ఏర్పాటు చేశారు.



## చైనా జైళ్లకూ పాకిన కొవిడ్-19

**›› 500 మందికి పైగా ఖైదీలకు వైరస్**

**›› మా వైపు నుంచి ఆలస్యమేమీ లేదు**

**›› భారత్ విమానానికి అనుమతిపై చైనా**

బీజింగ్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: చైనావ్యాప్తంగా పలు జైళ్లలో 500 మందికిపైగా ఖైదీలకు కొవిడ్-19 వైరస్ సోకినట్టు అధికారులు గుర్తించారు. చైనా తర్వాత అత్యధిక కొవిడ్-19 కేసులు జపాన్ తీరంలోని నౌకలో నమోదయ్యాయి. కాగా.. చైనాలో కొత్తగా 889 కొవిడ్-19 కేసులు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ వైరస్ కారణంగా ఇప్పటిదాకా 2247 మంది చనిపోయారు. వైరస్ బారిన పడినవారి సంఖ్య 76,700కు చేరింది. వూహాన్‌లో కొవిడ్-19 పేషంట్లకు చికిత్స చేసేందుకు తన పెళ్లినే వాయిదా వేసుకున్న పెంగ్ (29) అనే యువవైద్యుడు చివరకు ఆ వైరస్‌కే బలైపోయాడు. ఇరాన్‌లో కొవిడ్-19 కారణంగా ఇద్దరు చనిపోయారు. దక్షిణ కొరియాలో వైరస్ బాధితుల సంఖ్య 204కు చేరింది. ఈ వైరస్ సోకిన ఒక వృద్ధురాలు స్థానిక చర్చిలో ప్రార్థనలు చేయడానికి వెళ్లినప్పుడు ఆమె ద్వారా చాలా మంది ఈ వైరస్ బారిన పడినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు.. చైనా నుంచి స్వదేశానికి తరలివచ్చిన 45 మంది ఉక్రెయిన్ వాసులకు చేదు అనుభవం ఎదురైంది. వారిని దేశంలోకి అడుగుపెట్టనివ్వొద్దంటూ పలువురు ఆందోళనలకు దిగారు. అమెరికాలో కూడా కరోనా పేరుతో ఆసియన్లపై విద్వేష దాడులు జరుగుతున్నాయి. కాగా.. కొవిడ్-19 విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ సూచించారు. ఇక.. చైనాలో మిగిలిపోయిన 80 మంది భారతీయులను తరలించడానికి పంపుతున్న సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానానికి అనుమతులు ఇవ్వడంలో తమవైపు నుంచి ఆలస్యమేమీ లేదని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. కొవిడ్-19కు వ్యాక్సిన్ కనుగొనేందుకు చైనా కుబేరుడు.. అలీబాబా వ్యవస్థాపకుడు జాక్‌మా.. కొలంబియా యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందు కోసం జాక్ మా ఫౌండేషన్ నుంచి రూ.15 కోట్లు వెచ్చించనున్నారు.

### తగ్గిన నివారణ చాన్స్ : డబ్ల్యూహెచ్‌వో

జెనీవా, ఫిబ్రవరి 21: కరోనా వైరస్ నివారణకు గల అవకాశాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయని, అంతర్జాతీయ సమాజం ఇప్పటికైనా కలిసి రాకుంటే పరిణామాలు ఊహాతీతంగా ఉంటాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అధ్యక్షుడు టెడ్రస్ అధనోం గ్రేబియేసస్.. జెనీవాలో జరిగిన ఓ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు.

## మార్క్సిస్టుల లౌకికం!

**›› ఆలయ కమిటీల్లో సెక్యులరిస్టులు ఉండాలని వాదన**

కోల్‌కతా, ఫిబ్రవరి 21: నిరీశ్వరవాదులుగా ఉండే మార్క్సిస్టులు ఇప్పుడు దేవుడివైపు చూస్తున్నారు. దేశంలో 'విస్తరిస్తున్న రాజకీయ విషసంస్కృతిని ఎదుర్కోడానికి' తాము కూడా ఆలయాలు, ఇతర మతాల ప్రార్థనాస్థలాల కమిటీల్లోకి ప్రవేశించాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని పార్టీవాదులకు సర్క్యులేట్ చేసిన ఓ నివేదికలో వెల్లడించారు. ఆలయ వ్యవహారాలను ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు నియంత్రిస్తున్నాయన్నది సీపీఎం అభిప్రాయం. హిందూ ధర్మం పేరిట సంఘ్ సంస్థలు తమ ఎజెండాను ఆలయ సంప్రదాయాల్లోకి చొప్పిస్తున్నాయని, తద్వారా చాపకింద నీరులా హిందూత్వ భావజాలం అన్నిటా వ్యాపిస్తోందని మార్క్సిస్టులు నమ్ముతున్నారు. దీన్ని అడ్డుకోవడానికి ఆలయ కమిటీల్లో లౌకికవాదులకు చోటు కల్పించాలని, తద్వారా బీజేపీ, సంఘ్‌ల ప్రభావాన్ని తగ్గించవచ్చనీ సీపీఎం భావిస్తోంది.. "దైవానుకూలంగా వ్యవహరించడం వల్ల పార్టీకి ఉన్న ప్రగతిశీల ఇమేజి కూడా ఇనుమడిస్తుంది. భారీగా ప్రజలు హాజరయ్యే ప్రదేశాలను, సామాజిక సంరంభాలను మేం ప్రజలకు చేరువయ్యేందుకు ఉపయోగించుకుంటూనే వచ్చాం. గతంలో కేరళలో దీనిని అమలు చేశాం. దేశంలో ఇపుడు బీజేపీ, సంఘ్ మతమౌఢ్యాన్ని విస్తరిస్తూ, సమాజంలో చీలికలు తెస్తూ, ఫాసిస్టు భావాలను ప్రోత్సహిస్తోంది. వీటిని అడ్డుకోడానికి ఇలాంటి చర్యలు అవసరమే" అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎంపీ మొహమ్మద్ సలీం చెప్పారు. మసీదులు, గురుద్వారాలు, చర్చిల కమిటీల్లోనూ లౌకిక భావాలున్నవారుండేట్లు చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు.

## ముస్లింలను పాక్‌కు పంపనందుకు భారీ మూల్యం

**నిర్వాసిత ముస్లింయేతరుల కోసమే ఎన్నార్సీ: గిరిరాజ్ సింగ్**



పట్నా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ సంచలన వాఖ్యలు చేశారు. దేశ విభజన సమయంలో ముస్లింలను పాకిస్థాన్‌కు పంపించనందుకు, హిందువులను భారత్‌కు రప్పించేందుకు భారత్ భారీ మూల్యం చెల్లిస్తోందని అన్నారు. గురువారం రాత్రి పట్నాలో మీడియాతో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ నుంచి నిర్వాసితులైన ముస్లింయేతర శరణార్థులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకే సీఏఏని తీసుకొచ్చామన్నారు. కాగా, గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యలను బీజేపీ మిత్రపక్షం ఎల్‌జేపీ తీవ్రంగా ఖండించింది.

## కర్ణాటకలోనే ఎందుకో?

**›› 'పాక్ జిందాబాద్' నినాదాలు**



బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్సీ, సీఏఏ అమలుకు సిద్ధం కాగా దేశంలో ఎక్కడాలేని విధంగా కర్ణాటకలోనే పాకిస్థాన్ జిందాబాద్... అనే నినాదాలు నిత్యకృత్యమయ్యాయి. దీంతో యడ్డీ సర్కారు ఇలాంటి వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. కాగా పాక్ అనుకూల నినాదాలు చేసిన అమూల్య చర్యను ఆమె తండ్రి తీవ్రంగా ఖండించారు. తన కుమార్తె చేసిన తప్పు క్షమించరానిదని, ఆమెను చట్టప్రకారం శిక్షించాలని కోరారు. సీఎం యడియూరప్ప స్పందిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే అమూల్య వ్యాఖ్యల వెనుక ఉద్దేశమన్నారు.

## గుంపుగా పిలిచి.. నగ్నంగా నిలబెట్టి..

**›› గుజరాత్‌లో యువతులకు ఫిట్‌నెస్ పరీక్ష**

సూరత్, ఫిబ్రవరి 20: గుజరాత్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగినులను నగ్నంగా నిలబెట్టి గైనకాలజీ ఫింగర్ టెస్ట్ నిర్వహించడం తాజాగా వెలుగులోకి వచ్చింది. సూరత్ కార్పొరేషన్‌లో 100 మంది యువతులు మూడేళ్ల క్లర్క్ ఉద్యోగ శిక్షణ పూర్తిచేసుకున్నారు. కొలువు శాశ్వతం కావాలంటే ఫిట్‌నెస్ టెస్ట్ తప్పనిసరి కావడంతో గురువారం సూరత్ మునిసిపల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌కు వెళ్లారు. ఒక్కొక్కరికి విడివిడిగా పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, పదిమందిని ఒకేసారి గదిలోకి పిలిచి దుస్తులు విప్పించారు. వైద్య సిబ్బంది దారుణంగా ప్రవర్తించారని, 'గతంలో ఎప్పుడైనా గర్భం దాల్చారా?' అంటూ అవివాహితలను ప్రశ్నించారని ఉద్యోగినులు వాపోయారు. ఉద్యోగ సంఘాల ఫిర్యాదు మేరకు కమిషనర్ బన్‌చానిది పాణి విచారణ కమిటీ వేశారు.

## సీఏఏపై ఎవరూ భయపడొద్దు

**దేశం నుంచి ఎవర్నీ వెళ్లగొట్టం: ఉద్ధవ్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)పై ఎవరూ భయపడాల్సిన పనిలేదనీ, ఎవర్నీ దేశం నుంచి వెళ్ళగొట్టబోమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ప్రధాని మోదీని కలిసిన తర్వాత శుక్రవారం ఠాక్రే మీడియాతో మాట్లాడారు. గతంలో బీజేపీతో కలిసి సంకీర్ణ భాగస్వామిగా ఉన్న శివసేన...మహారాష్ట్ర ఎన్నికల అనంతరం కాంగ్రెస్, ఎన్సీపీతో కొత్త కూటమి కట్టిన సంగతి తెలిసిందే. "మహారాష్ట్ర సమస్యలపైనా, సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలపై ప్రధానితో చర్చించాను. ఎవరూ భయపడనవసరం లేదు. ఎవర్నీ దేశం నుంచి వెళ్ళగొట్టం" అని ఠాక్రే పేర్కొన్నారు. కాగా, ఉద్ధవ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కూడా కలిసి అర గంటపాటు చర్చలు జరిపారు.



అజ్మీర్ షరీఫ్ దర్గాకు 'చాదర్' బహూకరిస్తున్న ప్రధాని మోదీ



## లీటర్ల కొద్దీ పాలిస్తున్న 5 రోజుల దూడ

పట్టుమని పదిరోజులైనా నిండని లేగదూడ పూటకు లీటరు పాలు ఇచ్చి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కొత్తలోలం గ్రామంలో ఈ వింత ఘటన చోటుచేసుకుంది. మహ్మద్ అజారుద్దీన్ అనే పాడిరైతుకు చెందిన డైరీఫామ్‌లో ఓ జెర్సీ ఆవు ఐదురోజుల క్రితమే లేగదూడకు జన్మనిచ్చింది. అయితే శుక్రవారం దాని పొదుగు పెద్దది కావడాన్ని గమనించిన రైతు.. ఆ పొదుగును తడిమి చూడగా ధారలా పాలు వచ్చాయి. హార్మోన్ల ప్రభావం వల్లే ఈవిధంగా జరుగుతుందని స్థానిక పశువైద్యాధికారి నంద కుమార్ చెప్పారు.

- దిలావర్‌పూర్

## అమెరికాలో జడ్జిగా సరిత కోమటిరెడ్డి



వాషింగ్టన్, ఫిబ్రవరి 21: ప్రవాస భారతీయురాలు సరిత కోమటిరెడ్డి అమెరికాలో జడ్జిగా నియమితులు కానున్నారు. ఆమెను యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఫర్ ది ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌కు న్యాయమూర్తిగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేయనున్నారు. సరిత ప్రస్తుతం అమెరికా అటార్నీ కార్యాలయంలో ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌కు సంబంధించి జనరల్ క్రైమ్స్ డిప్యూటీ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. సరిత.. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో బీఏ చదివారు. అక్కడే మూడేళ్ల జ్యూరిస్ డాక్టర్ (జేడీ) ఫౌండేషన్ కోర్సు చేశారు.

### ప్రధాని సలహాదారులుగా కుల్బే, సిన్హా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ప్రధాని మోదీ సలహాదారులుగా విశ్రాంత ఐఏఎస్‌లు భాస్కర్ కుల్బే, అమర్జీత్ సిన్హా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఇద్దరూ 1983 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు.

### సిసోదియాపై ఈసీకి నిర్భయ దోషి ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: తాను పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా తిరస్కరించడంపై నిర్భయ దోషి వినయ్ శర్మ.. ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాడు. తన పిటిషన్‌ను సిసోదియా తిరస్కరించినపుడు ఢిల్లీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, కాబట్టి ఆయనకు దాన్ని తోసిపుచ్చే అర్హత లేదని శర్మ పేర్కొన్నాడు.

### యూపీలో భారీ బంగారు గనులు

సోన్భద్ర (యూపీ), ఫిబ్రవరి 21: ఉత్తరప్రదేశ్‌లో సోన్భద్ర జిల్లాలోని సోన్ పహడి ప్రాంతంలో 3,500 టన్నుల బంగారు నిల్వలు గల భారీ గనులను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. దీని విలువ మొత్తం 12 లక్షల కోట్లు ఉంటుందని అంచనా!

## కారుతో గుద్ది.. 2 కిలోమీటర్లు ఈడ్చుకువెళ్లి..

**›› భార్య కాపురానికి రానన‌డంతో ఉన్మాది ఘాతుకం**



నేరేడుచర్ల, ఫిబ్రవరి 21: కాపురానికి భార్య రానని మొండికేసింది. దాంతో మూడేళ్ల కూతురిని కిడ్నాప్ చేసి, తీసుకెళ్లాలనుకున్నాడు. అడ్డుపడ్డ భార్య మేనమామను కారుతో గుద్దేశాడు. రెండు కిలోమీటర్లు బానెట్‌పైనే ఈడ్చుకెళ్లి చంపేశాడు. ఈ దారుణ ఘటన తెలంగాణలోని సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నేరేడుచర్లకు చెందిన లారీ డ్రైవర్ గుంజ శంకర్(31) అక్క యాదమ్మ కూతురు శ్రీదేవిని ఐదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కారు డ్రైవర్ ఆలపాటి సుజయ్‌కి ఇచ్చి పెళ్లిచేశారు. పెళ్లైనప్పటి నుంచి అదనపు కట్నం, బంగారం కోసం అత్తింటివారు ఆమెను వేధించేవారు. ఈ క్రమంలో తరచూ శ్రీదేవి తన పుట్టింటికి రావడం.. కొంతకాలానికి సుజయ్ వచ్చి, పెద్దమనుషులతో మాట్లాడి ఆమెను తీసుకెళ్లడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో ఈ నెల 18న కూడా వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో శ్రీదేవి హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరి రాజేశ్వరి ఇంటికి వెళ్లింది. ఈ నెల 20న నేరేడుచర్లకు వచ్చిన సుజయ్.. తన భార్యతో మాట్లాడాలంటూ గొడవపడ్డాడు. దీంతో.. శుక్రవారం శ్రీదేవిని నేరేడుచర్లకు పిలిపించారు. తాను భర్తతో కాపురానికి వెళ్లేది లేదని ఆమె తేల్చిచెప్పడంతో.. భార్యాభర్తలిద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న సుజయ్ తమ కూతురు శాన్విత(3)ను కారులోకి బలవంతంగా ఎక్కించుకుని, కిడ్నాప్ చేసేందుకు యత్నించాడు. ఆ సమయంలో గుంజ శంకర్ అతడిని ముందుకు వెళ్లనీయకుండా కారుకు అడ్డుపడ్డాడు. తాగిన మైకంలో ఉన్న సుజయ్.. శంకర్‌ను ఢీకొట్టి, కారును వేగంగా ముందుకు కదిలించాడు. దీంతో శంకర్ ఎగిరి.. బానెట్‌పై పడ్డాడు. అలా.. జాన్ పహాడ్ రోడ్డు వరకు (2 కిలోమీటర్లు) వెళ్లాడు. ఆ తర్వాత శంకర్ ముందుకు ఎగిరిపడ్డాడు. సుజయ్ అతడి మీదనుంచి కారును పోనిచ్చాడు. అలాగే కారుతో రోడ్డుపై ఈడ్చుకెళ్లాడు. తీవ్రగాయాలైన శంకర్‌ను మిర్యాలగూడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

| థాయ్‌లాండ్ x వెస్టిండీస్ | న్యూజిలాండ్ x శ్రీలంక |
|---|---|
| (గ్రూప్-బి) | (గ్రూప్-ఎ) |
| మ.12.30 నుంచి | సా. 4.30 నుంచి |

స్టార్‌స్పోర్ట్స్ 2, 1 (తెలుగు)



ఇటీవల ఐఓసీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్న బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నాడు.

## ‘ఖేలో’ వర్సిటీ గేమ్స్ నేటినుంచే

ప్రారంభించనున్న ప్రధాని మోదీ

**కటక్:** తొలి ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల క్రీడలు శనివారం మొదలవనున్నాయి. ఈ గేమ్స్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ వర్సిటీ గేమ్స్‌లో దేశవ్యాప్తంగా 159 విశ్వవిద్యాలయాల నుంచి 3,400 మంది అథ్లెట్లు పోటీ పడనున్నారు. మొత్తం 17 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఆతిథ్య కళింగ వర్సిటీ స్టార్ అథ్లెట్ ద్యూతీ చంద్ గేమ్స్‌కు ప్రధాన ఆకర్షణ కానుంది.

# తొలిరోజు తడబ్యాటు

భారత్ 122/5

నిరాశపరిచిన కోహ్లీ ● రహానె, పంత్‌పై ఆశలు

భారీ వర్షం ● టీ తర్వాత ఆట రద్దు




విరాట్ కోహ్లీ (2)

**ఊహించిందే జరిగింది..అసలే బేసిన్ రిజర్వ్ మైదానంలో బలంగా వీచే గాలులు.. దానికితోడు దట్టంగా కమ్ముకొన్న మబ్బులు..ఆపై టాస్ ఓడడం..దాంతో సవాలు విసిరిన వికెట్‌పై బ్యాట్స్‌మెన్ చేతులెత్తేయడంతో తొలిరోజు భారత్ తడబడింది.. అయితే కివీస్ పేస్ ఆరంభ బౌలర్లు సౌథీ, బౌల్ట్ ప్రభావం చూపకపోయినా, మొదటి టెస్ట్ ఆడుతున్న పొడగరైన జేమిసన్ పిచ్‌పై పరిస్థితులను సద్వినియోగం చేసుకొని భారత్‌ను దెబ్బకొట్టాడు.. ఇక భారీ వర్షంతో టీ విరామం తర్వాత తొలి రోజు ఆట కొనసాగలేదు.**

**వెల్లింగ్టన్:** అరంగేట్ర పేసర్ కైల్ జేమిసన్ (3/38) ధాటికి న్యూజిలాండ్‌తో శుక్రవారం ప్రారంభమైన మొదటి టెస్ట్‌లో భారత్ విలవిల్లాడింది. కేవలం 122 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. మయాంక్ అగర్వాల్ (34) పర్లేదనిపించగా..పేలవమైన టెక్నిక్‌తో పృథ్వీ షా (16) నిరాశపరిచాడు. కెప్టెన్ కోహ్లీ (2), హనుమ విహారి (7) ఆదుకోలేకపోయారు. పుజార (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అజింక్యా రహానె (38), పంత్ (10) క్రీజులో ఉన్నారు. ఆరో వికెట్‌కు వీరిద్దరు జోడించింది 21 పరుగులే అయినా ప్రత్యర్థి బౌలర్లను తడబాటు లేకుండా ఎదుర్కోవడం విశేషం. రెండోరోజు ఉదయం సెషన్‌లో వీరిద్దరూ ఇదే తరహాలో ఆడాల్సి ఉంటుంది.

**దట్టంగా మబ్బులు:** టాస్ గెలిచిన కివీస్ కెప్టెన్ విలియమ్సన్ రెండో ఆలోచన లేకుండా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. పిచ్‌పై పచ్చని పచ్చిక. తోడుగా మబ్బులతో కూడిన వాతావరణం. కానీ పేసర్లు సౌథీ, బౌల్ట్ మాత్రం మరీ ప్రమాదకరంగా కనిపించలేదు. ఓపెనర్ పృథ్వీ షా తొలుత దూకుడుగానే ఆడినా..ఐదో ఓవర్లో సౌథీ ఓ అవుట్ స్వింగర్‌తో అతడిని ఊరించాడు. పాదాలను ఏమాత్రం కదలించకుండానే ఆ బంతిని డ్రైవ్ చేయబోయిన షా అందుకు మూల్యం చెల్లిస్తూ (16) క్లీన్‌బౌల్డయ్యాడు.

**జేమిసన్ వస్తూనే..**



జేమిసన్ (3/38)

తర్వాత మయాంక్‌కు, పుజార జత కలవగా..ఇద్దరూ అసలుసిసలు టెస్ట్ ఇన్నింగ్స్ ఆడారు. మరీ మీదకు దూసుకొచ్చిన బంతులు మినహా మిగిలిన వాటిని వదిలేస్తూ కొనసాగారు. కానీ 12వ ఓవర్లో బౌలింగ్ దిగిన జేమిసన్.. పిచ్‌నుంచి లభిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని స్వింగ్, బౌన్స్‌తో హడలెత్తించాడు. అదనపు బౌన్స్‌ను రాబడుతూ తన మూడో ఓవర్లో ఓ ఫుల్‌లెంగ్త్ బంతితో కీపర్ వాట్లింగ్ క్యాచ్ ద్వారా పుజారాను పెవిలియన్‌కు చేర్చాడు. తద్వారా టెస్ట్‌ల్లో తొలి వికెట్ సాధించాడు. అదే ఊపులో, అదే తరహా బంతికి కోహ్లీని టేలర్ క్యాచ్ ద్వారా అవుట్ చేశాడు. అప్పటికి జట్టు స్కోరు 40/3. అనంతరం అగర్వాల్, రహానె జాగ్రత్తగా ఆడుతూ అడపాదడపా షాట్లు కొడుతూ భోజన విరామానికి స్కోరును 79/3కి చేర్చారు. విరామం తర్వాత అగర్వాల్‌ను బౌల్ట్, విహారిని జేమిసన్ అవుట్ చేసి మరోసారి భారత్‌ను దెబ్బకొట్టారు. ఆపై రహానె, పంత్ మరో వికెట్ పడకుండా టీ విరామానికి వెళ్లారు. అయితే భారీ వర్షం కురవడంతో ఆపై ఆట సాధ్యం కాలేదు.

**స్కోరుబోర్డు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** పృథ్వీ షా (బి) సౌథీ 16, మయాంక్ అగర్వాల్ (సి) జేమిసన్ (బి) బౌల్ట్ 34, పుజార (సి) వాట్లింగ్ (బి) జేమిసన్ 11, కోహ్లీ (సి) టేలర్ (బి) జేమిసన్ 2, రహానె (బ్యాటింగ్) 38, హనుమ విహారి (సి) వాట్లింగ్ (బి) జేమిసన్ 7, పంత్ (బ్యాటింగ్) 10, **ఎక్స్‌ట్రాలు 4, మొత్తం 55 ఓవర్లలో: 122/5 వికెట్లపతనం:** 1/16, 2/35, 3/40, 4/88, 5/101 **బౌలింగ్:** సౌథీ 14-4-27-1, బౌల్ట్ 14-2-44-1, గ్రాండ్‌హోమ్ 11-5-12-0, జేమిసన్ 14-2-38-3, అజాజ్ పటేల్ 2-2-0-0

# తిప్పేసిన పూనమ్

ఆరంభ మ్యాచ్‌లోనే ప్రత్యర్థి డిఫెండింగ్ చాంపియన్.. ఇటీవలి ట్రైసిరీస్ ఫైనల్లోనూ ఆ జట్టు చేతిలో ఓటమి ఇంకా మెదులుతూనే ఉంది.. ఇక ఎప్పటిలాగే బ్యాట్స్‌వుమెన్ విఫలం కాగా భారత్ చేసింది 132 పరుగులే. ఇంకేముంది.. సొంతగడ్డపై ఆస్ట్రేలియా ఈ స్వల్పస్కోరును ఉఫ్‌మని ఊదేస్తుందనుకున్నారంతా. కానీ, సిడ్నీ మైదానంలో మన బౌలర్లు అద్భుతమే చేశారు. ముఖ్యంగా లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ మ్యాజిక్ బంతులతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించింది. ఆమె ధాటికి పరుగులు కాదు కదా వికెట్లను ఎలా కాపాడుకోవాలో కూడా ఆ నెంబర్‌వన్ జట్టు బ్యాటర్లకు అర్థం కాలేకపోయింది. ఫలితంగా టీ20 ప్రపంచకప్‌లో ఆసీస్‌కు షాకిచ్చి భారత్ ఘనమైన బోణీ కొట్టింది.

**1**

ఆసీస్ గడ్డపై ఓ మహిళల క్రికెట్ మ్యాచ్‌ను తిలకించేందుకు రికార్డు స్థాయిలో (13,432) ప్రేక్షకులు హాజరవడం ఇదే తొలిసారి.



దీప్తి శర్మ (49 నాటౌట్)

జెమీమా (26)



పూనమ్ యాదవ్ (4/19)

## విలవిల్లాడిన ఆసీస్

డిఫెండింగ్ చాంప్‌నకు భారత్ షాక్

టీ20 మహిళల ప్రపంచకప్

**సిడ్నీ:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ అదిరిపోయే బోణీ చేసింది. శుక్రవారం గ్రూప్-ఎలో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో స్టార్ ఆల్‌రౌండర్లతో కూడిన ఆస్ట్రేలియాపై 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. స్పిన్నర్ పూనమ్ యాదవ్ (4/19), పేసర్ శిఖా పాండే (3/14) పట్టు వదలని పోరాటం ఆసీస్‌ను వణికించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 132 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (49 నాటౌట్) టాప్‌స్కోరర్‌గా నిలవగా, బౌలింగ్‌లోనూ 4 ఓవర్లలో 17 పరుగులే ఇచ్చి కట్టడి చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (15 బంతుల్లో 29) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఆ తర్వాత ఆసీస్ 19.5 ఓవర్లలో 115 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ హీలీ (35 బంతుల్లో 51), గార్డ్‌నర్ (34) మాత్రమే రాణించగా మిగతా తొమ్మిది మంది రెండంకెల స్కోర్లు కూడా దాటకపోగా అంతా కలిసి చేసింది 28 పరుగులే. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా పూనమ్ యాదవ్ నిలిచింది. భారత్ రెండో మ్యాచ్‌ను ఈనెల 24న బంగ్లాదేశ్‌తో ఆడనుంది.

**టపటపా వికెట్లు**

స్వల్ప ఛేదనలో ఓపెనర్ ఆలీసా హీలీ ధాటికి ఆసీస్‌కు చక్కటి ఆరంభమే లభించింది. ఓవైపు వికెట్లు పడుతున్నా తను మాత్రం బౌండరీలతో చెలరేగి 34 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. మరోవైపు బౌలర్ల జోరుకు బెత్ మూనీ (6), మెగ్ లానింగ్ (5) త్వరగానే పెవిలియన్‌కు చేరారు. కానీ హీలీ దూకుడు చూస్తే మ్యాచ్ ఆసీస్ వైపే ఉందనిపించింది. అయితే, ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో పూనమ్ లెంగ్త్ బాల్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో హీలీ కథ ముగిసింది. ఇదే మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత తన మరుసటి ఓవర్‌లోనే పూనమ్ వరుస బంతుల్లో రాచెల్ హేన్స్ (6), ఎలిస్ పెర్రీ (0)లను అవుట్ చేసింది. అయితే మూడో బంతికి జొనాసెన్ క్యాచ్ ఇచ్చినా కీపర్ భాటియా వదిలేయడంతో హ్యాట్రిక్ మిస్ అయ్యింది. ఈ దశలో మిడిలార్డర్‌లో గార్డ్‌నర్ నిలకడను ప్రదర్శించి తుదికంటా నిలిచే ప్రయత్నం చేసినా మరో ఎండ్ నుంచి ఆమెకు మద్దతు లభించింది. ఆఖరి ఓవర్‌లో 21 పరుగులు కావాల్సి ఉండగా శిఖా పాండే ఐదు బంతుల్లో రెండు పరుగులే ఇచ్చి రెండు వికెట్లు తీయగా భారత్‌కు సూపర్ విజయం దక్కింది. ఒత్తిడికి లోనైన ఆసీస్ 14 పరుగులకే చివరి నాలుగు వికెట్లను కోల్పోవడం దెబ్బతీసింది.

**షఫాలీ జోరు.. దీప్తి నిలకడ**

4 ఓవర్లు.. 40 పరుగులు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆరంభంలో ప్రదర్శించిన దూకుడిది. 16 ఏళ్ల టీనేజర్ షఫాలీ వర్మ ఆసీస్ బౌలర్లను ఊచకోత కోయడంతో రన్‌రేట్ ఏకంగా పదితో పరుగులెత్తింది. కానీ మిగతా వారి నుంచి అలాంటి జోరు ఏమాత్రం కనిపించలేదు. స్టార్ ఓపెనర్ మంధాన (10) ఐదో ఓవర్‌లోనే వెనుదిరగగా,



శిఖా పాండే (3/14)

తర్వాతి ఓవర్‌లోనే షఫాలీ కూడా అవుట్ కావడంతో స్కోరు నెమ్మదించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (2) తన పేలవ ఫామ్‌ను కొనసాగించగా, అటు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ జట్టును ఆదుకునే ప్రయత్నం చేసింది. జెమీమా (26)తో కలిసి నాలుగో వికెట్‌కు 53 రన్స్ జోడించింది. అయితే బ్యాటింగ్ కష్టమైన ఈ పిచ్‌పై చివరి 16 ఓవర్లలో భారత్ మూడు ఫోర్లు మాత్రమే సాధించడం తుది స్కోరుపై ప్రభావం చూపింది.

**స్కోరుబోర్డు**

**భారత్:** షఫాలీ (సి) సదర్లాండ్ (బి) పెర్రీ 29; మంధాన (ఎల్బీ) జొనాసెన్ 10; రోడ్రిగ్స్ (ఎల్బీ) కిమ్మిన్స్ 26; హర్మన్‌ప్రీత్ (స్టంప్డ్) హీలీ (బి) జొనాసెన్ 2; దీప్తి శర్మ (నాటౌట్) 49; వేద (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 132/4. వికెట్ల పతనం:** 1-41, 2-43, 3-47, 4-100. **బౌలింగ్:** స్ట్రానో 2-0-15-0; పెర్రీ 3-0-15-1; షట్ 4-0-35-0; జొనాసెన్ 4-0-24-2; కిమ్మిన్స్ 4-0-24-1; గార్డ్‌నర్ 3-0-19-0.

**ఆస్ట్రేలియా:** హీలీ (సి అండ్ బి) పూనమ్ యాదవ్ 51; మూనీ (సి) గైక్వాడ్ (బి) శిఖా పాండే 6; లానింగ్ (సి) భాటియా (బి) గైక్వాడ్ 5; హేన్స్ (స్టంప్) భాటియా (బి) పూనమ్ యాదవ్ 6; గార్డ్‌నర్ (సి అండ్ బి) శిఖా పాండే 34; పెర్రీ (బి) పూనమ్ యాదవ్ 0; జొనాసెన్ (సి) భాటియా (బి) పూనమ్ 2; సదర్లాండ్ (స్టంప్డ్) భాటియా (బి) శిఖా పాండే 2; కిమ్మిన్స్ (రనౌట్) 4; స్ట్రానో (రనౌట్) 2; షట్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 19.5 ఓవర్లలో 115 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-32, 2-55, 3-67, 4-76, 5-76, 6-82, 7-101, 8-108, 9-113, 10-115. **బౌలింగ్:** దీప్తి శర్మ 4-0-17-0; రాజేశ్వరి గైక్వాడ్ 4-0-31-1; శిఖా పాండే 3.5-0-14-3; అరుంధతి 4-0-33-0; పూనమ్ యాదవ్ 4-0-19-4.



షఫాలీ

**నెంబర్ వన్ బౌలర్‌నూ బాదేసింది..**

**16** ఏళ్ల టీనేజర్ షఫాలీ వర్మ బ్యాటింగ్ చూస్తే మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ గుర్తుకు రాకమానడు. బౌలర్ ఎవరైతే నాకేంటి.. తెలిసిందల్లా బంతిని బౌండరీగా బాదడమే నా పని అన్నట్టుగా వీరిద్దరి ఆటతీరు ఉంటుంది. ఈ తరహా బ్యాటింగ్ ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ షఫాలీ ప్రదర్శించింది. ఏకంగా టీ20ల్లో ప్రపంచ నెంబర్‌వన్ బౌలర్ మెగాన్ షట్‌కే చుక్కలు చూపించింది. ఆమె వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో ఈ చిచ్చరపిడుగు ఏకంగా నాలుగు ఫోర్లతో 16 పరుగులు రాబట్టి అదుర్స్ అనిపించుకుంది.

## మయాంక్.. 30 ఏళ్ల రికార్డు



**బంతి** శరీరంపైకి, వికెట్ల మీదకు రివ్వున దూసుకొచ్చే న్యూజిలాండ్ పిచ్‌లపై ఓపెనర్లు తొలి సెషన్ అంతా బ్యాటింగ్ చేయడం మామూలు విషయం కాదు. కానీ మయాంక్ అగర్వాల్ అలా నిలిచి అరుదైన రికార్డు అందుకున్నాడు. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో మొదటి సెషన్ అంతా అగర్వాల్ బ్యాటింగ్ చేశాడు. ఎప్పుడో.. 1990లో నేపియర్‌లో కివీస్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో ఓపెనర్‌గా వచ్చిన మనోజ్ ప్రభాకర్ కూడా తొలి సెషన్ అంతా క్రీజ్‌లో నిలిచాడు. మళ్లీ 30 ఏళ్ల తర్వాత మయాంక్ ఆ ఘనత అందుకున్నాడు.

## సైనా, సమీర్ అవుట్

‘స్పెయిన్’ సెమీస్‌లో జయరామ్

**బార్సిలోనా:** సైనా నెహ్వాల్ బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. క్వార్టర్‌ఫైనల్లో సైనా 20-22, 19-21తో బుసానన్ ఓంగ్‌బమ్రుంగ్‌ఫాన్ (థాయ్‌లాండ్) చేతిలో కంగుతిన్నది. కాగా.. పురుషుల సింగిల్స్‌లో అజయ్ జయరామ్ 21-14, 21-15తో థామస్ రుక్సెల్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. మరో భారత షట్లర్ సమీర్ వర్మ 21-17, 17-21, 12-21తో కున్లావత్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు.

## ఆసియా లెవెన్‌కు కోహ్లీ, ధవన్

**న్యూఢిల్లీ:** వరల్డ్ లెవెన్‌తో జరిగే రెండు అంతర్జాతీయ టీ20ల్లో ఆసియా లెవెన్ నుంచి విరాట్ కోహ్లీ, శిఖర్ ధవన్, షమి, కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ వీరి పేర్లను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు పంపాడు. బంగ్లా జాతిపిత షేక్ ముజీబుర్ రెహ్మాన్ శత జయంతిని పురస్కరించుకుని ఢాకాలో వచ్చే నెల 18, 21తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. భారత ఆటగాళ్ల ప్రాతినిథ్యంపై అనుమానాలు నెలకొన్నా ఆసియా లెవెన్‌లో పాక్ ఆటగాళ్లెవరూ లేకపోవడంతో బోర్డు తమ క్రికెటర్లను పంపనుంది. మరోవైపు తమ ప్లేయర్స్ పాక్ సూపర్ లీగ్‌లో బిజీగా ఉండడంతోనే పంపలేకపోతున్నామని ఆ దేశ క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది.

## సౌరాష్ట్ర భారీ స్కోరు

జానీ సెంచరీ ● ఆంధ్రతో రంజీ క్వార్టర్స్

**ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రతో రంజీ క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు చేసింది. చిరాగ్ జానీ (121) సెంచరీతో విజృంభించడంతో.. ఓవర్‌నైట్ స్కోరు 226/6తో రెండో రోజైన శుక్రవారం ఆట కొనసాగించిన సౌరాష్ట్ర 419 వద్ద ఆలౌటైంది. ప్రేరక్ మన్కడ్ (80) అర్ధ సెంచరీతో మెరిశాడు. చిరాగ్-ప్రేరక్ ఏడో వికెట్‌కు 157 రన్స్ జోడించారు. శశికాంత్ (3/149), పృథ్వీరాజ్ (3/51) మూడేసి వికెట్లు తీశారు. స్టీఫెన్ (2/72) రెండు, కరణ్ షిండే (1/4), మహ్మద్ రఫీ (1/82) చెరో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర ఆట చివరకు 40/2 స్కోరుతో కష్టాల్లో పడింది.



చిరాగ్ జానీ (121)

## క్రికెట్‌కు ఓఝా గుడ్‌బై



**ముంబై:** హైదరాబాద్‌కు చెందిన లెఫ్టామ్ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓఝా క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అంతర్జాతీయ, జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ట్విటర్ ద్వారా శుక్రవారం వెల్లడించాడు. 2008లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఓఝా..2013లో ముంబైలో చివరి టెస్ట్ ఆడాడు. సచిన్ ఆఖరి టెస్ట్ కూడా అదే కావడం గమనార్హం. అయితే దేశవాళీల్లో మాత్రం గతేడాది వరకు కొనసాగాడు. 16 ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో మొత్తం 24 టెస్ట్‌లు ఆడిన 33 ఏళ్ల ప్రజ్ఞాన్ 113 వికెట్లు పడగొట్టాడు. 18 వన్డేల్లో 21, ఆరు టీ20ల్లో 10 వికెట్లు సాధించాడు. రంజీల్లో హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ‘జీవితంలో తదుపరి దశకు వేళైంది. నాకు మద్దతుగా నిలిచి, ప్రేమాభిమానులు పంచిన అందరికీ కృతజ్ఞతలు’ అని ఓఝా ట్వీట్ చేశాడు. ప్రజ్ఞాన్‌ను టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ అభినందిస్తూ ‘ముంబై ఇండియన్స్, భారత జట్టు సహచరుడిగా నీతో ఎన్నో మధురానుభూతులు పంచుకున్నా. మన స్నేహం క్రికెట్ మైదానానికి మించినది’ అని ట్వీట్ చేశాడు.

## సాక్షికి రజతం.. వినేశ్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల పతక పట్టు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన పోటీల్లో ఓ రజతం, మూడు కాంస్యాలు భారత్ ఖాతాలో చేరాయి. ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ (65 కిలోలు) రజత పతకంతో మెరవగా.. మరో స్టార్ వినేశ్ ఫొగట్ (53 కిలోలు), యువ రెజ్లర్లు అన్షు మాలిక్ (57 కిలోలు), గురుశరణ్‌ప్రీత్ కౌర్ (72 కిలోలు) కంచు మోత మోగించారు. ఫైనల్లో సాక్షి 0-2తో నవోమి రుకీ (జపాన్) చేతిలో ఓడి రజతానికే పరిమితమైంది. కాంస్యం కోసం జరిగిన ప్లేఆఫ్స్ బౌట్లలో తి లి కియు (వియత్నాం)పై వినేశ్ ఫొగట్, సెవారా (ఉజ్బెకిస్థాన్)పై అన్షు, ఎక్‌బయార్ (మంగోలియా)పై గురుశరణ్‌ప్రీత్ కౌర్ గెలిచారు. దీంతో ఈ టోర్నీలో భారత మహిళలు ఓవరాల్‌గా 8 పతకాల (3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలు)తో అత్యుత్తమ ప్రదర్శన చేస్తున్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*